
RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in




హైదరాబాద్ | 28 అక్టోబర్ 2025 మంగళవారం | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:1234



ప్రజాబలం

28 అక్టోబర్ 2025 మంగళవారం

# వాయుగండాలు

ప్రపంచంలోనే అతి పెద్ద తీరప్రాంతం బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉంది. సుమారు 50 కోట్ల మంది ఈ తీర ప్రాంతంలో నివసిస్తున్నారు.అలాగే ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన తుపానుల్ని ఎదుర్కొంటోంది కూడా ఈ తూర్పు తీర ప్రాంతమే.వాతావరణ వివరాలను అందించే వెబ్ సైట్ వెదర్ అండర్ గ్రౌండ్‌లో ఈ తీరానికి సంబంధించి కొన్ని ఆసక్తికర వివరాలున్నాయి. ప్రపంచ చరిత్రలో అత్యంత ఘోరమైన 35 తుపానుల్లో 27 పెను తుపాన్లు ఈ తీరంలోనే సంభవించాయి.బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.ఘోరమైన తుపానులన్నీ బంగాళాఖాతంలోనే సంభవిస్తుంటాయని చెబుతారు వాతావరణ పరిశోధకులు. ఇక్కడ లోతు తక్కువగా ఉంటూ ఒక వైపుకు తీర ప్రాంతం వంగినట్లు ఉండి పల్లంగా ఉంటుంది.సాధారణంగా తుపాను సమయంలో వీచే బలమైన గాలులు నీటిని బలంగా ఒడ్డువైపుకు తోస్తాయి. ఫలితంగా అలల వేగం ఒక్కసారిగా పెరిగి నేరుగా తుపాను తీరాన్ని తాకుతుంది.బంగాళాఖాతం ఉపరితలంలో ఉష్ణోగ్రతలు ఎప్పుడూ అధికంగా ఉండటం కూడా ఈ పరిస్థితికి ఒక కారణం. ఫలితంగా తీవ్ర తుపానులు సంభవిస్తుంటాయి.”అక్కడ ఉష్ణోగ్రతల స్థాయి చాలా ఎక్కువ” అని భారత వాతావరణ పరిశోధన విభాగ అధిపతి డి.మహాపాత్ర వ్యాఖ్యానించారుప్రపంచవ్యాప్తంగా ఈ తరహా పెను తుపానులు సంభవించే మరికొన్ని తీర ప్రాంతాలు కూడా ఉన్నాయి. అందుకు ఉదాహరణ లూసియానాలోని గల్ఫ్ తీర ప్రాంతం.”కానీ బంగాళాఖాతపు ఉత్తర తీర ప్రాంతంలో తుపానులు ఒక్కసారిగా విరుచుకుపడి పెను నష్టానికి కారణమవుతాయి. భూమిమీద ఇంకెక్కడా ఇంత దారుణమైన పరిస్థితులు తలెత్తవు” అని హెన్సన్ అన్నారు.తూర్పు తీర ప్రాంతంలో జనసాంద్రత అధికంగా ఉండటం కూడా తీవ్ర నష్టానికి కారణమవుతోంది. ఇక ప్రపంచవ్యాప్తంగా ప్రతి నలుగురిలో ఒకరు తీర ప్రాంతాల్లోనే ఉంటున్నారు.తుపానుల వల్ల అనేక విపత్తులు ఎదురవుతాయి. బలమైన గాలుల కారణంగా భౌతిక నష్టం ఎక్కువగా ఉంటుంది. అలాగే సముద్రంలో అలల పోటు తీవ్రంగా ఉంటుంది ఈ రెండింటితో పాటు భారీ వర్షాలు జన జీవనాన్ని అస్తవ్యస్తం చేస్తాయి.సాధారణంగా బంగాళాఖాతంలోనూ, అరేబియా సముద్రంలో తరచూ తుపానులు వచ్చినా ప్రతి పదేళ్లకు ఒకసారి మాత్రమే ఈ స్థాయి తుపానులు విరుచుకుపడుతుంటాయి. మన భారతదేశ భౌగోళిక స్వరూప దృష్ట్యా మనం ఈ తూఫాన్లను చూస్తూ ఉంటాం. సాధారణంగా ఇవి భూమధ్య రేఖకు 500 కిమీ నుండి 25000 కిమీ ల మధ్య మాత్రమే ఏర్పడతాయి. అందుకే వీటిని మనం ఉష్ణ మండల తూఫాను గా సంబోధిస్తాము.తూఫాను అన్నది సముద్ర జలాల పై ఏర్పడే అల్ప పీడన ప్రాంతమే. కానీ ఇక్కడ కేంద్రం చుట్టూ ఉన్న ఎన్విరాన్మెంట్ కన్నా వెచ్చగా ఉండి అపసవ్య గడియార దిశలో తిరుగుతూ ఉంటుంది. ఇక్కడ నేను అతి తక్కువ శాస్త్రీయ పదాలు ఉపయోగించి అందరికీ అర్థం అయ్యేలా రాయడానికి ప్రయత్నిస్తాను.తూఫాను ఏర్పడడానికి ముందు కచ్చితంగా ఈ క్రింద తెలపడిన అంశాలు ఉండి తీరాలి.ముందుగా సముద్ర ఉపరితల జల ఉష్ణోగ్రత కచ్చితంగా 26.5 డిగ్రీ సెంటిగ్రేడ్ కన్నా ఎక్కువ ఉండాలి.సముద్ర వాతావరణం గా ఉండాలివాతావరణ మధ్య పొరలలో ఎక్కువ ఆర్ద్రత లభించాలి.కరియోలిస్ ఫోర్స్ (ఇది తూఫాను అపసవ్య గడియార దిశలో తిరిగేందుకు)

ఒక దృఢమైన వాతావరణ అలజడి (అల్ప పీడన ప్రాంతం)ఎప్పుడైతే పైన తెలుపబడిన అంశాలు వాతావరణం లో లభ్యమవుతాయో అప్పుడు ఒక అల్ప పీడనం తూఫాను గా రూపాంతరం చెందడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి.ముందుగా వెచ్చని తేమతో కూడిన సముద్ర ఉపరితల గాలులు వాతావరణ పై పొరలలోకి వెళ్ళేటప్పుడు తక్కువ సాంద్రత కలిగిన గాలిని క్రింది వాతావరణ పొరల్లో వదిలేస్థాయి. కాబట్టి అక్కడ అల్ప పీడన ప్రాంతం ఏర్పడుతుంది.ఎప్పుడయతే ఈ అల్ప పీడన ప్రాంతం ఏర్పడిందో, దానికి చుట్టూ ఉన్న గాలి ఆ ప్రాంతం లోకి వచ్చి అది కూడా తేమను సంగ్రహించి పై పొరలలో కి వెళ్తుంది. ఈ ప్రక్రియ అలా జరుగుతూ ఉంటుందిఎప్పుడైతే ఈ వెచ్చనైన తేమతో కూడిన గాలి పై పొరలలో చల్లర్చబడినదో, వెంటనే మేఘాలు ఏర్పడుతాయి. ఆ పై సముద్ర ఉష్ణ శక్తి మరియు ఉష్ణ ఎవాపోరేషన్ దోహదపడి, కారియోలిస్ ఫోర్స్ కారణంగా ఈ మేఘాలు అప గడియార దిశలో తిరగడం ప్రారంభిస్తాయి.ఈ మేఘాలు, వాతావరణ అనుకూల స్థితుల దృష్ట్యా మరింత వేగం గా తిరుగుతాయి. ఇలా తిరగడం వలన ఉపరితల గాలుల తీవ్రత అధికంగా ఉంటాయి. ఈ ఉపరితల గాలులు (10ఎ ఎత్తు వద్ద) ఎప్పుడైతే 34 నాట్స్ (1 నాట్ = 0.514 ఎ/బ) చేరతాయో అప్పుడు ఆ వాతావరణ స్థితిని తూఫాను గా ప్రకటిస్తారు.ఈ గాలుల తీవ్రత నిర్దిష్ట పరిమితి దాటిన తర్వాత వాటి యొక్క స్థాయిని వాతావరణ శాఖ వారు వేరు వేరు స్టేజ్ లుగా ప్రకటిస్తారు.ఉష్ణ మండల తూఫాను (34 నుండి 47 నాట్స్ వరకు)తీవ్ర తుఫాను (48 నుండి 63 నాట్స్ వరకు)అతి తీవ్ర తుఫాను (64 నుండి 89 నాట్స్ వరకు)అత్యంత తీవ్ర తుఫాను (90 నుండి 119 నాట్స్ వరకు)మహా తూఫాను (120 నాట్స్ నుండి)ఈ తుఫాను ఎప్పుడైతే భూ భాగం పై కి వస్తుందో (ఈ పక్రియ ను తీరం దాటడం గా అభివర్ణిస్తారు) అప్పుడు ఈ భీకర ఉపరితల గాలులు మరియు అతి భారీ వర్షాల వల్ల తీవ్ర నష్టం కలిగిస్తుంది. అయితే తీరం దాటిన తరువాత నీటి లభ్యత లేక ఇవి క్రమేపీ వాటి తీవ్రతను కోల్పోతూ చివరకు నశిస్తాయి.1970 నవంబర్లో వచ్చిన సైక్లోన్ భోలా ప్రపంచ చరిత్రలోనే అత్యంత ఘోరమైన తుపానుల్లో ఒకటి. బంగాళాఖాతంలో సంభవించిన ఈ తుపాను కారణంగా సుమారు 50 లక్షల మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ తుపాను సమయంలో తీర ప్రాంతంలో అలలు సుమారు 34 అడుగుల ఎత్తున ఎగసిపడ్డాయి.గడిచిన కొన్ని దశాబ్దాలుగా బంగాళాఖాతంలో సంభవించే తుపానుల తీవ్రత పెరుగుతూ వస్తోంది.2008 మే నెలలో బర్మా తీరంలో సంభవించిన ‘నర్గిస్’ తుపాను కారణంగా సుమారు లక్షా 40 వేల మంది ప్రాణాలు కోల్పోగా, 20 లక్షల మంది నిరాశ్రయులయ్యారు.చివరిసారిగా 1999లో సూపర్ సైక్లోన్ భారత్‌లో ఒడిశా రాష్ట్రాన్ని తాకింది. ఆ తుపాను ధాటికి సుమారు 10 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. ఎటు చూసినా కుళ్లిన శవాలు, శ్మశానాల్లో ఆకాశాన్ని అంటుతున్న పొగ.. అప్పట్లో తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రయాణించిన నాకు కనిపించిన దృశ్యాలవి. నాటి భయానక పరిస్థితి ఇప్పటికి నాకు గుర్తుంది. ఓ సూపర్ సైక్లోన్ ధాటికి పరిస్థితులు ఎంత దారుణంగా తయారవుతాయో మొదటిసారిగా అప్పుడే తెలిసింది.

# ఫలించిన మంత్రి తుమ్మల కృషి.. ఖమ్మం నగరానికి మంచినీటికి శాశ్వత పరిష్కారం

**రూ.200 కోట్లు మంజూరు చేసిన రాష్ట్ర ప్రభుత్వం**

**పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా అద్భుత ప్రణాళికలతో మంచినీటి సరఫరాలి**

**8 నెలలు మున్నేరు నుంచి సురక్షిత నీరు, 4 నెలలు పాలేరు జలాశయం నుంచి**

**గతంలో దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా ఖమ్మం త్రీ టౌన్ కు మంచినీరు**

**ఖమ్మానికి లకారం నుంచి నీటి సరఫరా**






**ఖమ్మం అక్టోబర్ 27 (ప్రజాబలం బ్యూరో)** అపర భగీరథుడు వ్యవసాయ శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వరరావు కృషి ఫలించింది. ఖమ్మం నగర ప్రజలు ఎదుర్కొంటున్న మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలనే ఆయన సంకల్పంకు అడుగులు పడ్డాయి. రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం నగరానికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు శాశ్వత పరిష్కారం కోసం రూ.200 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ మేరకు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ శాఖ %+.ా అశీ%.747 తేదీ 25.10.2025 ద్వారా ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ప్రాజెక్టు రూపకల్పనతో ఖమ్మం కార్పొరేషన్ ప్రజల కల సాకారం చేసిన అపర భగీరధుడిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఖ్యాతి పెరిగింది ఆయన తపనతో ఈ ప్రణాళిక రూపుదిద్దుకోగా, పెరుగుతున్న జనాభా అవసరాలను దృష్టిలో ఉంచుకొని ఖమ్మం నగరానికి అద్భుత స్థాయిలో నీటి సరఫరా వ్యవస్థను రూపొందించారు.ప్రజాబలంరు, పాలేరు నుంచి నీటి సరఫరా నగరానికి సంవత్సరమంతా నిరంతరంగా మంచినీరు అందించేలా ప్రణాళిక రూపొందించారు.

మున్నేరు నది నుంచి ఎనిమిది నెలలపాటు నీటి సరఫరా జరుగుతుండగా, వేసవి నెలల్లో పాలేరు జలాశయం నుంచి నీరు అందించనున్నట్లు మంత్రి తుమ్మల వెల్లడించారు ఈ విధంగా రెండు వనరుల ఆధారంగా ఖమ్మం నగరానికి నిరాటంకంగా రక్షిత నీటి సరఫరా జరిగేలా ముందు చూపుతో ప్రణాళికలు చేశారు

గతంలో దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా త్రీ టౌన్ కు నీరు

గతంలో నగరంలోని త్రీ టౌన్ ప్రాంతాలకు దానవాయిగూడెం ఫిల్టర్ బెడ్ ద్వారా నీటి సరఫరా నిర్వహించబడేది. ఇప్పుడు ఆ వ్యవస్థను మరింత విస్తరించి ఆధునిక సదుపాయాలతో అప్‌గ్రేడ్ చేయనున్నారు

ఖమ్మం నగరానికి ప్రధాన వనరుగా లకారం

ఇప్పటివరకు ఖమ్మం నగరానికి ప్రధానంగా లకారం ట్యాంకు నుంచే నీటి సరఫరా కొనసాగుతోంది. అయితే, నగర విస్తరణతో పాటు జనాభా పెరగడంతో ప్రస్తుతం ఉన్న వనరులు పూర్తిస్థాయిలో సరిపోవడం లేదు. దీనికి పరిష్కారంగా కొత్త పైపులైన్ వ్యవస్థలు, ఫిల్టర్‌బెడ్‌లు, పంప్‌హౌస్‌లు నిర్మించే ప్రణాళిక సిద్ధమవుతోంది.

ఖమ్మం అభివృద్ధికి పునాది

రక్షిత మంచినీటి సమస్యకు ఈ ప్రాజెక్టు శాశ్వత పరిష్కారాన్ని అందించడమే కాకుండా, భవిష్యత్‌లో ఖమ్మం నగర అభివృద్ధికి పునాది వేయనుంది. మౌలిక సదుపాయాల విస్తరణతో పాటు పరిశుభ్రత, ఆరోగ్య పరిరక్షణలో కూడా ఈ ప్రణాళిక కీలక పాత్ర పోషించనుంది.

మంత్రి తుమ్మల సంకల్ప ఫలితం

గతంలో మంత్రిగా ఉన్నప్పటి నుంచే ఖమ్మం నగర అభివృద్ధి పట్ల తుమ్మల నాగేశ్వరరావు గారు చూపిన చిత్తశుద్ధి, నిరంతర కృషి ఈరోజు ఫలితాలుగా మారాయి. ప్రజల అవసరాలను గుర్తించి, వాటిని తీర్చే దిశగా ప్రభుత్వం వేగంగా నిర్ణయాలు తీసుకోవడం పట్ల నగర ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి తుమ్మల చూపిన చొరవ, కృషి ఫలితంగా కాంగ్రెస్ సర్కారు 200 కోట్లు కేటాయించిందని, ఖమ్మం నగర ప్రజలు గౌ. ముఖ్య మంత్రికి మరియు మంత్రి తుమ్మల కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నారు

# తప్పుడు ప్రచారం చేస్తే పరువు నష్టం దావా వేస్తా.. మంత్రి జూపల్లి కృష్ణారావు




హైదరాబాద్, అక్టోబర్ 27 : తనపై పని కట్టుకుని ఒక వర్గం మీడియా, సోషల్ మీడియా దుష్ప్రచారం చేస్తోందని, వికృత రాజకీయాలు చేస్తున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులకు పిర్యాదు చేయడంతో పాటు పరువు నష్టం దావా వేస్తానని పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు హెచ్చరించారు.

ఆర్టీఐ ద్వారా కొన్ని శాఖలకు సంబంధించిన సమాచారాన్ని అడిగించినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. తనపై నిరాధార ఆరోపణలు చేస్తూ ప్రచురించిన కథనాల ద్వారా ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందని ఆయన పేర్కొన్నారు

నా పరువుకు భంగం కలిగించేలా, నన్ను అప్రతిష్ఠపాలు చేసేందుకు కొందరు ఉద్దేశపూర్వకంగా కుట్ర పన్నుతున్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం కొందరు వ్యక్తులు, వర్గాలు ఈ విధంగా అబద్ధాలను ప్రచారం చేస్తూ ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేస్తున్నారు,” అని ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

అసత్య ప్రచారంపై చట్టపరమైన చర్యలు ఇప్పటికే ప్రారంభించామని, ఆ వార్తను ప్రచురించిన సంస్థలు , సోషల్ మీడియా దపోస్టుల వెనుక ఉన్న బాధ్యులైనవ్యక్తులపై పరువు నష్టం దావా దాఖలు చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

“ప్రజాసేవకుడిగా నేను ఎల్లప్పుడూ ప్రజల మన్ననలు పొందే విధంగా నిష్పాక్షికంగా, పారదర్శకంగా పని చేస్తున్నాను. నాకు ఉన్న రాజకీయ ప్రస్థానం ప్రజల నమ్మకం మీదే నిలిచింది. ఇలాంటి తప్పుడు ఆరోపణలతో నా పేరు చెడగొట్టాలన్న ప్రయత్నాలు విఫలమవుతాయి,” అని మంత్రి జూపల్లి స్పష్టం చేశారు.

ఏ సమాచారమైతే ప్రజలకు చేరవేస్తారో, అది నిజ నిర్ధారణ చేసుకుని ప్రచురించాలి. కేవలం పుకార్ల ఆధారంగా కథనాలు రాయడం ప్రజలను తప్పుదారి పట్టించడమే అవుతుంది,” అని హెచ్చరించారు. తనపై ఉద్దేశపూర్వకంగా చేస్తున్న అసత్య ప్రచారం వెనుక ఉన్న వ్యక్తులను గుర్తించి, తగిన చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు.

అసత్య ప్రచారం చేస్తే చూస్తూ ఊరుకోమని హెచ్చరించారు. బోథ్ లో కూడా ఓ సభలో తాను మాట్లాడిన విషయాలను వక్రీకరించి బురద చల్లే ప్రయత్నం చేశారని, ఇప్పుడు ఇలా కట్టుకథలు అల్లి ఒక పథకం ప్రకారం తనను అప్రతిష్ట పాలు చేయడానికి కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి నిరాధారమైన ఆరోపణలు చేసే వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. అబద్ధపు ప్రచారాలు చేస్తున్నవారికి లీగల్ నోటీసులు పంపుతామని, పరువు నష్టం దావా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలని చెప్పారు

# భువనగిరి కలేక్టర్ లో జరిగిన సమీక్షా సమావేశంలో పాల్గొన్న ఎంపీ చామల



**యాదాద్రి భువనగిరి జిల్లా ప్రజాబలం ప్రతినిధి** యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ లో రోడ్డు ,భవనాలు & సినిమాటోగ్రఫీ శాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి , భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి , ఆలేరు శాసనసభ్యులు ప్రభుత్వ విప్ బీర్ల ఐల్లయ్య తో కలిసి పత్తి కొనుగోలు, ధాన్యం కొనుగోలు పైన సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఎంపీ చామల మాట్లాడుతూ: పత్తి మరియు ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి రైతులకు ఎలాంటి ఇబ్బంది కలవకుండా చూడాలని అన్నారు,ఈ కార్యక్రమంలో యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in






## జూబ్లీహిల్స్ ఎన్నికలలో విజయం ఖాయం.. టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్.



ఎన్నికల భాద్యులకు దిశా నిర్ధేశం చేసిన టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క..

నాయకులందరూ సమిష్టి గా కృషి చేయాలి. అధిక మెజార్టీ సాధించాలి..

అప్పగించిన బాధ్యతలు పకడ్బందీగా చేపట్టాలి. చిన్న నిర్లక్ష్యం కూడా వద్దు..

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో టీపీసీసీ ఆధ్వర్యంలో టూరిజం ప్లాజా లో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్,



ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, డివిజన్ లలో బాధ్యతలు చేపట్టిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్ లు తదితరులు

## మహిళల ఆర్థిక అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం మొగిలి సునీతారావు







**నాంపల్లి ప్రజాబలం ప్రతినిధి:** నాంపల్లి నుండి తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీమతి మొగిలి సునీతారావు ఆర్టీసీ బస్సులలో మహిళలతో ప్రయాణించి ప్రయాణికులతో మహాలక్ష్మి స్కీం ద్వారా ప్రజలు ఏ విధంగా లబ్ధి పొందుతున్నారో కాంగ్రెస్ సంక్షేమ పథకాల గురించి ప్రజలతో మాట్లాడడం జరిగింది.

ఆర్టీసీ బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు రేవంత్ రెడ్డి ప్రభుత్వంలో మహిళలకు మహాలక్ష్మి పథకం ద్వారా ఎక్కడికి వెళ్లాలన్న ఫ్రీగా వెళ్తున్నామని ఆఫీస్ కి వెళ్ళాలి అన్న కాలేజీకి వెళ్లాలన్న గుడికి వెళ్లాలన్న బంధువుల ఇంటికి వెళ్లాలన్న బస్సులో ఉచితంగా వెళుతున్నాము మాకు ఈ పథకం ద్వారా చాలా డబ్బులు ఆదా అవుతున్నాయని చెప్తున్నారు.

సునీత రావు మాట్లాడుతూ మహాలక్ష్మి పథకం ద్వారా ఇప్పటివరకు 6 వేల కోట్లు మహిళల కోసం ఖర్చు పెడుతున్నారు. 200 యూనిట్ల కరెంటు బిల్లు ఫ్రీగా ఇస్తున్నాము. 500 కే ఎల్పిజి సిలిండర్ ఇవ్వడం జరుగుతుంది. సన్న బియ్యం ఆరోగ్యశ్రీ 10 లక్షల వరకు ఉచితంగా.ఈరోజు పేదలు కడుపునిండా తింటున్నారు. 10 సంవత్సరాల బిఆర్ఎస్ ప్రభుత్వంలో మీరు ఏం చేసినారని ఎద్దేవేశారు.

హరీష్ రావుకు ఈరోజు ఆటో కార్మికులు గుర్తుకు వస్తున్నారా 10 సంవత్సరాల నుండి తెలంగాణలో ఒక్క రేషన్ కార్డు ఒక ఉద్యోగం ఇవ్వకుండా ప్రజలను మోసం చేసినారు. ఆటో కార్మికులను రెచ్చకొడుతూ అడ్డదిడ్డంగా మాట్లాడితే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు.

జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుస్తున్నారని భయంతో అక్కస్సుతో ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు కాంగ్రెస్ అభ్యర్థి భారీ మెజార్టీతో గెలుస్తారని దీమ వ్యక్తం చేశారు. మీరు అబద్ధపు మాటలు మాట్లాడితే మహిళలు ఊరుకోరని తరిమి తరిమి కొడతారని మీ ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే కాంగ్రెస్ వాళ్లు ఊరుకోరు ఖబర్దార్ బిఆర్ఎస్ నాయకుల్లారా

మిగులు బడ్జెట్ తో తెలంగాణ ఇస్తే అప్పుల తెలంగాణగా చేసి 7 లక్షల కోట్లు బిఆర్ఎస్ నాయకులు మింగేశారని సునీత రావు అన్నారు.

కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 2 సంవత్సరాలు కూడా కాలేదు. మీరు 10 ఏళ్లలో చెయ్యని పనులు రెండు సంవత్సరాలలో కాంగ్రెస్ పార్టీ రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తుందని సునీత రావు బిఆర్ఎస్ నాయకులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్స్ స్టేట్ ఆఫీస్ బేరర్స్. కాన్స్టెన్సీ ప్రెసిడెంట్స్.

## వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్థవంతంగా నిర్వహించాలి

### రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి



**ప్రజాబలం మంచిర్యాల నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 27 :** రాష్ట్రంలో వరి ధాన్యం, పత్తి కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు,రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు లతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లు,రెవెన్యూ అదనపు కలెక్టర్లు, జిల్లా పౌరసరఫరాలు, వ్యవసాయ,గ్రామీణ అభివృద్ధి,రవాణా శాఖల అధికారులతో వరి ధాన్యం,పత్తి కొనుగోలు, అకాల వర్షాల కారణంగా తీసుకోవలసిన జాగ్రత్తలపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి మాట్లాడుతూ... తుఫాను వల్ల అకాల వర్షాల నేపథ్యంలో వరి ధాన్యం,పత్తి కొనుగోలు ప్రక్రియకు ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని,ప్యాడి క్లీనర్లు,తేమ యంత్రాలు అవసరం మేరకు సమకూర్చాలని తెలిపారు.

రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్,సహకార శాఖ మంత్రి మాట్లాడుతూ తుఫాను తీవ్రత అధికంగా ఉన్నందున అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. తుఫాను తీవ్రత తగ్గేవరకు హార్వెస్టింగ్ ప్రక్రియ నిలిపి వేయాలని,హార్వెస్టింగ్ చేసిన ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రైతులు నష్టపోకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని,ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.పత్తి కొనుగోలు కపాస్ కిసాన్ యాప్ ద్వారా చేయడం జరుగుతుందని, ఈ యాప్ లో కౌలు రైతులు కూడా సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల సహాయంతో వివరాలు నమోదు చేసుకోవాలని తెలిపారు.వరి ధాన్యం, పత్తి రైతులు తేమ శాతం నిబంధనల ప్రకారం ఉండేలా చూసుకోవాలని,తేమ శాతాన్ని పెంచాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయడం జరుగుతుందని తెలిపారు. సరిహద్దు జిల్లాల వారు అప్రమత్తంగా ఉండాలని, బయట రాష్ట్రాల నుండి వచ్చే వరి ధాన్యం, సోయాబీన్,కందులు, పెసలు అక్రమ రవాణా జరగకుండా పర్యవేక్షించాలని తెలిపారు.రాష్ట్ర పౌరసరఫరాల కమిషనర్ రవీంద్ర మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని, వర్షాల దృష్ట్యా ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు.గ్రేడ్ ఏ రకానికి క్వింటాలుకు 2 వేల 389 రూపాయలు, సాధారణ రకానికి క్వింటాలుకు 2 వేల 369 రూపాయలుగా మద్దతు ధర నిర్ణయించడం జరిగిందని,సన్న రకం వడ్లకు మద్దతు ధరతో పాటు క్వింటాలుకు 500 రూపాయలు అదనంగా అందించడం జరుగుతుందని తెలిపారు.కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలను కవర్లను అందుబాటులో ఉంచాలని,ధాన్యం తడవకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని తెలిపారు.రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి సురేంద్ర మోహన్ మాట్లాడుతూ పత్తి కొనుగోలు ప్రక్రియ కొరకు చర్యలు చేపట్టాలని, కపాస్ కిసాన్ యాప్ లో రైతుల వివరాలు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. పత్తి కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి అవసరమైన అన్ని జాగ్రత్తలు పాటిస్తూ పత్తి కొనుగోలు చేయాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ... ప్రభుత్వ నిబంధనల ప్రకారం జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి ధాన్యం, పత్తి కొనుగోలు చేయడం జరుగుతుందని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కనీస మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్యాడి క్లీనర్లు, టార్పాలిన్లు, ఇతర సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.జిల్లాలో 301 వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, సి సి ఐ ఆధ్వర్యంలో పత్తి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొనుగోలు కొరకు పూర్తిస్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పోలీసు అధికారులు వేధింపులకు గురి చేస్తున్నారు

### షేక్ రియాజ్ తల్లి, భార్య మరియు చిన్నపిల్లలు తెలంగాణ మానవ హక్కుల కమిషనన్ కు ఫిర్యాదు



**గోషామహల్ ప్రజాబలం ప్రతినిధి:** సోమవారం నాడు ఇటీవల పోలీస్ ఎన్‌కౌంటర్‌లో మరణించిన షేక్ రియాజ్ తల్లి, భార్య మరియు చిన్నపిల్లలు తెలంగాణ మానవ హక్కుల కమిషన్ (టీజీహెచ్ఆర్సీ) ముందు హాజరై ఫిర్యాదు సమర్పించారు.

వారు తమను స్వగృహంలోకి అనుమతించకపోవడం, పోలీసు అధికారులు వేధింపులు చేయడం, శారీరకంగా హింసించడం మరియు థర్డ్ డిగ్రీ ప్రయోగించడం చేస్తున్నారని ఫిర్యాదు చేశారు.

మరణించిన పోలీస్ కానిస్టేబుల్ ప్రమోద్ కుమార్ తమ వ్యక్తి - షేక్ రియాజ్ ను రూ.3,00,000/- రూపాయలు ఇవ్వమని డిమాండ్ చేయగా, అందులో రూ.30,000/- ఇప్పటికే చెల్లించారని, మిగితా డబ్బులు ఇవ్వాలని వేధించాడని మరియు వారి ఇద్దరి మధ్య కొన్ని మోసపూరిత ధన లావాదేవీలు జరిగినట్లు తెలిపారు.

ఈ సంఘటనపై కమిషన్ ఇప్పటికే పత్రికా కథనాన్ని ఆధారంగా తీసుకుని సూమోటో కేసు నమోదు చేసి హెచ్ఆర్సీ .నెం6745/2025 ప్రకారం తెలంగాణ డీజీపీ ని తేదీ 24.11.2025 నాటికి వాస్తవ నివేదిక సమర్పించమని ఆదేశించింది. తాజా ఫిర్యాదు దృష్ట్యా, కమిషన్ అట్టి కేసు ను అడ్వాన్స్ చేస్తూ ఆదేశాలు జారీ చేస్తూ కేసు తేదీ 03.11.2025 నాటికి వాయిదా వేసింది. వివరణాత్మక నివేదిక సమర్పించమని తెలంగాణ డీజీపీ ని ఆదేశించింది. అలాగే, మరణించిన షేక్ రియాజ్ కుటుంబ సభ్యులపై ఎటువంటి బలవంతపు చర్యలు లేదా వేధింపులు చేయకూడదని కమిషన్ ఆదేశించింది.

# దటీజ్ చంద్రబాబు 70ఏళ్ల వయస్సులో చాలెంజ్




విజయవాడ, అక్టోబరు 27 10 సంవత్సరాల వయసులో ఉన్న ఉత్సాహం 20 సంవత్సరాల వయసులో ఉండదు. ఇలా వయసు మారుతున్న కొద్దీ మనుషులలో మార్పులు వస్తుంటాయి. ఇది సహజంగా జరిగే ప్రక్రియే. కానీ కొంతమంది వయసు వెనక్కి పంపించేస్తుంటారు. తమ ఉత్సాహం ముందు.. తమ క్రమశిక్షణమందు వయసును చిన్నబోయేలా చేస్తారు. అటువంటి వారిలో ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒకరు. వాస్తవానికి ఈ జాబితాలో చంద్రబాబు నాయుడు కు మొదటి స్థానం ఇవ్వాల్సి ఉంటుంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో పెట్టుబడుల కోసం నాడు చంద్రబాబు నాయుడు అనేక దేశాలు తిరిగారు. మైక్రోసాఫ్ట్ అనే సంస్థను హైదరాబాద్ తీసుకొచ్చారు. మైక్రోసాఫ్ట్ ద్వారా ఐటీకి ఒక ఎకో సిస్టం డెవలప్ చేశారు. ఈరోజు హైదరాబాద్ ఐటి విభాగంలో ఈ స్థాయిలో అభివృద్ధి చెందడానికి ప్రధాన కారణం చంద్రబాబు నాయుడు అనడంలో ఎటువంటి అనుమానం అక్కర్లేదు. ఈ విషయాన్ని అనేకమంది ముఖ్యమంత్రులు.. అనేకమంది నాయకులు ఒప్పుకున్నారు. చంద్రబాబు నాయుడు మొదటినుంచి కూడా ఆహారం తీసుకునే విషయంలో కట్టుదిట్టంగా ఉంటారు. ఏమాత్రం దానిని బ్రేక్ చేయరు. ఆయనకు ఎంతో కాలం నుంచి మధుమేహం ఉంది. అయినప్పటికీ అయినప్పటికీ దానిని నియంత్రణలో ఉంచుకుంటున్నారు. చంద్రబాబు ఎట్టి పరిస్థితుల్లో కూడా అన్నం తినరు. కేవలం తృణధాన్యాలను మాత్రమే ఆహారంగా తీసుకుంటారు. కాఫీ తాగుతారు. గ్రిల్డ్ ఫిష్ తీసుకుంటారు. నాన్ వెజ్ విషయంలో ఆయనకు చాలా లెక్కలు ఉంటాయి. ప్రతిరోజు ఉదయం వ్యాయామం చేస్తారు. యోగా చేస్తారు. మెడిటేషన్ కూడా చేస్తారు. అందువల్ల చంద్రబాబు ఏడుపదుల వయసు దాటినప్పటికీ కూడా ఉత్సాహంగా కనిపిస్తుంటారు. ప్రతి విషయాన్ని కూడా గుర్తుంచుకుంటారు. ఆ విషయాన్ని చెప్పడానికి ఏమాత్రం సంకోసించరు. చంద్రబాబు ప్రస్తుతం విభజిత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ముఖ్యమంత్రిగా ఉన్నారు. అమరావతి ప్రాంతంలో రాజధాని నిర్మించడానికి వేగంగా అడుగులు వేస్తున్నారు. కేంద్రంలో అనుకూలమైన ప్రభుత్వం ఉన్నప్పటికీ చంద్రబాబు స్వీయ శక్తిని నమ్ముకుని ముందుకు వెళ్తున్నారు. ఈ వయసులో కూడా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ప్రాంతంలో అనేక దేశాలను తిరిగివచ్చారు. అమరావతి ప్రాంతంలో ఏర్పాటు చేస్తున్న పెట్టుబడుల సదస్సుకు రావాలని అక్కడి కంపెనీల అధిపతులను కోరారు. అక్కడి ప్రభుత్వ అధినేతలను విన్నవించారు. అమరావతిలో భారీగా విదేశీ సంస్థలను తమ కార్యకలాపాలు ప్రారంభించే దిశగా చంద్రబాబు ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకరకంగా ఇది సానుకూల అంశం. ఏపీ రాష్ట్రానికి మరింత సానుకూల అంశం. రాజకీయాల విషయాలను పక్కన పెడితే చంద్రబాబు ఈ వయసులో కూడా అక్కడికి వెళ్లడం ఒకరకంగా అద్భుతం అని చెప్పాలి. ప్రత్యేకమైన విమానాలు ఉన్నప్పటికీ.. అనేక రకాల సౌకర్యాలు ఉన్నప్పటికీ ఈ వయసులో ఆయన అక్కడికి వెళ్లడం మిరాకిల్ అనడంలో ఎటువంటి సందేహం లేదు.కొన్ని రాష్ట్రాలలో చంద్రబాబు కంటే తక్కువ వయసు ఉన్నవారు.. చంద్రబాబుతో సమానంగా వయసు ఉన్నవారు.. చంద్రబాబు కంటే ఎక్కువ వయసు ఉన్నవారు ముఖ్యమంత్రులుగా పనిచేస్తున్నారు. కానీ చంద్రబాబు మాదిరిగా ఎవరూ పెట్టుబడుల కోసం ఇతర దేశాలకు వెళ్లడం లేదు. ఇతర దేశాల కంపెనీల ప్రతినిధులను ఒప్పించడం లేదు. అన్నింటికంటే ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి విషయంలో అహర్నిశలు శ్రమించడం లేదు. సాధారణంగా ఒక వయసుకు వచ్చిన తర్వాత చాలామంది ఉత్సాహంగా పనిచేయలేరు. ముఖ్యంగా 70 సంవత్సరాల వయసు దాటిన తర్వాత చాలామంది రిలాక్స్ అవ్వాలని కోరుకుంటారు. వయసు వల్ల వచ్చిన నీరసం కూడా ఇబ్బంది పెడుతూ ఉంటుంది. కానీ చంద్రబాబుకు అలసట అనేది తెలియడం లేదు. నీరసమనేది దరిచేరడం లేదు. ఈ వయసులో కూడా ఆయన ఎంతో ఉత్సాహంగా పనిచేస్తున్నారు. తన కలల రాజధాని కోసం విపరీతంగా శ్రమిస్తున్నారు. కేంద్రం నుంచి మొదలుపెడితే విదేశాల వరకు ఆయన అన్ని తలుపులను కూడా తడుతున్నారు. ఉజ్వలమైన ఏపీ కోసం బలమైన అడుగులు వేస్తున్నారు. ఒక నాయకుడు అనే వాడు బలమైన సామర్థ్యాన్ని కలిగి ఉండాలి. దృఢమైన ఆలోచనలను అమలు చేయాలి. అప్పుడే ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుంది. ఇప్పుడు చంద్రబాబు చేస్తోంది కూడా అదే.

# కూటమి సర్కార్ లోనూ ఫ్యాన్ నేతలు చక్రం

రాజమండ్రి, అక్టోబరు 27 ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయి పదిహేడు నెలలవుతుంది. అయితే ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నది వైసీపీ నియమించిన వారేనట. ఈ మాటలన్నది ఎవరో కాదు. స్వయానా తిరువూరు టీడీపీ ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు చెప్పారు. తూర్పు గోదావరి జిల్లాకు చెందిన వైసీపీ నేత ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి ప్రతి జిల్లాలో తన మనుషులను నియమించుకున్నాని, వారే జిల్లాల్లో ఇప్పటికీ రేషన్ బియ్యాన్ని ఇతర రాష్ట్రాలకు తరలిస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చెప్పుకొచ్చారు. కృష్ణా జిల్లాలోనూ రేషన్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నది గత ప్రభుత్వ హయాంలో కొడాలి నాని వద్ద ఉన్న ఒక వ్యక్తి అని, అతనే ఇప్పుడు కేశినేని చిన్ని కార్యాలయంలో కూర్చుని ఈ మాఫియాను నడుపుతున్నారని ఆయన తీవ్రమైన ఆరోపణలు చేశారు. కొలికపూడి శ్రీనివాసరావు తిరువూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పటికీ ఆయనకు రాష్ట్ర రాజకీయాలపై ఒక అవగాహన ఉందని అంటున్నారు. అందుకే ఆయన చేసిన ఆరోపణలను ఇప్పుడు టీడీపీ సోషల్ మీడియాలో కూడా కొందరు వ్యతిరేకిస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటయి దాదాపు రెండేళ్లు గడుస్తున్నప్పటికీ ఇప్పటికీ వైసీపీ నేతల మనుషులే రేషన్ బియ్యం మాఫియాను నడుపుతుండటం సిగ్గుచేటని కామెంట్స్ పెడుతున్నారు. వైసీపీ నేతలను అరెస్ట్ చేయాల్సిందిబోయి వారిని అక్కున చేర్చుకోవమేంటని టీడీపీ అభిమానులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. ఇలా అయితే వైసీపీ పాలనకు, కూటమి పాలనకు తేడా ఏముందన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి.ప్రతి జిల్లాలో ఒక మనిషిని ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి నియమించుకున్నారని, వారి ద్వారా రేషన్ డీలర్ల ను బెదిరించి ఇతర రాష్ట్రాలకు రేషన్ బియ్యాన్ని ఎగుమతి చేస్తున్నారని కొలికపూడి శ్రీనివాసరావు చేసిన ఆరోపణలపై ఇప్పుడు జనసేనకు కూడా చుట్టుకుంది. జనసేనకు చెందిన నాదెండ్ల మనోహర్ పౌరసరఫరాల శాఖ మంత్రిత్వ శాఖను పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే నెల్లూరు జిల్లా నేత కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి చేసిన వ్యాఖ్యలు నాదెండ్లకు ఆగ్రహాన్ని తెప్పించాయి. తాజాగా కొలికపూడి చేసిన వ్యాఖ్యలతో ఆయన మరింత కోపానికి గురయినట్లు తెలిసింది. మొత్తం మీద కూటమిలో ఇప్పటికీ వైసీపీ నేతల హవా నడుస్తుందన్న కొలికపూడి శ్రీనివాసరావు చేసిన వ్యాఖ్యలు కూటమి పార్టీల్లో మంటలు రేపుతున్నాయి. చంద్రబాబు వచ్చిన తర్వాత దీనికి ఫుల్ స్టాప్ పడుతుందని భావిస్తున్నారు.

# బీహార్ లో ప్రచారానికి చంద్రబాబు, పవన్



విజయవాడ, అక్టోబరు 27, దేశంలో విచిత్ర రాజకీయ పరిస్థితి నడుస్తోంది. ముచ్చటగా మూడోసారి అధికారంలోకి వచ్చి ప్రధాని అయ్యారు నరేంద్ర మోడీ. అయితే అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలోని ఇండియా కూటమి రాజకీయంగా పోరాటం చేస్తోంది. చిన్న అవకాశం కోసం ఎదురుచూస్తోంది. ముఖ్యంగా బిహార్ ఎన్నికల్లో ఇండియా కూటమి గెలిస్తే బిజెపికి ఇబ్బందికర పరిస్థితులు తప్పవు. అందుకే అక్కడ చెమటోడ్చుతుంది ఎన్డీఏ. అక్కడ గెలుపు ఏమంత సులువు కాదు కూడా. కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి గట్టి సవాల్ విసురుతోంది. ఒక విధంగా చెప్పాలంటే బీహార్ ఎన్నికల వరకు ఒక ఎత్తు. దాని ఫలితాలు మరో ఎత్తు అన్నట్టు ఉంటుంది పరిస్థితి. ఎన్డీఏ కూటమిలో భాగస్వామ్య పక్షాలు తక్కువ. అదే ఇండియా కూటమిలో అయితే జాతీయస్థాయిలో చాలామంది నేతలు ఉన్నారు. ఇండియా కూటమి తరుపున ప్రచారం చేసేందుకు చాలామంది నేతలు క్యూ కడుతున్నారు. ఈ తరుణంలో ప్రధాని నరేంద్ర మోడీ, బీహార్ సీఎం నితీష్ కుమార్ గట్టి వ్యూహాలు రూపొందిస్తున్నారు.జాతీయస్థాయిలో చంద్రబాబుతో పాటు పవన్ కళ్యాణ్ కు ప్రత్యేక ఇమేజ్ ఉంది. కొన్ని దశాబ్దాలుగా కేంద్ర రాజకీయాల్లో సుపరిచితుడు చంద్రబాబు. ఆపై మంచి పాలనా దక్షుడు అన్న పేరు తెచ్చుకున్నారు. జాతీయస్థాయిలో మంచి ఇమేజ్ ఉంది. అందుకే బీహార్ ఎన్నికల్లో ప్రచారం చేయాలని చంద్రబాబును బిజెపి పెద్దలతో పాటు నితీష్ కుమార్ ప్రత్యేకంగా ఆహ్వానించినట్లు తెలుస్తోంది. గతంలో ఢిల్లీలో ప్రచారం చేశారు చంద్రబాబు. అక్కడ తెలుగువారితో పాటు జాతీయస్థాయిలో చంద్రబాబు ప్రభావం చూపడంతో ఎన్డీఏ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొనేందుకు వెళ్లిన చంద్రబాబు సోదరుడు రామ్మూర్తి నాయుడు ఆకస్మిక మరణంతో తిరిగి వచ్చేసారు. ఇప్పుడు బీహార్ ప్రచారానికి వెళ్తున్నట్లు స్వయంగా చంద్రబాబు ప్రకటించారు.పవన్ కళ్యాణ్ సైతం బీహార్ ఎన్నికల ప్రచారంలో పాల్గొనే అవకాశం ఉంది. గతంలో అన్ని రాష్ట్రాల ఎన్నికల ప్రచారంలో పవన్ పాల్గొన్నారు. సనాతన ధర్మం, హిందూ పరిరక్షణ విషయంలో పవన్ చర్యలను జాతీయస్థాయిలో హిందూ వాదులు గట్టిగానే సమర్థించారు. బీహార్లో సైతం పవన్ ప్రచారం చేస్తే హిందువులు గుంప గుత్తిగా ఎన్డీఏకు ఓటు వేస్తారని బిజెపి పెద్దల ఆలోచన. అయితే బిజెపి విషయంలో పవన్ ఎప్పుడు సానుకూలంగానే ఉంటారు. తప్పకుండా బిజెపి వినతిని పరిగణలోకి తీసుకొని బీహార్ ప్రచారంలోకి వెళ్తారు పవన్ కళ్యాణ్. అయితే ప్రస్తుతం ఏపీ ప్రభుత్వం బిజీగా ఉంది. వచ్చే నెల 14, 15 తేదీల్లో విశాఖలో పెట్టుబడుల సదస్సు జరగనుంది. దానికి ఆహ్వానించేందుకు సీఎం చంద్రబాబు తో పాటు మంత్రులు తరచూ విదేశాలకు వెళ్తున్నారు. వచ్చే నెల విశాఖ సదస్సు జరగనున్న దృష్ట్యా బిజీ గా ఉన్న తరుణంలో.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వేర్వేరుగా బీహార్ ఎన్నికల ప్రచారానికి వెళ్లే అవకాశం ఉంది. దీనిపై అధికారిక షెడ్యూల్ రావాల్సి ఉంది.

# కాకినాడ నుంచి నక్కపల్లికి బల్క్ డ్రగ్స్

విజయనగరం, అక్టోబరు 27 మన దేశ ఔషధ రంగ భవిష్యత్‌ను పూర్తిగా మార్చే సత్తా ఉన్న మెగా ప్రాజెక్టు ఈ బల్క్‌డ్రగ్ పార్క్. కరోనా సమయంలో ఎదుర్కొన్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని కేంద్రం వైద్యరంగంపై ప్రత్యేక దృష్టి పెట్టింది. కోవిడ్ టైంలో అసలు మాస్క్‌లను కూడా భారీగా ఉత్పత్తి చేయలేని మన వైద్యరంగం ఉండేది. భవిష్యత్‌లో వైద్యపరంగా ఎలాంటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు కేంద్రం ప్రత్యేక ప్రణాళికలు రచించింది. అందులో భాగంగా దేశంలో అతి పెద్ద బల్క్‌డ్రగ్ పార్క్‌లను ఏర్పాటు చేయాలని భావించింది. దీని కోసం దేశంలోని అనేక రాష్ట్రాలు పోటీ పడ్డాయి. కానీ మూడు రాష్ట్రాల నుంచి ప్రతిపాదనలు నచ్చిన కేంద్రం వారికి ఆ అవకాశం కల్పించింది. ఆంధ్రప్రదేశ్, గుజరాత్, హిమాచల్ ప్రదేశ్‌లో ఈ డ్రగ్‌పార్క్‌లు ఏర్పాటుకు అంగీకరించింది. ఏడాదిన్నర లోపు ఈ డ్రగ్ పార్క్ మొదటి విడత ప్రారంభించాలనే లక్ష్యంతో పనులు ప్రారంభించారు. కానీ ఆంధ్రప్రదేశ్‌లో అనేక అవాంతరాలు కారణంగా ఇప్పటి అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయింది. ఈ ప్రాజెక్టు చేజారిపోకుండా వచ్చే మార్చి నాటికి మొదటి విడత పూర్తి చేస్తామని ప్రభుత్వం ఫైనల్ గడువు ఇచ్చి పనులు చేస్తోంది. ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన బల్క్ డ్రగ్స్ పార్క్‌ను విశాఖపట్నం సమీపంలోని నక్కపల్లి వద్ద ఏర్పాటుకు ప్రభుత్వాలు అంగీకరించాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో దీన్ని దాదాపు 2000 ఎకరాల విస్తీర్ణంలో 1876 కోట్ల తో దీన్ని నిర్మించనున్నారు. ఇది కేవలం ఔషధాల ఉత్పత్తిలో స్వయం సమృద్ధి సాధించాలనే లక్ష్యానికి ఇది ప్రతిబింబం. ఈ ప్రాజెక్టు ప్రస్తుత పురోగతి, దాని ప్రత్యేక విలువ, భారతీయ ఫార్మా పటంలో నక్కపల్లిని నిలపనున్నాయి. బల్క్‌డ్రగ్ పార్క్ అంటే చాలా మందికి ఒక పెద్ద ఫ్యాక్టరీ లేదా ఫార్మా సిటీలా అనిపిస్తుంది. కానీ దాని ప్రాముఖ్యత అంతకు మించి ఉంటుంది. అసలు మెడిసిన్ పని చేయడానికి గల ప్రధాన కారణం అందులో ఉండే బల్క్‌డ్రగ్ లేదా యాక్టివ్‌ఫార్మస్యూటికల్ ఇంగ్రిడియంట్. ఒక టాబ్లెట్‌లో మందు చాలా తక్కువ మోతాదులో ఉంటుంది కానీ ఆ టాబ్లెట్ ఆకారం, రుచి, అన్ని వాతావరణాలకు తట్టుకునేలా ఉండేందుకు మరికొన్ని పదార్థాలు కలుపుతారు. ఈ బల్క్‌డ్రగ్స్‌ను పెద్ద ఫ్యాక్టరీలలో రసాయనిక చర్యల ద్వారా తయారు చేస్తారు. వాటిని శుద్ధి చేసి, నాణ్యత పరీక్షించిన తర్వాతే, మందులు తయారు చేసే కంపెనీలకు పంపిస్తారు. ఈ కంపెనీలకు ఫార్ములేషన్ ప్లాంట్స్ అంటారు. ఈ ఫార్ములేషన్ ప్లాంట్స్‌లో ఈ బల్క్ డ్రగ్స్‌ను ఇతర పదార్థాలతో కలిపి టాబ్లెట్లు, సిరప్‌లు క్యాప్సూల్స్‌గా మారుస్తారు. ఈ బల్క్ డ్రగ్స్ లేకపోతే మెడిసిన్ తయారు చేయడం అసాధ్యం. అందుకే, ఈ కీలకమైన ముడి పదార్థాల ఉత్పత్తిని ఒకే చోట కేంద్రీకృతంచేసి, అత్యాధునిక మౌలిక వసతులతో ఏర్పాటు చేసేదే బల్క్ డ్రగ్ పార్క్. నక్కపల్లిలో ఈ భారీ ప్రాజెక్టును ఇప్పుడే ఎందుకు ఏర్పాటు చేస్తున్నారనే ప్రశ్న వస్తుంది. దీనికి ప్రధాన కారణం కోవిడ్. 2019లో కరోనా మహమ్మారికి ముందు వరకు, భారతదేశం తన బల్క్ డ్రగ్ అవసరాలలో అధిక భాగాన్ని చైనా నుంచి దిగుమతి చేసుకునేది. అయితే కోవిడ్ సమయంలో చైనా నుంచి దిగుమతులు పూర్తిగా తగ్గిపోవడం, సరఫరా చైన్ తెగిపోవడం వల్ల మనం దేశం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంది. ఈ సంక్షోభమే తర్వాతే, మన దేశంలోనే ఎందుకు బల్క్ డ్రగ్స్ ఉత్పత్తి చేయకూడదు అనే ఆలోచనకు భారత్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. పార్క్ నక్కపల్లి ఇండస్ట్రియల్ ఏరియాలో భాగం. ఇది విజయవాడ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్, విశాఖపట్నం-కాకినాడ పెట్రోలియం, కెమికల్ అండ్ పెట్రోకెమికల్ ఇన్వెస్ట్‌మెంట్ రీజియన్‌లో ఉంది. రాజయ్యపేట, బుచిరాజుపేట, చందనాడ, వెంపాడు, దోనివాని లక్ష్మీపురం గ్రామాల్లో విస్తరించి ఉంది. ఈ డ్రగ్స్ పార్క్ కోసం సౌత్ ఇండియాలో చాలా రాష్ట్రాల్లో తీవ్రంగా పోటీ పడ్డాయి. మొదట్లో ఈ పార్కును కాకినాడలో ఏర్పాటు చేయాలని భావించారు. నక్కపల్లి వద్ద భూమి సిద్ధంగా ఉందని అక్కడికి తరలించారు. నక్కపల్లిలో ఈ పార్క్ ఏర్పాటు చేయడానికి చాలా కారణాలు ఉన్నాయి. రవాణా సౌకర్యం:- నేషల్ హైవేకు 16కు కేవలం ఐదు కిలోమీటర్ల దూరంలో ఉంది.

రైల్వే కనెక్టివిటీ కూడా ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉంది. ఎగుమతి దిగుమతులకు ఈ రైలవే లైన్ ఉపయోగపడుతుంది.

పోర్టులు కూడా దగ్గరే:- గంగవరం పోర్టుకు చాలా దగ్గరగా ఉంది. విశాఖపట్నం పోర్టుకు 70 కిలోమీటర్లు, కాకినాడ పోర్టుకు 60 కిలోమీటర్ల దూరంలో ఉండటం దీనికి ఉన్న ప్రత్యేకత. వీటి కారణంగా ఉత్పత్తులు, ముడిసరకులు రవాణా మరింత సులభం అవుతుంది.

విద్యుత్ఉ నీటి సౌకర్యాలు:- పారిశ్రామిక అవసరాల కోసం ప్రత్యేకమైన ఇండస్ట్రీయల్ పవర్ గ్రిడ్ ఉంది. భవిష్యత్‌లో పునరుత్పాదక ఇంధనం వనరులను కూడా దీనికి అనుసంధానం చేస్తారు. రసాయన పరిశ్రమలకు అత్యవసరమైన నీటి సరఫరా కోసం ఏలూరు కాలువ ఉండనే ఉంది.

ఫార్మా ఎకో సిస్టమ్:- ఈ ప్రాంతానికి సమీపంలోనే ఉన్న హెటెరో దివిస్ ల్యాబ్స్, లాల్స్ ల్యాబ్స్ వంటి ప్రముఖ ఫార్మా కంపెనీలు ఇప్పటికే ఉన్నాయి. ఇవి ఈ బల్క్ డ్రగ్స్ పార్క్‌లో కీలక పాత్ర పోషిస్తాయని భావిస్తున్నారు. నక్కపల్లి ప్రాజెక్ట్ ఖర్చు ?1,876.66 కోట్లుగా అంచనాలు వేస్తున్నారు. జనవరి 2024లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అడ్మినిస్ట్రేటివ్ శాంక్షన్ ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం ?1000 కోట్ల గ్రాంట్ అందిస్తోంది, మార్చి 2023లో మొదటి ఇన్‌స్టాల్‌మెంట్ ?225 కోట్లు విడుదల కూడా చేసింది. ఈ బీపీడీ మూడు ప్యాకేజీలుగా విభజించారు. వాటికి టెండర్లు పిలిచారు. వర్క్ నడుస్తున్నాయి. ప్యాకేజీ 1లో రోడ్లు, డ్రైన్లు, సరిహద్దు గోడలు, గ్రీన్ ఏరియా డెవలప్‌మెంట్, నీటి సరఫరా, రీసైకిల్ వాటర్ సరఫరా, వేస్ట్ వాటర్ సిస్టమ్, పవర్ సప్లై, ఎమర్జెన్సీ, ఎమర్జెన్సీ రెస్పాన్స్ సెంటర్, సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్, ట్రక్ టెర్మినల్స్, మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ వంటి పనులు ఉంటాయి. ప్యాకేజీ 2లో కామన్ ఎఫ్లియెంట్ ట్రీట్మెంట్ ప్లాంట్, మెరిన్ అవుట్‌ఫాల్ సిస్టమ్ ఈ పనులు వ్యర్థ జలాలు శుద్ధి చేసి పర్యావరణానికి హాని కలగకుండా చూస్తారు. ప్యాకేజీ 3లో స్టీమ్ జనరేషన్, డిస్ట్రిబ్యూషన్, కామన్ సాల్వెంట్ రికవరీ సిస్టమ్ పనులు పూర్తి చేస్తారు.

శరవేగంగా పనులు

ఆంధ్రప్రదేశ్ రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎనహెచ్ 16 నుంచి ఎన్ఐపీకు 4.5 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ రోడ్ నిర్మాణాన్ని ప్రారంభించింది. పార్క్ కోసం సేకరించిన రెండు వేల ఎకరాల భూమి మొత్తం ఏపీఐఐసీ ఆధీనంలో ఉంది. భవిష్యత్ విస్తరణ కోసం అదనంగా 723.2 ఎకరాలు కేటాయించారు. ఇందులో పరిశ్రమలకు 1900 ఎకరాలను కేటాయిస్తారు. సౌకర్యాల కోసం 70 ఎకరాలు ఇస్తారు. పార్కింగ్, లాజిస్టిక్ అవసరాల కోసం 120 ఎకరాలు, మిగిలిన భూమిని యుటిలిటీలు, ఓపెన్ స్పేస్, వాటర్ బాడీ, గ్రీన్ బెల్ట్, రోడ్ల కోసం కేటాయిస్తారు. మొత్తం సేకరించిన భూమిలో కేవలం 57.90 శాతం విక్రయించడానికి వీలుగా ఉంటే మిగిలిన ప్రాంతాన్ని యుటిలీలు, ఓపెన్ స్పేస్, రోడ్లకు కేటాయిస్తారు. బల్క్ డ్రగ్ ఉత్పత్తి ఖర్చులు తగ్గించి ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందించి ప్రపంచ స్థాయి పెట్టుబడిదారులను ఆకర్షించడం దీని ముఖ్య ఉద్దేశం. ఇక్కడ పెట్టుబడిదారులు కోర్ ఉత్పత్తిపై దృష్టి పెడతారు. ఇది పెట్టుబడి, ఆపరేటింగ్ ఖర్చును 15-20 శాతం వరకు తగ్గిస్తుంది. అంతే కాకుండా 2033-34 నాటికి 27 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి కల్పిస్తుంది.

# వైసీపీ నేతల మధ్య గ్యాప్

విజయవాడ, అక్టోబరు 27 వైసీపీ అధినేత జగన్ కు పార్టీల నేతల మధ్య గ్యాప్ ఉన్నట్లు కనిపిస్తుంది. వారి మధ్య సరైన అవగాహన ఉన్నట్లు కనిపించడం లేదు. విశాఖ గూగుల్ డేటా సెంటర్ విషయంలో ఈ విషయం మరొకసారి స్పష్టమయింది. విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు అవసరమైన అవగాహన ఒప్పందాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుదుర్చుకున్నారు. కానీ విశాఖలో గూగుల్ డేటా సెంటర్ ఒప్పందం కుదుర్చుకున్న వెంటనే వైసీపీ ఉత్తరాంధ్ర నేతలు మండిపడ్డారు. డేటా సెంటర్ తో ఉపయోగాలు లేవని, పర్యావరణానికి ముప్పు అని వైసీపీ నేతలు ప్రకటించారు. అదే సమయంలో నీరు,విద్యుత్తు అధికంగా వినియోగమవుతుందని చెప్పుకొచ్చారు.. అయితే వైఎస్ జగన్ రెండు రోజుల క్రితం మీడియా సమావేశంలో గూగుల్ డేటా సెంటర్ వల్ల ఉపయోగాలను పూసగుచ్చినట్లు చెప్పారు. గూగుల్ డేటా సెంటర్ వల్ల భవిష్యత్ లో అనేక ఉపయోగాలున్నాయని, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, క్వాంటమ్ వ్యాలీకి ఈ డేటా సెంటర్ ఎంతో ఉపయోగపడుతుందని జగన్ చెప్పారు. డేటా సెంటర్ ఏర్పాటుకు తాము వ్యతిరేకం కాదని చెప్పుకొచ్చారు. డేటా సెంటర్ వల్ల వచ్చే ఉపాధి అవకాశాలు తక్కువని అన్నారు. భవిష్యత్ లో జరిగే మార్పునకు డేటా సెంటర్ ముఖ్య భూమిక అని జగన్ అన్నారు. రిక్రియేషన్ సెంటర్, ఐటీ పార్క్, స్కిల్ సెంటర్ పెట్టాలని నాడు అదానీతో ఒప్పందాన్ని కుదుర్చుకున్నామని జగన్ తెలిపారు. దీంతో వైసీపీ నేతలు డేటా సెంటర్ పై ప్రస్తుత ప్రభుత్వంపై విమర్శలు గాలిలో తేలిపోయినట్లయింది. డేటా సెంటర్ ఏర్పాటు ప్రకటనను ప్రభుత్వం చేసిన వెంటనే హడావిడిగా వచ్చిన వైసీపీ నేతలు ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టడమే పనిగా పెట్టుకున్నారు. అంతే తప్ప దాని వల్ల ఉపయోగాలను గురించి కనీసం ఆరా తీసే ప్రయత్నం చేయలేదు. గత ప్రభుత్వంలో ఐటీ శాఖ మంత్రిగా పనిచేసిన గుడివాడ అమర్నాధ్ సయితం విమర్శలకు దిగారు. బొత్స సత్యనారాయణ వంటి సీనియర్ నేతలు కూడా ప్రభుత్వ నిర్ణయాన్ని తప్పుపట్టారు. డేటా సెంటర్ ను అమరావతిలో పెట్టుకోవచ్చు కదా? అని కూడా ప్రశ్నించారు. జగన్ విదేశాల నుంచి వచ్చి వైసీపీ నేతల ఆరోపణలకు విలువ లేకుండా చేశారు. దీంతో వైసీపీ అధినేతకు, నేతలకు మధ్య గ్యాప్ ఉందన్న విషయం మరోసారి బయటపడింది.

# భద్రతపై భారత్ మరింత దృష్టి....

హైదరాబాద్, అక్టోబరు 27, ఆపరేషన్ సిందూర్ తర్వాత భారత్ త్రివిధ దళాల బలోపేతంపై మరింత దృష్టిపెట్టింది. మన సైనిక శక్తి ప్రపంచానికి తెలియడంతో సరికొత్త ఆయుధాలతోపాటు సరికొత్త సైన్యాన్ని అప్‌గ్రేడ్ చేస్తోంది. సమకాలీన యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా విప్లవాత్మక మార్పులు తీసుకొస్తోంది. ఈ క్రమంలోనే “భైరవ్ బెటాలియన్లు” రూపుదిద్దుకున్నాయి. సైన్యంలో ఇదో కీలక పరిణామం. ఆధునిక పరికరాలు, స్మార్ట్ సెన్సర్లు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాయంతో ఈ యూనిట్లు అత్యంత వేగంగా స్పందించగల సామర్థ్యం కలిగి ఉంటాయి. లెఫ్టినెంట్ అజయ్ కుమార్ వెల్లడించిన వివరాల ప్రకారం.. నవంబర్ 1న తొలి భైరవ్ దళం రంగప్రవేశం చేస్తుంది. ఇప్పటికే ఐదు యూనిట్లు శిక్షణ దశలో ఉండగా, మరో 20 పైగా సిద్ధం చేయడానికి సన్నాహాలు జరుగుతున్నాయి.భైరవ్ యూనిట్ల ప్రధాన లక్ష్యం ? సాధారణ పదాతిదళాలు లేదా ప్రత్యేక బలగాలు నేరుగా వీలుపడనప్పుడు వ్యూహాత్మకంగా సాహసోపేతమైన ఆపరేషన్లు నిర్వర్తించడం. ఒక్కో యూనిట్‌లో 250 మంది అత్యంత నిపుణులైన జవాన్లు, 7?8 మంది అధికారిస్థాయి నాయకత్వంతో ఉంటారు. వీరు శత్రు భూభాగంలో లోతుగా ప్రవేశించే తక్షణ దాడులు, ఆపరేషన్లు, సీక్రెట్ మిషన్‌లు నిర్వర్తించగల నేర్పు కలిగి ఉంటారు. సంఖ్యాపరంగా తక్కువగా ఉన్నప్పటికీ, క్రియాశీలత, సమర్థత పరంగా వీరి ప్రాధాన్యం ఎంతో ఎక్కువ.భైరవ్ దళాల ప్రవేశం భారత సైన్యంలో మారుతున్న రణరీతులను ప్రతిబింబిస్తోంది. భవిష్యత్తులో యుద్ధాలు కేవలం బలంపై కాకుండా టెక్నాలజీ, వేగం, గూఢచారి సమాచారంపై ఆధారపడతాయి. ఈ యూనిట్లు వీటన్నింటిని సమన్వయం చేస్తూ భవిష్యత్ యుద్ధరంగానికి సరైన మోడల్‌గా నిలుస్తాయి. దేశ భద్రతా వ్యవస్థలో ఇవి ఒక కొత్త అధ్యాయం ఆరంభమనే చెప్పాలి.భైరవ్ బెటాలియన్లు భారత రక్షణ వ్యవస్థలో సంస్కరణాత్మక మార్పుకు సూచిక. ఇవి శత్రు ప్రాంతాల్లో తక్షణ చర్యకు ప్రత్యేక యాంత్రిక మానవ శక్తుల్లా పనిచేస్తాయి. ఇలాంటి యూనిట్లు సైన్యంలో చేరడం భవిష్యత్తు సమర యూహాలకు భారత సైన్యం పూర్తిగా సిద్ధమైందని చెప్పవచ్చు.

# మరో బాంబు పేల్చిన కొలికపూడి

విజయవాడ, అక్టోబరు 27,కూటమిలో ఇప్పుడు కొలికపూడి కాక రేపుతున్నారు. ఇప్పటికే విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని వర్సెస్ కొలికపూడి అన్నట్టు ఉంది పరిస్థితి. అయితే తాజాగా కొలికపూడి సంచలన అంశాలను బయటపెట్టారు. ఇప్పటికీ కూటమిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తోందని.. దిద్దుబాటు చర్యలు చేపట్టకపోతే కూటమికి నష్టం అని తేల్చి చెప్పారు. అయితే ఇప్పటివరకు జరిగింది ఒక ఎత్తు. ఇప్పుడు కొలికపూడి చెబుతోంది మరో ఎత్తు. ఆయనను అంత తక్కువ అంచనా వేయడానికి వీలులేదు. ఎంతోమందికి పొలిటికల్ సైన్స్ పాఠాలు చెప్పి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులుగా తీర్చిదిద్దిన ఘనత కొలికపుడిది. ఇప్పటివరకు ఆయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ లైన్లో మాట్లాడుతున్నారని అందరూ అనుకున్నారు. కానీ ఇప్పుడు అదే వైసీపీ మనుషులు కూటమి పార్టీలో ఉన్నారని సంచలన విషయాలను బయటపెట్టారు. ఇప్పుడు అవే హాట్ టాపిక్ అవుతున్నాయి. ఇప్పటివరకు ఆయన పై హై కమాండ్ చర్యలు తీసుకుంటుందని అంతా భావించారు. కానీ ఇప్పుడు హై కమాండ్ కె కొలికపూడి సూచనలు ఇస్తుండడం విశేషం.వైసీపీ హయాంలో ఒక వెలుగు వెలిగారు కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్. ఆయనది స్వతహాగా బియ్యం వ్యాపారం. అయితే రేషన్ మాఫియా నడుపుతున్నది ఆయనేనని ఆరోపణలు ఉన్నాయి. గతంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సైతం ఆయనపై విమర్శలు చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ ఇంతవరకు ఆయనపై ఎటువంటి చర్యలు లేవు. మొన్న ఆ మధ్యన కాకినాడలో ఒక షిప్ దొరికిన సంగతి తెలిసిందే. అప్పట్లోనే ద్వారంపూడి చంద్రశేఖర్ పేరు బలంగా వినిపించింది. ఆయనపై ఎటువంటి కేసులు నమోదు కాలేదు. చర్యలు కూడా తీసుకోలేకపోయారు. తాజాగా కొలికపూడి ద్వారంపూడి చంద్రశేఖర్ మనుషులు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని.. వారే రేషన్ బియ్యం మాఫియా ను నడుపుతున్నారని సంచలన ఆరోపణలు చేశారు. మరోవైపు మాజీ మంత్రి కొడాలి నాని అనుచరుడు.. ఎంపీ కేశినేని నాని కార్యాలయంలో కూర్చొని దందాను నడుపుతున్నారంటూ కొలికపూడి వ్యాఖ్యానించడం విశేషం.ఎంపీ కేశినేని చిన్ని తన పేరు కొలికపూడి బయట పెట్టడాన్ని జీర్ణించుకోలేకపోయారు. అసెంబ్లీ టికెట్ కోసం తన వద్ద ఐదు కోట్ల రూపాయలు తీసుకున్నారంటూ ఆరోపించారు కొలికపూడి. అక్కడ నుంచి వివాదం ప్రారంభం కాగా నిన్ననే కూటమి సమన్వయ సమావేశం పేరిట బలప్రదర్శనకు దిగారు చిన్ని. దాదాపు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని ఎమ్మెల్యేలతో పాటు కీలక నేతలంతా హాజరయ్యారు. అయితే ఇప్పుడు కొత్త విషయాన్ని బయటపెట్టారు కొలికపూడి. కొడాలి నాని మనుషులు కేశినేని చిన్ని కార్యాలయంలో ఉండడాన్ని హైలెట్ చేశారు. ద్వారంపూడి చంద్రశేఖర్ మనషులు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ఉన్నారని చెప్పడం ద్వారా పౌర సరఫరాల శాఖను తప్పుపట్టారు. ఆ శాఖను నిర్వర్తిస్తోంది జనసేన నేత నాదెండ్ల మనోహర్. తద్వారా చిన్ని కూటమి ద్వారా తనను అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అదే కూటమిని ఇరకాటంలో పెట్టగలిగారు కొలికపూడి. రాజకీయంగా బద్ధ శత్రువుగా ఉన్న కొడాలి నాని మనిషిని తెచ్చుకొని.. కేశినేని చిన్ని అవినీతికి పాల్పడుతున్నారని చెప్పడంలో సక్సెస్ అయ్యారు కొలికపూడి. దీంతో ఈ వివాదం యూటర్న్ తీసుకుంది. మున్ముందు ఎలాంటి పరిణామాలకు దారితీస్తుందో చూడాలి.

# పంజాబ్ లో ఐఎస్ ఐ కార్యలకలాపాలు...?

ఛండీఘఢ్, అక్టోబరు 27, (న్యూస్ పల్స్) భారత్‌లో అల్లర్లు సృష్టించేందుకు, దాడులు చేసేందుకు, బాంబు పేలుళ్లు జరిపేందుకు పాకిస్తాన్‌కు చెందిన ఐఎస్ఐ నిత్యం ప్రయత్నిస్తోంది. ఉగ్రవాద సంస్థలకు సహాయ సహకారాలు అందిస్తుంది. జమ్మూ కశ్మీర్ స్వాధీనమే లక్ష్యంగా ఇంతకాలం కార్యకలాపాలు సాగించిన ఐఎస్ఐ.. ఇప్పుడు రూట్ మార్చింది. కశ్మీర్‌లో భద్రత కట్టుదిట్టం కావడంతో పంజాబ్‌పై ఐఎస్ఐ దృష్టి పెట్టింది. అమృత్‌సర్ జిల్లలో భద్రతా బలగాల సోదాల్లో రాకెట్ ప్రొపెల్లర్ గ్రెనేడ్ (ఆర్పీజీ) పట్టుబడడం ఆందోళన కలిగించింది. ఇది 500 మీటర్ల దూరం వరకు యాంటీ ట్యాంక్ దాడులు చేయగల శక్తివంతమైన ఆయుధం. పెద్ద భవనాలు, రక్షణ వాహనాలు లేదా కాన్వాయ్‌లపై దాడికి వినియోగించవచ్చు. ఈ పరిణామం పంజాబ్‌లో ఉగ్రవాద చర్యలు మరోసారి చెలరేగే సూచనగా భావిస్తున్నారు. పంజాబ్‌కు పాకిస్తాన్‌తో 550 కిలోమీటర్ల పొడవైన సరిహద్దు ఉంది. ఇరువైపులా భాషా, సాంస్కృతిక సామ్యాలు ఎక్కువగా ఉండటంతో సరిహద్దు గమనించటం కష్టం అవుతోంది. తర్లోదడిణి మార్గాల్లో ఉగ్రవాదులు, ఖలిస్తాన్ అనుచరులు చొరబడేందుకు ప్రయత్నాలు నిరంతరం కొనసాగుతున్నాయని ఇంటెలిజెన్స్ నివేదికలు వెల్లడిస్తున్నాయి. తరుణ్‌తారన్, గుర్‌దాస్‌పూర్, అమృత్‌సర్, పఠాన్‌కోట్, ఫజిల్కా జిల్లాలు పాకిస్తాన్ సరిహద్దులో ఉండటంతో తీవ్ర స్పర్శలో ఉన్న ప్రాంతాలుగా గుర్తించబడ్డాయి. ముఖ్యంగా తరుణ్‌తారన్ ఎంపీ అమృత్‌పాల్ సింగ్ పేరు ఖలిస్తాన్ ఉద్యమ పునరుద్ధరణతో ముడిపడింది. ఈ ప్రాంతంలో బిద్రావాల తర్వాత రెండో తరంగం ఆలోచన వ్యాప్తి చెందుతోందని కేంద్ర భద్రతా ఏజెన్సీలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. 2025కి ముందు నుంచి పంజాబ్ గగనతలంలో డ్రోన్ కార్యకలాపాలు పెరిగిన విషయం తెలిసిందే. పాకిస్తాన్ వైపు నుంచి గ్రెనేడ్లు, కమ్యూనికేషన్ పరికరాలు, మత్తు పదార్థాలు డ్రోన్‌ల ద్వారా తరలిస్తున్నారని ఇంటెలిజెన్స్ హెచ్చరికలు ఉన్నాయి. తాజా ఆర్పీజీ పట్టుబడటంతో ఈ డ్రోన్ నెట్‌వర్క్ మరింత ప్రమాదకర దిశగా వృద్ధి చెందుతోందన్న సందేహం మరింత బలపడింది. మునుపు పఠాన్‌కోట్ ఎయిర్‌బేస్‌పై జరిగిన ఉగ్రదాడి తర్వాత ఇప్పుడు అదే ప్రాంతంలో సరిహద్దు మార్గాల వద్ద భద్రత కఠినతరం చేశారు. హైవే మూసివేత తదితర చర్యలు చేపట్టడం ప్రభుత్వం ఈ ముప్పును ఎంత జాగ్రత్తగా పరిగణించిందో సూచిస్తోంది. కశ్మీర్‌లో ఉగ్ర నెట్‌వర్క్ బలహీనపడటంతో ఐఎస్ఐ ఇప్పుడు పంజాబ్‌ను కొత్త స్థావరంగా మార్చేందుకు ప్రయత్నిస్తోందని కేంద్ర ఇంటెలిజెన్స్ నివేదిక తేల్చింది. అమృత్‌సర్‌లో పట్టుబడ్డ ఇద్దరు యువకుల అరెస్టు ఈ కుట్రలో భాగమని దర్యాప్తు అధికారులు పరిశీలిస్తున్నారు. పంజాబ్ సరిహద్దుల్లో ఆర్పీజీ స్వాధీనం కావడం భారత భద్రతా వ్యవస్థకు కొత్త హెచ్చరికగా నిలిచింది. కశ్మీర్ తర్వాత పంజాబ్‌ను అస్థిరం చేయాలన్న పాకిస్తాన్ ఉద్దేశ్యం స్పష్టమవుతోంది. కేంద్రం, రాష్ట్రం సమన్వయంతో సరిహద్దు భద్రతను మరింత కట్టుదిట్టం చేయడం తప్పనిసరి అనే సందేశం ఈ ఘటన మళ్లీ గుర్తు చేసింది.

# అమరావతికి చట్టభద్రత...

గుంటూరు, అక్టోబరు 27, ఏ రాజకీయ పార్టీకైనా ప్రజాభిప్రాయమే ఫైనల్. ప్రజల అభిష్టానికి వ్యతిరేకంగా వెళితే ప్రతికూల ఫలితాలు తప్పవు. అయితే ఈ విషయంలో వెనక్కి తగ్గిన వారే ప్రజల మధ్య నిలబడగలరు. కానీ ఈ విషయంలో ఏపీ మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి మొండిగా ముందుకు వెళ్తున్నారు. 2024 ఎన్నికల్లో ఓటమి తర్వాత కూడా అమరావతి రాజధాని నిర్మాణం పై ఆయన అభిప్రాయం మారలేదు. ఇటీవల ప్రెస్ మీట్ లో అమరావతిపై విముఖత చూపేలా మాట్లాడారు. ఇక వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు ఆ పార్టీ అనుకూల మీడియా, సోషల్ మీడియా గురించి చెప్పనవసరం లేదు. పేర్ని నాని లాంటి వ్యక్తి అయితే అమరావతిని ఉద్దేశించి చాలా తేలిగ్గా మాట్లాడారు. అమరావతి మునిగిపోతుందని ఒకరు.. అక్కడ పెట్టుబడి పెట్టడం వేస్ట్ అన్నట్టు మాట్లాడారు. చివరకు వైసిపి గెలిచిన జగన్ అమరావతి నుంచి పాలన సాగిస్తారన్న సకల శాఖ మంత్రి సజ్జలకు సైతం జగన్ క్లాస్ పీకినట్లు వార్తలు వచ్చాయి. అమరావతి రాజధానిపై నాడు జగన్ సర్కార్ వ్యవహరించిన తీరు కూడా మొన్నటి ఓటమికి ఒక కారణం. కానీ దాని నుంచి గుణపాఠాలు నేర్చుకోలేదు జగన్మోహన్ రెడ్డి.2014, 2019 ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోడీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అయితే ఆ రెండుసార్లుతో పోల్చుకుంటే 2024 ఎన్నికల్లో బిజెపికి వచ్చిన స్థానాలు చాలా తక్కువ. దానికి కారణం లేకపోలేదు. వ్యవసాయానికి సంబంధించి మూడు సాగు చట్టాలను తీసుకొచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. దేశవ్యాప్తంగా దీనిపై రైతులు నిరసన వ్యక్తం చేశారు. ఉత్తరాది రాష్ట్రాల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం అయింది. ప్రజల అసంతృప్తిని గమనించారు నరేంద్ర మోడీ. తాను ప్రవేశపెట్టిన సాగు చట్టాలపై ప్రజలకు అర్థమయ్యేలా చెప్పలేకపోయామని.. అందుకే వాటిని రద్దు చేస్తున్నట్లు చెప్పి వెనక్కి తగ్గారు ప్రధాని మోదీ. అయితే అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఎప్పుడైతే సాగు చట్టాలను వెనక్కి తీసుకున్నారు కొంత సానుకూలత గా మార్చుకోండి బిజెపి.

ఆ సాగు చట్టాలను వెనక్కి తీసుకోకుంటే మాత్రం బిజెపికి భారీ మూల్యం తప్పదుఅయితే మొన్నటి ఎన్నికల్లో జగన్ మూడు రాజధానుల నిర్ణయాన్ని ప్రజలు వ్యతిరేకించారు. అయినా సరే వైసీపీ అమరావతిపై విషం చిమ్మడం మానలేదు. అయితే ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం సైతం స్పష్టమైన సంకేతాలు పంపగలిగింది. ఇకమీదట అమరావతి రాజధానిని కదిలించలేరని తన చర్యల ద్వారా చెప్పింది.

ఏకంగా కేంద్ర ప్రభుత్వంలో కీలకమైన రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన ప్రధాన కార్యాలయాన్ని అమరావతిలో నిర్మించాలని భావిస్తోంది. నాలుగు ఎకరాల భూమిని అమరావతిలో కొనుగోలు చేసింది. 12 కోట్ల రూపాయలు వెచ్చించి ఏపీ ప్రభుత్వం నుంచి ఆ భూమిని కొనుగోలు చేసింది రిజర్వ్ బ్యాంక్. అన్ని ఆలోచించి రిజర్వ్ బ్యాంక్ ఈ నిర్ణయానికి వచ్చింది. కచ్చితంగా అమరావతిని కేంద్రం చట్టబద్ధత చేస్తుందని తెలిసి ఈ నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

రిజర్వ్ బ్యాంక్ పరిధిలో పనిచేసే 12 ప్రాంతీయ బ్యాంకుల సైతం తమ ప్రధాన కార్యాలయాలను నిర్మించనున్నాయి.

ఈ నెల 28న కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మల సీతారామన్ ఈ కార్యాలయ భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేయనున్నారు. కేంద్రం నుంచి అనుమతి తీసుకున్న తర్వాత మాత్రమే ఈ ఆర్థిక రంగ బ్యాంకింగ్ సంస్థల ఏర్పాటు జరుగుతుంది. అంటే త్వరలో పార్లమెంటులో అమరావతి రాజధానికి చట్టబద్ధత లభించనుందన్నమాట.

# పాకిస్తాన్‌కు వాటర్ ట్రబుల్స్

లాహోర్, అక్టోబరు 27, పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్ దశాబ్దాల నాటి సిందూ జలాల ఒప్పందాన్ని నిలిపివేసి పాకిస్తాన్‌ను నీటిదెబ్బ కొట్టింది. అవసరం ఉన్నప్పుడు ఆపి.. అవసరం లేనప్పుడు వదులుతూ వరదలు సృష్టిస్తోంది. దీంతో పాకిస్తాన్ ఇబ్బందులు ఎదుర్కొంటోంది. ఇక ఇప్పుడు ఆఫ్గానిస్తాన్ కూడా భారత్ బాటలో పయనిస్తోంది. ఆఫ్ఘానిస్తాన్?పాకిస్తాన్ మధ్య ఎలాంటి జల ఒప్పందాలు లేవు. దీంతో ఆఫ్గానిస్తాన్ నుంచి పాకిస్తాన్‌లోకి ప్రవహించే నీటిని నియంత్రించాలని నిర్ణయించింది. తాలిబన్ నాయకత్వం కునార్ నది ప్రవాహాన్ని నియంత్రించే ప్రణాళికలు వేగవంతం చేసింది. తాలిబాన్ నాయకుడు హైబతుల్లా ఖుల్‌జాదా ఆదేశాల మేరకు, స్థానిక ఇంజినీర్లు కాంట్రాక్టర్లతో డ్యాం నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారు. తమాషా ఏమిటంటే.. ఈ ప్రాజెక్టులో కేవలం భారత్ సాంకేతిక సలహాలు మాత్రమే ఉపయోగించవచ్చని సూచించారు. ఇతర దేశాల జోక్యాన్ని పూర్తిగా నిరోధించారు. ఈ నిర్ణయం పాకిస్తాన్‌కు వ్యూహాత్మకంగా మరొక దిశలో దెబ్బతీయబోతున్నట్లు స్పష్టంగా కనిపిస్తుంది.హిందూకుష్ పర్వత శ్రేణుల వద్ద నుంచి ఉద్భవించే కునార్ నది, ఆఫ్గానిస్తాన్‌లోని నంగర్‌హార్, కునార్ రాష్ట్రాల మీదుగా ప్రవహించి, చివరగా కాబూల్ నదిలో కలుస్తుంది. అక్కడి నుంచి ఇది పాకిస్తాన్ సరిహద్దు చేరి చిత్రాల్ నదిగా పేరు మార్చుకుంటుంది. తర్వాత పంజాబ్, ఖైబర్ పఖ్తూన్‌ఖ్వా రాష్ట్రాలకు సాగు, తాగునీటి మూలంగా మారుతుంది. ఈ నదిపై ఆఫ్గాన్ డ్యాం పూర్తి అయితే, పాకిస్తాన్‌లోని రెండు ప్రధాన వ్యవసాయ రాష్ట్రాలకు నీటి సరఫరా తీవ్రంగా తగ్గిపోతుంది. నీటి కొరతతో సాగు వ్యవస్థలు దెబ్బతినడమే కాక, పాకిస్తాన్‌లో ఆహార భద్రత కూడా సంక్షోభంలో పడే అవకాశం ఉంది. ఆఫ్గానిస్తాన్‌కు భారత్ ఇప్పటికే జలాభివృద్ధి రంగంలో కీలక మద్దతు అందిస్తోంది.

? 2016లో సల్మా డ్యాం (ఇండియా?ఆఫ్ఘాన్ ఫ్రెండ్షిప్ డ్యాం) నిర్మాణానికి 100 మిలియన్ డాలర్లను భారత ప్రభుత్వం ఖర్చు చేసింది. ఇది 42 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యంతో పాటు 85,000 ఎకరాలకు సాగునీరు అందిస్తోంది. ప్రస్తుతం షాతూత్ డ్యాం పనులు కొనసాగుతున్నాయి, దీనికి 250 మిలియన్ డాలర్ల పెట్టుబడి కేటాయించబడింది. ఈ డ్యాం ద్వారా కాబూల్ పట్టణానికి తాగునీరు, వ్యవసాయ అవసరాలు తీరుస్తుంది. ఇప్పుడు కునార్ నది ప్రాజెక్టులో భారత్ సలహాదారుడిగా పాల్గొనడం, పాకిస్తాన్‌కు డిప్లొమాటిక్ ఒత్తిడిని పెంచుతోంది.భారత్ సిందూ ఒప్పందాన్ని నిలిపివేయడం, ఆఫ్గాన్ కూడా కునార్ నది ప్రవాహాన్ని నియంత్రించేందుకు సన్నద్ధం కావడంతో పాకిస్తాన్ రెండు వైపులా నీటి ఒత్తిడిలో చిక్కుకుంటోంది. ఒకవైపు భారత్ సరిహద్దు నుంచీ నీటి ప్రవాహం తగ్గుతుండగా, మరోవైపు ఆఫ్గాన్ సరిహద్దు నుంచీ నిల్వ డ్యామ్ నిర్మాణం అతడిని ఆర్థికంగా బిగించబోతుంది. తాలిబన్ ప్రభుత్వం మొదటిసారి జల వనరులను జాతీయ ఆస్తిగా పరిగణించి, వాటిని భద్రపరిచే ప్రణాళికలను సీరియస్‌గా తీసుకుంది. ఇది కేవలం పాక్‌పై ఒత్తిడికే కాదు, తమ అంతర్గత నీటి అవసరాలు, విద్యుత్ ఉత్పత్తి, సాగు భూముల విస్తరణకు కూడా కీలకం.కునార్ నది ప్రాజెక్ట్ ద్వారా ఆఫ్గానిస్తాన్ తన భౌగోళిక ప్రభావాన్ని విస్తరించడమే కాకుండా, భారత్‌తో వ్యూహాత్మక సంబంధాలను మరింత బలపరిచింది. పాకిస్తాన్‌కు మాత్రం ఇది మరో జల సంక్షోభం గంట మోగించినట్లే. భారత్?ఆఫ్ఘాన్ జలసహకారం కొత్త సమీకరణానికి ఆరంభం కావొచ్చు. ఇది దక్షిణాసియా భవిష్యత్తును ప్రభావితం చేసే అవకాశం ఉంది.

# ఉత్తరాంధ్ర వైసీపీ నేతలు... అత్యుత్సాహం...

విశాఖపట్టణం, అక్టోబరు 27, ఊరికి ముందే ఉత్తరాంధ్ర వైసీపీ నాయకత్వం గూగుల్ డేటా సెంటర్‌కు వ్యతిరేక స్వరం వినిపించింది. అదో గోడౌన్ తప్ప ఉపయోగం లేదని ఒకరు, దానివల్ల వైజాగ్‌లో టెంపరేచర్ పెరుగుతుందని మరొకరు, అలాంటి ప్రాజెక్ట్ వస్తే? ఇంకేదో జరిగిపోతుందని ఇంకొకరు?. రకరకాలుగా కామెంట్స్ చేశారు. అదే సమయంలో ప్రభుత్వం సహజంగానే ఈ ప్రాజెక్ట్‌కు బీభత్సమైన ఎలివేషన్ ఇచ్చింది. వైసీపీ వాళ్ళకు సరిగా తెలియక ఏదేదో మాట్లాడుతున్నారుగానీ? గూగుల్ డేటా సెంటర్ వల్ల వైజాగ్‌లో ఒక ఎకో సిస్టం డెవలప్ అవుతుందని, మిగతా సాఫ్ట్‌వేర్ కంపెనీలు రావడానికి రూట్ క్లియర్ అవుతుందని క్లారిటీ ఇస్తున్నారు ప్రభుత్వ పెద్దలు. ఈ కన్ఫ్యూజన్‌లో? ఎవర్ని నమ్మాలో అర్థంకాని స్థితిలో ప్రజలు ఉండగానే?. వైసీపీ అధినేత జగన్ తాజాగా మాట్లాడిన మాటల చుట్టూ కొత్త చర్చ మొదలైంది.ఓవైపు ఉత్తరాంధ్ర నాయకులు వ్యతిరేక కామెంట్స్ చేస్తే? జగన్ మాత్రం డేటా సెంటర్స్‌కు అనుకూల స్వరం వినిపించారు. ఒకే ఇష్యూపై డిఫరెంట్ వెర్షన్స్ రావడంతో పార్టీ ప్రయోగించాలనుకున్న రాజకీయ అస్త్రం రివర్స్ అయిందా అనే చర్చకు తెరలేచింది. సరిగ్గా ఇదే పాయింట్‌ని వాడుకుంటూ? సర్కార్ వైపు నుంచి కూడా ఆల్రెడీ అటాక్ మొదలైపోయింది. వైసీపీ నేతలు దాగుడు మూతలతో జనాన్ని మభ్య పెట్టవద్దంటూ ప్రభుత్వం ఎదురు దాడి స్టార్ట్ చేసింది. నువ్వా నేనా అన్నట్టుగా ఉండే పొలిటికల్ సిచ్యుయేషన్స్‌లో ఏ మాత్రం తడబడ్డా? సంకట స్థితి తప్పదు. డేటా సెంటర్ల విషయంలో వైసీపీ ఇప్పుడు అదే స్థితిలోకి వెళ్ళిపోయిందా అంటూ మాట్లాడుకుంటున్నారు ఎక్కువ మంది. ఉద్యోగాలు, పర్యావరణ పర్యవసానాల చర్చల్ని కాసేపు అలా ఉంచితే? అమెరికా బయట గూగుల్ ఇంత భారీ ప్రాజెక్టు ఏర్పాటు చేయడం ఇదే మొదటి సారి. లక్షా 30వేల కోట్ల రూపాయల పెట్టుబడి పెడుతున్నట్టు ప్రకటించింది. దాన్ని బేస్ చేసుకునే? విశాఖను ఏఐ సిటీగా మార్చేందుకు ఈ డేటా సెంటర్ పునాది అంటూ ప్రభుత్వం ప్రమోట్ చేస్తోంది. ఐతే? ఇందులోకి క్రెడిట్ పాలిటిక్స్ ఎంటరవడంతో మేటర్ రసకందాయంలో పడింది.గూగుల్ డేటా సెంటర్ గురించి ప్రభుత్వం విపరీతంగా ప్రచారం చేసుకుంటోందని, వాళ్ళు చెబుతున్నట్టు లక్షల ఉద్యోగాలన్నది అభూతకల్పన అంటూ విభేదించారు ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు. ఆ విషయంలో కాస్త దూకుడు ప్రదర్శించి గట్టి స్టేట్‌మెంట్సే ఇచ్చేశారు. ఆ పొలిటికల్ గేమ్ అలా నడుస్తుండగానే? తాజాగా మీడియాతో మాట్లాడిన పార్టీ అధ్యక్షుడు జగన్? డేటా సెంటర్స్‌ని మేం వ్యతిరేకించడం లేదు, స్వాగతిస్తున్నామని ప్రకటించారు. పైగా అదానీ డేటా సెంటర్‌కు పునాది వేసింది వైసీపీనేనని క్లారిటీ ఇచ్చేశారాయన. దీంతో మేటర్ కీలక మలుపు తిరిగింది. పార్టీ హైకమాండ్ ఆలోచనలకు, ఉత్తరాంధ్ర నాయకత్వానికి మధ్య కమ్యూనికేషన్ గ్యాప్ ఉందా? లేక పార్టీ విధానం ఏంటో తెలుసుకోకుండా వాళ్ళు తొందరపడ్డారా అన్న అనుమానాలు వస్తున్నాయట పరిశీలకులకు. వాస్తవంగా? విశాఖలో డేటా సెంటర్ల ఏర్పాటు దిశగా తొలి అడుగు వైసీపీ హయాంలోనే పడింది. మధురవాడ ప్రాంతంలో300 మెగావాట్ల అదానీ డేటా సెంటర్‌కు 2023లో సీఎం హోదాలో శంఖు స్థాపన చేశారు జగన్మోహన్‌రెడ్డి.కేవలం డేటా సెంటర్ ఒక్కటే కాకుండా ఐటీ అనుబంధ పెట్టుబడులు పెట్టే విధంగా అప్పట్లో ప్రభుత్వంతో ఒప్పందం కుదిరింది. అయితే? ప్రస్తుతం గూగుల్ ఏర్పాటు చేయబోతున్నది ఒక గిగావాట్ కెపాసిటీ. స్టోరేజ్ సామర్థ్యం, పెట్టుబడి పరంగా రెండు ప్రాజెక్ట్‌ల మధ్య పొంతన లేకున్నా? ఇదే విశాఖలో డేటా సెంటర్‌కు వైసీపీ హయాంలో శంకుస్థాపన జరిగిందన్నది మాత్రం వాస్తవం. ఉత్తరాంధ్ర వైసీపీ నాయకులు ఆ సంగతి మర్చిపోయి గూగుల్‌పై విమర్శలు చేసి తొందర పడ్డారా అన్న చర్చలు మొదలయ్యాయి రాజకీయవర్గాల్లో. గూగుల్‌కు తాము వ్యతిరేకం కాదంటూనే? డేటా సెంటర్‌పై అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో? ప్రభుత్వం కూడా ఎదురు దాడి ప్రారంభించింది. వైసీపీ అభివృద్ధికి వ్యతిరేకం కనుకనే గూగుల్‌ను ఆహ్వానించడానికి మనసు రావడం లేదని, ప్రజలను మభ్య పెట్టే ప్రయత్నం చేస్తోందని విమర్శిస్తున్నారు

అధికారపక్ష నేతలు. మొత్తం మీద ఈ విషయమై వైసీపీలో కమ్యూనికేషన్ గ్యాప్ ఉందన్న విషయం మాత్రం అర్థమవుతోందని అంటున్నారు పరిశీలకులు.

### పొలాల్లోకి దూసుకెళ్లిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు... తప్పిన పెనుప్రమాదం

ఒంగోలు ప్రకాశం జిల్లా మార్కాపురం ? కుంట మధ్య ఆదివారం రాత్రి ఓ ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ప్రమాదం నుంచి తప్పించుకుంది. మార్కాపురం నుంచి బెంగళూరు వెళ్తున్న బస్సు కొట్టాలపల్లి గ్రామ మూల మలుపు వద్ద ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి పొలాల్లోకి దూసుకెళ్లింది. బస్సులో ఉన్న ఎనిమిది మంది ప్రయాణికులు ఆందోళనకు గురైయారు. డ్రైవర్ సకాలంలో బ్రేక్ వేయడంతో పెను ప్రమాదం తప్పింది.

# అమెరికా అభివృద్ధిలో భారతీయులు కీలకం

న్యూయార్క్, అక్టోబరు 27, ఇండియా లేకుంటే.. అమెరికా లేదు.. రెండు దశాబ్దాల క్రితం అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్‌క్లింటన్ అన్నమాటలు ఇవి. అమెరికా అభివృద్ధిలో భారతీయుల పాత్రను గుర్తించి చేసిన వ్యాఖ్యలు ఇవీ. తర్వాత వచ్చిన పాలకులు కూడా ఇంత ఓపెన్ కాకపోయినా భారతీయులకు తగిన ప్రాధాన్యం ఇచ్చారు. భారత సంతతికి చెందినవారికి కీలక పదవులు కట్టబెట్టారు. తాజాగా డొనాల్డ్ ట్రంప్ తన 2.0 పాలనలో కూడా భారత సంతతికి చెందినవారికి కీలక బాధ్యతలు అప్పగించారు. ఇక అమెరికాలో అత్యాధునిక సాంకేతికత, ఆరోగ్య సేవలు, వ్యాపార రంగాల్లో భారతీయ వలసవాసుల పాత్ర అమెరికా ఆర్థికవ్యవస్థకు బలాన్నిస్తోంది. తాజా పరిశోధన ప్రకారం ఇండియన్ మూలాల వలసదారులు అమెరికా ఫెడరల్ ప్రభుత్వానికి ఇతర దేశాల వలసదారుకన్నా అత్యధిక ఆర్థిక లాభాన్ని తెచ్చిపెడుతున్నారు.తాజా అధ్యయనం తెలిపిన ప్రకారం, ఒక్కో భారతీయ వలస కుటుంబం, వారి సంతానం మూడున్నర దశాబ్దాల్లో సగటున 1.7 మిలియన్ డాలర్లు(దాదాపు రూ.14 కోట్లు) మేర ప్రభుత్వానికి నికర లాభాన్ని అందించింది. ఇది ఇతర వలస జనాభా గుంపులతో పోలిస్తే చాలా ఎక్కువ. చైనా వలసదారులు 900,000 డాలర్లు, ఫిలిప్పీన్స్ వాసులు 650,000 డాలర్లు, కొలంబియా వాసులు 500,000 డాలర్లు, వెనిజులా వాసులు 400,000 డాలర్లు, డొమినికన్ రిపబ్లిక్ వలస వాదులు 200,000 డాలర్లు, క్యూబా వలసవాదులు 150,000 డాలర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నారు. వలసదారులు చెల్లించిన పన్నుల నుంచి వారు పొందిన ప్రజా సేవలు, సబ్సిడీలను తగ్గించిన తర్వాత లభించిన నికర ఆర్థిక ప్రయోజనాన్ని ఈ లెక్కలు సూచిస్తున్నాయి.భారతీయులు అమెరికాలో టెక్నాలజీ, మెడిసిన్, ఫైనాన్స్, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ వంటి రంగాల్లో ప్రధాన భాగస్వామ్యం వహిస్తున్నారు. అత్యధిక విద్యార్హతలు, ఉన్నత వృత్తి నైపుణ్యాలు, దీర్ఘకాల స్థిరత వీరిని ఫిస్కల్ అసెట్‌గా నిలిపాయి. అనేక సిలికాన్ వ్యాలీ స్టార్టప్‌లలో భారత్ మూలం ఉన్న వ్యక్తులే స్థాపకులు కావడం, వేలాది మంది డాక్టర్లు, ఇంజినీర్లు, పరిశోధకులు అమెరికా సామాజిక మూలధనాన్ని బలోపేతం చేయడం ఇందుకు స్పష్టమైన ఉదాహరణ.ఈ లెక్కలు అమెరికా వలస విధానాల అమలు ఫలితాలను ప్రతిబింబిస్తున్నాయి. ఉన్నత నైపుణ్యం గల ప్రజలను ఆకర్షించే విధానాలు అమెరికా ఆర్థిక శక్తిని పెంచాయి. భారతీయ వలసదారులు అందులో ప్రముఖ పాత్ర పోషించారు. సామాజిక మాధ్యమాల్లో వలసదారులపై ఉన్న అపార్థాలను ఈ డేటా ఖండిస్తోంది.ఈ అధ్యయనం ప్రకారం, భారతీయ వలస సమాజం ఒక్క ఆర్థిక వనరుగా మాత్రమే కాదు, అమెరికా సాంస్కృతిక, శాస్త్రీయ, వ్యాపార ప్రగతిలో కీలక భాగస్వామిగా అవతరించిందని స్పష్టం అవుతోంది. మూడు దశాబ్దాల వ్యవధిలో ఒక్క కుటుంబం స్థాయి నుంచి కూడా ప్రభుత్వం బిలియన్ల డాలర్ల ఆదా సాధించడం భారత వలసదారుల ప్రాధాన్యానికి నిదర్శనం

## స్లీపర్ బస్సులపై ఆర్టీఏ తనిఖీలు.. 32 కేసులు నమోదు



హైదరాబాద్ ఏసీ స్లీపర్ బస్సులలో జరుగుతున్న అక్రమాలపై రవాణా శాఖ తన తనిఖీలను ముమ్మరం చేసింది. ఆదివారం రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఆర్టీఏ, డీటీసీ బృందాలు బస్సులను తనిఖీ చేయగా, మొత్తం 32 కేసులు నమోదు చేశారు. వాహనాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు లేకపోవడం, యూనిఫారం లేకుండా డ్రైవింగ్ చేయడం వంటి ఉల్లంఘనలను గుర్తించారు. ఈ కేసులకు సంబంధించి రూ.లక్షల్లో కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. రంగారెడ్డి జిల్లాలో 7 కేసులు, సౌత్ జోన్లో 11 కేసులు, ఈస్ట్ జోన్లో 3 కేసులు, ఇతర ప్రాంతాల్లో 11 కేసులు నమోదయ్యాయి

# పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల సందర్భంగా పట్టణంలో క్యాండిల్ ర్యాలీ






**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 :** మంచిర్యాల జిల్లాలోని లక్షెట్టిపేట పట్టణంలో పోలీస్ అమరవీరుల వారోత్సవాల సందర్భంగా లక్షెట్టిపేట పోలీసుల ఆధ్వర్యంలో నేడు క్యాండిల్ ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీ పట్టణంలోని గాంధీ చౌక్ లో ప్రారంభమై ఉత్కూర్ చౌరస్తా వరకు సాగింది. ఈ సందర్భంగా లక్షెట్టిపేట ఎస్సై గోపతి గోపతి సురేష్ మాట్లాడుతూ...విధి నిర్వహణలో ప్రాణాలు అర్పించిన పోలీసుల ఆత్మ శాంతి కోసం ప్రత్యేక సంస్వరణ వేడుకలను రాష్ట్రమంతటా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని అందులో భాగంగా లక్షెటిపేటలో నేడు క్యాండిల్ ర్యాలీ నిర్వహిస్తున్నామని ర్యాలీలో పాల్గొన్న ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసుల ఆత్మ శాంతి కలగాలని ఎస్సై కోరారు.ఈ కార్యక్రమంలో వివిధ స్వచ్ఛంద సేవా సంస్థల సభ్యులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# జి.ఎం కార్యాలయంలో విజిలెన్స్ వారోత్సవాలు



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ అక్టోబర్ 27:** సింగరేణి ఆధ్వర్యంలో జనరల్ మేనేజర్ కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో సోమవారం విజిలెన్స్ అవగాహన వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ విచ్చేసి అందరికీ విజిలెన్స్ అవగాహన వారోత్సవాల శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జి ఎం ప్రసంగిస్తూ సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ ఆదేశాల మేరకు దేశవ్యాప్తంగా వివిధ ప్రభుత్వ సంస్థలతో పాటు మన సింగరేణి సంస్థలో కూడా ఈ నెల 27 నుండి 2 వరకు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సింగరేణి లోని అన్ని గనులు డిపార్ట్మెంట్లో నిర్వహించబడతాయి.



కేంద్ర విజిలెన్స్ కమిషన్ వారి ఆదేశానుసారం 1987 వ సంవత్సరము నందు మన సింగరేణి కంపెనీ లో నిఘా విభాగం (విజిలెన్స్ విభాగం) ఏర్పాటు చేయబడినది.

చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్, బి. వెంకన్న ఐ.ఆర్.టి.ఎస్ ఆధ్వర్యంలో ఈ విజిలెన్స్ విభాగం పనిచేస్తుందన్నారు. అవినీతికి వ్యతిరేకంగా ఉద్యోగులందరినీ చైతన్యపరిచి అవినీతి నిర్మూలనలో అందరినీ భాగస్వాములను చేయుటే విజిలెన్స్ అవగాహన వారోత్సవాల యొక్క ముఖ్య ఉద్దేశమనీ, మన సంస్థలో కూడా ఏమైనా అక్రమాలు జరుగుతున్నాయని గమనించినచొ విజిలెన్స్ అధికారులకు ఫిర్యాదు చేయగలరు.

అట్టి వారి పేర్లు గోప్యంగా ఉంచబడతాయి దేశ ప్రగతికి అవరోధం అయిన అవినీతిని నిరోధించు బాధ్యత ఏ కొద్ది మంది మీదనో వదిలివేయకుండా, ప్రతి ఉద్యోగి అవినీతి వలన దేశానికి సంస్థలకు జరిగే నష్టాన్ని గుర్తించి అక్రమాలకు వ్యతిరేకంగా పోరాడినప్పుడే ఈ సమస్యను అధిగమించగలమని అన్నారు. ఈకార్యక్రమాలలో భాగంగా సింగరేణి ఉద్యోగులకు మరియు అధికారులకు వ్యాసరచన పోటీలు, సింగరేణి స్కూల్ లోని విద్యార్థిని, విద్యార్థులకు వకృత్వ పోటీలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. అనంతరం విజిలెన్స్ "సమగ్రత ప్రతిజ్ఞ" చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్. ఓ.టి.జి.ఎం విజయ్ ప్రసాద్ ఏ.ఐ.టి.యూ.సి బ్రాంచ్ సెక్రటరీ ఎస్. సత్యనారాయణ, పర్సనల్ మేనేజర్ ఎస్. శ్యాంసుందర్, సి.ఎం.ఓ.ఏ.ఐ జాయింట్ సెక్రటరీ రవి, సీనియర్ పి.ఓ సత్యనారాయణ,జి.ఎం ఆఫీస్ హెచ్.ఓ.డి లు, అధికారులు, ఉద్యోగులు, యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ బస్సులు సరే...ఆర్టీసీ బస్సుల సంగతేంటీ...

హైదరాబాద్, అక్టోబరు 27,కర్నూలులో వేమూరి ట్రావెల్స్ సంస్థకు సంబంధించిన బస్సు అగ్ని ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో దాదాపు 20 మంది దాకా చనిపోయారు. అందులో ప్రయాణిస్తున్న ప్రయాణికులు గాయపడ్డారు. ఈ ప్రమాదం తర్వాత ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తెలంగాణ ఆర్టీఏ విస్తృతంగా తనిఖీచేస్తోంది. లోపాలు ఉన్న బస్సులను పక్కన పెడుతోంది. ఆ ప్రైవేట్ ట్రావెల్స్ సంస్థల నిర్వాహకులపై కేసులు కూడా నమోదు చేస్తోంది.ప్రవేట్ సంస్థలు మాత్రమే కాదు.. ప్రజా రవాణా సంస్థగా పేరుపొందిన ఆర్టీసీలు కూడా పరిస్థితులు అలానే ఉన్నాయి. కర్నూలు ప్రమాదం తర్వాత ఆర్టీసీ సంస్థ వివరాలు చూస్తే నిజంగానేగ్భ్రాంతి కలిగించేలా ఉన్నాయి.. హైదరాబాద్ నగర పరిధిలోని జగద్గిరిగుట్ట ప్రాంతంలో కనీసం దూర ప్రాంత డ్రైవర్లకు విశ్రాంతి తీసుకోవడానికి మంచాలు కూడా లేవట. దీంతో వారు కిందనే పడుకోవాల్సిన పరిస్థితి. పైగా డ్రైవర్లకు నిద్ర కూడా సరిగ్గా ఉండడం లేదట. నైట్ హాల్ట్ సర్వీసులో వెళ్లే వారికి నిద్రపోవడానికి తగినంత సమయం.. ఇతర సౌకర్యాలు కూడా ఉండడం లేదట.రాత్రిపూట బస్సులను నడిపే డ్రైవర్లు మధ్యాహ్నం ఒకటి నుంచి రెండు గంటలకు స్టీరింగ్ పడితే రాత్రి 10 గంటలకు డ్యూటీ ముగుస్తుందట. ఈ ప్రకారంగా చూసుకుంటే ఏకధాటిగా ఎనిమిది నుంచి తొమ్మిది గంటల పాటు డ్రైవర్లు బస్సులు నడపాసి వస్తుందట. గమ్యం చేరిన తర్వాత చాలా ప్రాంతాలలో కనీస సదుపాయాలు లేవట. కొన్నిసార్లు రోడ్డు పక్కనే బస్సులు ఆపుకొని అందులో ఉన్న సీట్లపై డ్రైవర్లు నిద్రిస్తున్నరట. ఆర్టీసీ సంస్థ ఏర్పాటు చేస్తున్న గదులు చిన్నవిగా ఉండడంతో డ్రైవర్లకు అవి సరిపోవడం లేదట. పైగా ఆ రూములలో పడకలు లేకపోవడంతో కటిక నేల మీదనే నిద్రపోవాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.భోజనం చేసిన తర్వాత నిద్రపోయేసరికి రాత్రి 11 గంటల 30 నిమిషాల వరకు అవుతోందట. రూట్ ఆధారంగా తెల్లవారుజామున మూడు గంటల 30 నిమిషాల నుంచి నాలుగు గంటల మధ్యలో నిద్ర లేచి నాలుగు గంటల 30 నిమిషాల వరకు మళ్ళీ స్టీరింగ్ పట్టుకోవాల్సి వస్తుందట. ఈ ప్రకారం డ్రైవర్లకు నిద్రపోవడానికి కేవలం 5 గంటల వరకే సమయం ఉంటుంది. ఇలాంటి క్రమంలో ఎటువంటి పొరపాటు జరిగిన సరే అది భారీ ప్రమాదానికి కారణం అవుతుంది.హైదరాబాద్ నుంచి మొదలు పెడితే ఇతర నగరాలకు ప్రైవేటు ఆపరేటర్లు నడిపించే బస్సుల్లో కూడా ఇద్దరు డ్రైవర్లు ఉంటున్నప్పటికీ? వారికి తగిన స్థాయిలో విశ్రాంతి ఉండడం లేదు. కొన్ని సందర్భాలలో ప్రవేటు బస్సు ఆపరేటర్లు రెండో డ్రైవర్ పడుకునే బెర్త్ కూడా అమ్ముకుంటున్నారు. దీంతో రెండవ డ్రైవర్ కూడా కంటిమీద కునుకు లేకుండానే ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది.హైదరాబాదులోని ఉప్పల్ ప్రాంతంలో నైట్ హాల్ట్ చేసే బస్సులు డ్రైవర్లకు ఏమాత్రం సౌకర్యాలు లేవు. వరంగల్ రెండో డిపోలో 19 బస్సులు ఉన్నాయి. తొర్రూరు డిపోలో 18 బస్సులు ఉండగా.. ఇవన్నీ కూడా రోడ్డు పక్కనే హాల్ట్ అవుతున్నాయి. దీంతో బస్సుల్లోనే డ్రైవర్లు నిద్రపోతున్నారు. చివరికి సులబ్ కాంప్లెక్స్ లలో కాలకృత్యాలు తీర్చుకుంటున్నారు. రాత్రి 11 గంటలకు గమ్యస్థానాలకు చేరుకుంటే.. నిద్రపోయేసరికి 11:30 దాటుతోంది. మళ్లీ తెల్లవారుజామున 4:00 కల్లా లేవాల్సి వస్తోంది. కొన్ని బస్సులు అయితే మూడు గంటలకే మొదలు కావడం అత్యంత విషాదం. ఇలా చెప్పుకుంటూ పోవాలి గాని దారుణాలు చాలానే ఉన్నాయి. మరి ఇలాంటి పరిస్థితులు ఉన్నచోట ప్రజా రవాణా ఎలా భద్రం? ప్రయాణికుల ప్రాణాలు ఎలా సురక్షితం?

## తుపాను పరిస్థితులపై అధికారుల సమీక్ష

మచిలీపట్నం × కృష్ణాజిల్లా మచిలీపట్నం కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మోంత తుపాను పరిస్థితులపై కృష్ణాజిల్లా ప్రత్యేక అధికారి ఆమ్రపాలి అధికారులతో సమీక్ష నిర్వహించారు.అమ్రపాలి మాట్లాడుతూ ఆంధ్రతీరం వైపు దూసుకువస్తున్న మొంథా తుఫాను నేపథ్యంలో ఎప్పటికప్పుడు తీవ్ర సమస్యను ఎదుర్కోవడానికి ప్రభుత్వం సిద్ధం గా ఉన్నదని అన్నారు. మొంథా తుఫాను ఆంధ్రతీరం వైపు దూసుకువస్తుంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం మరింత బలపడి తీవ్ర తుఫానుగా బలపడవచ్చు. విశాఖకు 790 కిమీ, కాకినాడకు 729 కిమీ దూరంలో కేంద్రీకృతమైంది. ఇది మచిలీపట్నం – కాకినాడ మధ్య తీరం దాటొచ్చు. మొంథా తీవ్ర తుఫాన్ గా మారిన సమయంలో గరిష్ఠంగా 110 – 120 కిమీ వేగంతో గాలులు వీస్తాయని తుఫాన్ హెచ్చరికల కేంద్రం తెలిపింది. తీరం దాటిన తర్వాత పెనుగాలులు, భారీ వర్షాలు కురుస్తాయని ప్రకటించిందని అన్నారు.

# నవంబర్ 3 నుంచి కాలేజీల బంద్

హైదరాబాద్, అక్టోబరు 27, తెలంగాణలో ఉన్నత విద్యాసంస్థలు సమ్మె సైరన్ మోగించేందుకు రెడీ అయ్యారు. భవిష్యత్ కార్యచరణ సిద్ధం చేసుకొని ఆందోళనకు సన్నాహాలు చేస్తున్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలనే డిమాండ్తో నవంబర్ 3 నుంచి రాష్ట్రంలోని కాలేజీల బంద్కు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నిర్ణయించింది. ఇప్పటికే ప్రభుత్వానికి సమ్మె నోటీసు అందించిన సమాఖ్య, ఇప్పుడు జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించింది. తెలంగాణలో నవంబర్ 3 నుంచి నిరవధిక బంద్ చేయాలని నిర్ణయించాయి ప్రైవేటు కాలేజీలు. ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య జనరల్ బాడీ మీటింగ్లో ఈ మేరకు నిర్ణయం ప్రకటించారు. ప్రభుత్వం హామీ ఇచ్చి మళ్లీ నెరవేర్చక పోతే.. మార్చి , ఏప్రిల్లో జరిగే ఫైనల్ పరీక్షలు కూడా బాయ్కాట్ చేస్తామని హెచ్చరించారు. బకాయిలు అడిగితేనే ప్రభుత్వానికి విజిలెన్స్ తనిఖీలు గుర్తుకు వస్తున్నాయని.. ? బెదిరింపులకు భయపడి ఈసారి వెనక్కి తగ్గేది లేదని స్పష్టం చేశారు.ఫీజు రీఎంబర్స్మెంట్ బకాయిలు దీపావళి నాటికి 1200 కోట్ల బకాయిలు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం? ఇవ్వలేదని కాలేజీ యాజమాన్యాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. దసరాకి 600 కోట్లు ఇస్తామని చెప్పి 200 కోట్లు మాత్రమే ఇచ్చిందని? మిగిలిన బకాయిలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. బకాయిల విడుదలపై తక్షణం క్లారిటీ ఇవ్వాలని కోరుతున్నారు. ఈ సమస్య పరిష్కారం కోసం సమాఖ్య ప్రతినిధులు ఇప్పటికే మంత్రులను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. అయినా ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో బంద్ పాటించాలని నిర్ణయించారు.ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనను తీవ్రతరం చేస్తూ, నవంబర్ మొదటి వారంలో లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు, బోధన, బోధనేతర సిబ్బందితో 'చలో హైదరాబాద్' నిర్వహించాలని ప్రైవేట్ ప్రొఫెషనల్ కళాశాలలు యోచిస్తున్నాయి.రాష్ట్రంలో దాదాపు 2,500 ప్రైవేట్ విద్యాసంస్థలు ఉన్నాయని, వీటిలో ఇంజనీరింగ్, ఫార్మసీ, బి.ఎడ్, నర్సింగ్, ఇతర ప్రొఫెషనల్ ప్రోగ్రామ్లను అభ్యసిస్తున్న 15 లక్షల మంది విద్యార్థులు ఉన్నారని, ఎక్కువ మంది విద్యార్థులు ఫీజు రీయింబర్స్మెంట్పై ఆధారపడి ఉన్నారని.. సొంతంగా ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నారని తెలంగాణ ఉన్నత విద్యా సంఘాల సమాఖ్య తెలిపింది. ఈ విద్యార్థులలో ఎక్కువ మంది ఫీజు రీయింబర్స్మెంట్పైనే ఆధారపడి చదువుతున్నారు. బకాయిలు నిలిచిపోవడం వల్ల కళాశాలల నిర్వహణ, బోధనా ప్రమాణాలు దెబ్బతిని.. విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడే అవకాశం ఉంది.

ఈ నిరసన కార్యాచరణను ఖరారు చేసేందుకు ఉన్నత విద్యాసంస్థల సమాఖ్య నేడు జనరల్ బాడీ మీటింగ్ను నిర్వహించింది.

ప్రభుత్వం ఈ సమస్యపై సానుకూలంగా స్పందించకపోతే.. రాష్ట్రంలోని ఉన్నత విద్య స్తంభించిపోయే పరిస్థితి ఏర్పడే అవకాశం ఉందని సమాఖ్య ఉద్ఘాటిస్తోంది.

# ఆగమాగం అవుతున్న తెల్లబంగారం

అదిలాబాద్, అక్టోబరు 27, ఆరుగాలం కష్టపడి సాగు చేసిన పత్తి పంట సాగు రైతులను నిండముంచింది. పంట చేతికందుతున్న స మయంలో కురిసిన వర్షాలు పూత, కాయ రాలిపోవడానికి కారణమయ్యాయి. దీంతో కాయలు సరిగా విచ్చుకోలేదు. పొలాల్లో నీ రు నిలిచి పంట దెబ్బతింది. పత్తి పంట సాగుపై ఎన్నో ఆశలు పెట్టుకున్న రైతులకు ని రాశే మిగులుతుంది. ఊహించని విధంగా ప్రకృతి కన్నెర్ర చేయడంతో తెల్లబంగారంతో నష్టాలు కలుగుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సారి పత్తికి ధర అధికంగా ఉన్నప్పటికీ ఆశించినంతగా దిగుబడి లేక పెట్టుబడులైనా వస్తాయో లేదోనని బా ధ పడుతున్నారు. వేల ఎకరాల్లో రైతులు ప త్తి పంట సాగు చేసినట్లు వ్యవసాయ అధికారుల లెక్కలు చెబుతున్నాయి.జిల్లాలో కొన్ని మండలాల్లో అధికంగా నల్లరేగడి భూములు ఉండటంతో పాటు గతేడాది ఆశించిన దిగుబడి రాకపోవడంతో ఈసారి రైతులు పత్తి సాగుపై గంపెడాశాలు పెట్టుకున్నారు. పంట ఏపుగా పెరిగి కాయ పట్టే సమయంలో అధి క వర్షాలతో పంట ఎదుగుదల్లేక ఎర్ర తెగుళ్ల బారిన పడి దిగుబడి తగ్గిపోయిందని రైతు లు వాపోతున్నారు.గత ఏడాది ఎకరాకు 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రాగా, ఈసారి ఎకరాకు 5 క్వింటాళ్లు దిగుబడి వచ్చే పరిస్థితిలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. మార్కెట్లో పత్తి పంటకు ధర ఉన్న పంట ది గుబడి లేకుండా పోయి పెట్టుబడులు రాని పరిస్థితి నెలకొందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.పత్తి పంట సాగుకు ఎకరాకు రూ.20 వేలకు పైగా పెట్టుబడులు పెట్టీ కౌ లు తీసుకొని పంటలు సాగుచేసిన తమ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారిందని రైతులు మదనపడుతున్నారు. గత రెండేళ్ల క్రితం పత్తి పంటకు గులాబి రంగు పురుగు సోకి నష్టాల పాలు చేయగా ఈసారి అధిక వర్షాభావం తో ఇప్పట్టికే ఎర్ర పురుగు వైరస్ సోకి దిగుబడి తగ్గిపోయే దుస్థితి నెలకొందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం పంట బీమా అమలు చేసి రైతులను అదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

వానాకాల సీజన్లో అకాల వర్షం వల్ల పత్తి పంట పూర్తిగా నష్టపోవడం జరిగింది. పత్తిని తీసి మిల్లర్ల దగ్గరకి వెళ్తే కాయ, తేమ పేరు తో రూ.4 వేలకు క్వింటాలు చొప్పున కొనుగోలు చేస్తున్నారు. జిల్లాలో మిల్లు యాజ మాన్యం రైతులను నిలువ దోపిడీ చేస్తున్నా రు. ప్రభుత్వం మద్దత్తు ధర రూ.8వేల 110 ప్రకటించింది.కానీ పత్తి కొనుగోలు వ్యాపారులు మాత్రం సీసీఐ నిబంధనలు పట్టించి కోకుండా రైతుల కష్టాలను దోచుకుంటున్నా రు. ప్రభుత్వం స్పందించి జిల్లా వ్యాప్తంగా అవసరమైనచోట్ల సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన పత్తి పంట రైతులను మద్దతు ధర పెంచి ఆదుకోవాలని కోరుతున్నారు.వ్యవసాయం మీద ఉన్న మక్కువతో భూమి కౌలు కు తీసుకుంటే న ష్టం వాటిల్లింది. భూ యజమానులకు నగదు చెల్లించి, పెట్టుబడికి అప్పు చేయాల్సి వస్తుంది. ప్రకృతి వైపరీత్యంగా పంట చేతికొచ్చిన సమయానికి వర్షాలు కురవడంతో ది గుబడి లేకుండాపోయింది.ఈసారి యూరియా బస్తాల కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డాం, సరైన సమయానికి అవ సరమైనంత ఎరువులు దొరకలేదు. ఈ సారి పంట కోసం చేసిన అప్పుకుడ తీరే ట్టు లేదు. కౌలు పైసలు కూడా వచ్చేలా లేవు, పంట బీమాను ప్రభుత్వం అమలు చేసి రైతులను ఆదుకోవాలి

# ఫుల్ జోష్ లో కేసీఆర్



హైదరాబాద్, అక్టోబరు 27, సార్ ఫుల్ జోష్లో కనిపిస్తున్నారు. కొన్నాళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఫాంహౌస్కే పరిమితమైన గులాబీ బాస్ కేసీఆర్..జూబ్లీహిల్స్ బైపోల్పై పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. ఈ మీటింగ్కు పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు.. ముఖ్య నేతలంతా అటెండ్ అయ్యారు. ప్రతి ఒక్కరితో నవ్వుతూ మాట్లాడుతూ.. అందరి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారట గులాబీ బాస్. అంతేకాదు రివ్యూ మీటింగ్లో కేసీఆర్ మాట్లాడిన తీరు కూడా లీడర్లలో ఫుల్ కాన్ఫిడెన్స్ నింపిందట. ముందుగా కేసీఆర్ ఫుల్ యాక్టీవ్గా కనిపించడమే లీడర్లకు ఎక్కడా లేని సంతోషం నింపిందట.ఇక ప్రజా సమస్యలు, జూబ్లీహిల్స్లో ఉన్న పరిస్థితులపై కేసీఆర్ మాట్లాడిన మాటలు కూడా నేతలను అ?రటాక్ట్ చేశాయట. ఫాంహౌస్లో ఉన్నప్పటికీ సార్ ప్రతీ అంశాన్ని నిశితంగా గమనిస్తున్నారని..వచ్చేసారి అధికారం మనదే అని కాన్ఫిడెన్స్తో ఉన్నారని లీడర్లు తెగ హ్యాపీ అయిపోయారట.ఈ క్రమంలోనే అనారోగ్యం నుంచి కేసీఆర్ పూర్తిగా కోలుకున్నట్లు చెబుతున్నారు బీఆర్ఎస్ ముఖ్యనేతలు. ఎర్రవెల్లి ఫాంహౌస్లో నిర్వహించిన జూబ్లీహిల్స్ ఉపఎన్నిక సన్నాహక సమావేశంలో గులాబీ బాస్ చాలా యాక్టీవ్గా కనిపించారని అంటున్నారు లీడర్లు. మీటింగ్కు వచ్చిన వారందరిని పేరు పేరునా పలకరించారట. రాష్ట్రంలోని తాజా రాజకీయ పరిణామాలపై ఆరా తీయడంతో పాటు తన దృష్టికి వచ్చిన అంశాలను కూడా ప్రస్తావించారట. చాలా రోజుల తర్వాత తమ అధినేత అంత యాక్డీవ్గా..అధికారంలో ఉన్నంత జోష్లో కనిపించడంతో బీఆర్ఎస్ నేతలు హ్యాపీ అయిపోతున్నారు.ఇక ఈ సమావేశంలో కేసీఆర్ మాట్లాడిన మాటలు, ఇచ్చిన భరోసా గులాబీ నేతల్లో నూతన ఉత్తేజం నిపిందట. రెండేళ్ల కాంగ్రెస్ పాలనపై తెలంగాణ ప్రజలు విసిగిపోయారని, ఇచ్చిన ఒక్క హామీని కూడా సరిగ్గా నెరవేర్చలేదని, జనానికి కాంగ్రెస్ సర్కార్పై నమ్మకం పోయిందని ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు కేసీఆర్. ఇదే సమయంలో వచ్చే రెండున్నరేళ్లలో మళ్లీ అధికారంలోకి వస్తామని అధినేత కేసీఆర్ నమ్మకంగా చెప్పడం బీఆర్ఎస్ నేతలకు బూస్టప్ ఇచ్చిందట.

మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్న సార్..

ఫాంహౌస్ మీటింగ్లో గులాబీ బాస్ మాట తీరును గమనించిన కారు పార్టీ లీడర్లు..సార్ మళ్లీ ప్రజాక్షేత్రంలోకి అడుగుపెట్టబోతున్నారని అంటున్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ప్రచారంలో భాగంగా కేసీఆర్ ఒక సభలో పాల్గొంటారని అంటున్నారు. ఇక ఇక్కడి నుంచి మునుపటిలా యాక్టీవ్ కాబోతున్నారట. అసెంబ్లీ ఎన్నికలకు ఇంకా రెండున్నరేళ్ల సమయం ఉంది కాబట్టి..ఇప్పటినుంచే ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళ్లాలని కేసీఆర్ డిసైడ్ అయినట్లు తెలంగాణ భవన్ వర్గాల టాక్.ఈ క్రమంలోనే ఇకపై కేసీఆర్ రెగ్యులర్గా తెలంగాణ భవన్కు రానున్నట్లు తెలుస్తోంది. పార్టీ లీడర్లతో వరుస సమావేశాలు, కార్యకర్తల మీటింగ్లు, ప్రజా సమస్యలపై కార్యాచరణ రూపొందించడం వంటి యాక్టివిటీతో గులాబీ దళపతి బిజీ బిజీగా గడపనున్నారని ముఖ్య నేతలు చెబుతున్నారు.పరిస్థితులను బట్టి జిల్లాల పర్యటనలకు వెళ్లేందుకు కూడా ఆయన ప్లాన్ చేస్తున్నారట. ఇదే గనుక జరిగితే బీఆర్ఎస్ పార్టీలో మునుపటి జోష్ వస్తుందని, మళ్లీ వచ్చే ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వచ్చేందుకు ఎంతో యూజ్ అవుతుందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఏదైనా సార్ ఫుల్ యాక్టీవ్గా కనిపించడంతో లీడర్లకు తిరిగి అధికారంలోకి వచ్చినంత ఆనందం కలిగిందని అంటున్నారు.

## మజ్లిస్ ముసుగులో కాంగ్రెస్ అభ్యర్థి లక్ష్మణ్

హైదరాబాద్ జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో మజ్లిస్ ముసుగులో కాంగ్రెస్ అభ్యర్థి బరిలో దిగారని రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్ మండిపడ్డారు. మతోన్మాదానికి అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికల్లో ప్రజలు బిజెపికి పట్టం కట్టాలని చూస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం యూసఫ్ గూడా డివిజన్లోని నవోదయ కాలనీ, ఎస్బిఐ క్వార్టర్ లో బిజెపి అభ్యర్థి లంకల దీప రెడ్డి తరపున ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కె లక్ష్మణ్ మాట్లాడుతూ మోడీ నాయకత్వంలో దేశం అభివృద్ధిని చూసిన ప్రతి ఒక్కరు బిజెపి రావాలని ఆకాంక్షిస్తున్నారని అన్నారు. బిఆర్ఎస్ కాంగ్రెస్ ఏ పార్టీ అధికారంలో ఉన్న మజ్లిస్ తన ప్రాబల్యాన్ని చాటుతుందని విమర్శించారు. బి ఆర్ ఎస్ కాంగ్రెస్ అధికారాన్ని చూసిన రాష్ట్ర ప్రజలు అభివృద్ధి కోసం బిజెపి వైపు చూస్తున్నారని అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం లో యువకుడైన దీపక్ రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు

## ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ)పి చంద్రయ్య



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 :** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) పి. చంద్రయ్య అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో మంచిర్యాల రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు తో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. మంచిర్యాల పట్టణంలోని హమాలివాడ, సూర్యనగర్ కాలనీ వాసులు గత కొద్ది రోజులుగా తమ కాలనీకి నల్లా నీరు రావడం లేదని,నీటిని అందించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల పట్టణానికి చెందిన భూపతి జగన్ మోహన్ తన తండ్రి పేరిట గల భూమిని ఆయన మరణించినందున తన పేరిట పట్టా మార్పు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. మంచిర్యాల మండలం వేంపల్లి గ్రామానికి చెందిన రాయిలి సత్యం తాను తన భూమి హద్దుగా కొలత కొరకు దరఖాస్తు చేసుకున్నానని, సర్వే చేయించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కాసిపేట మండలం ధర్మారావుపేట గ్రామానికి చెందిన నేతుల సత్తయ్య తనకు వృద్ధాప్య పింఛన్ మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు.బెల్లంపల్లి మండల కేంద్రానికి చెందిన జె.బాలక్క, ఎస్.సి. కాలానికి చెందిన ఎన్.లక్ష్మి, భూపెల్లి లావణ్య లు తమకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని కోరుతూ వేరువేరుగా అర్జీలు సమర్పించారు. బెల్లంపల్లి రైతు ఉత్పత్తిదారుల కంపెనీ ప్రతినిధులు తమ దరఖాస్తులో సేంద్రీయ ఉత్పత్తుల అవుట్ లెట్ కొరకు స్థలం కేటాయించాలని కోరారు. నెన్నెల మండలం నందులపల్లి గ్రామానికి చెందిన ఇందూరి కిష్టయ్య తన కుమారుడు తన భూములు లాక్కొని ఇంటి నుంచి బయటకు వెళ్లగొట్టాడని,తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## లక్కీ డ్రా ద్వారా మద్యం దుకాణాల కేటాయింపు

### జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 :** నూతన మద్యం పాలసీ విధానం ప్రకారం లక్కీ డ్రా పద్ధతిన మద్యం దుకాణాలు కేటాయించడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ మండలం శ్రీరాంపూర్ లో గల పి.వి.ఆర్. గార్డెన్స్ లో నిర్వహించిన లక్కి డ్రా కార్యక్రమానికి ఆబ్కారీ, మద్య నిషేధ శాఖ అధికారి నంద గోపాల్, మంచిర్యాల ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నూతన మద్యం పాలసీ విధానం ద్వారా దుకాణాలు కేటాయించడం జరిగిందని తెలిపారు. జిల్లాలో మద్యం దుకాణాల కొరకు 1 వేయి 712 దరఖాస్తులు వచ్చాయని, 73 దుకాణాలకు లక్కీ డ్రా తీయడం జరిగిందని తెలిపారు. నూతన మద్యం పాలసీ నియమ,నిబంధనలను అనుసరిస్తూ ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా ఏర్పాట్లు చేయడం జరిగిందని, దుకాణాల వారీగా దాఖలైన దరఖాస్తులకు సంబంధించిన దరఖాస్తుదారుల సమక్షంలో లక్కీ డ్రా తీస్తూ మద్యం దుకాణాల కేటాయింపును ఖరారు చేయడం జరిగిందని, లక్కీ డ్రా కోసం వినియోగించిన టోకెన్ లను అందరికీ చూపిస్తూ, పారదర్శకంగా ప్రక్రియ ప్రారంభం నుండి చివరి వరకు ఫొటో, వీడియో చిత్రీకరణ చేయడం జరిగిందని,టోకెన్ కలిగి ఉన్న వారిని మాత్రమే లోపలికి అనుమతించడం జరిగిందని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా పరిసర ప్రాంతాల్లో కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.దుకాణం పొందిన వారు నిబంధనలను అనుసరిస్తూ,లైసెన్స్ ఫీజు రూపేణా నిర్ణీత రుసుము చెల్లించేందుకు వీలుగా వేదిక వద్దనే అవసరమైన కౌంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా

మైనర్లకు లిక్కర్ విక్రయించవద్దు
నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించాలి
ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్
ఐడీఓసీలో A4 మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా



**రాజన్న సిరిసిల్ల జిల్లా, అక్టోబర్ - 27 (ప్రజాబలం ప్రతినిధి)**మద్యం దుకాణాల టెండర్ లక్కీ డ్రా పారదర్శకంగా నిర్వహించామని ఇంచార్జి కలెక్టర్ గరీమా అగ్రవాల్ స్పష్టం చేశారు. జిల్లాలో 2025-2027 సంవత్సరం వరకు కొనసాగనున్న మద్యం షాపుల టెండర్ల ఓపెన్ డ్రా జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించగా, ఇంచార్జి కలెక్టర్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. జిల్లాలో మొత్తం 48 దుకాణాలు ఉన్నాయని, వాటిలో గౌడ్లకు 9, ఎస్సీ లకు 5 రిజర్వేషన్ ప్రకారం కేటాయించామని వెల్లడించారు. సెప్టెంబర్ 26వ తేదీన టెండర్ నోటిఫికేషన్, అప్లికేషన్ల స్వీకరణ మొదలుపెట్టామని, దరఖాస్తులు ఈ నెల(అక్టోబర్) 23వ తేదీ వరకు స్వీకరించామని తెలిపారు. మొత్తం దరఖాస్తులు 1381 వచ్చాయని వెల్లడించారు.డిసెంబర్ 01 వ తేదీ నుంచి నూతన లైసెన్సులతో మద్యం దుకాణాలు కొనసాగనున్నాయని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం దుకాణాలు నిర్వహించాలని ఆదేశించారు. షాపులకు సంబంధించిన లైసెన్స్ ఫీజు చెల్లించాలని సూచించారు.కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారి రాధాకృష్ణారెడ్డి, ఎక్సైజ్ సీఐలు శ్రీనివాస్, రాజేశ్వర్ రావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మూడు నెలల్లో రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తాడు

నల్లగొండ మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ హాట్ కామెంట్స్ చేసారు. సామాజిక న్యాయం కోసం మా పార్టీ కట్టుబడి ఉన్నాము. ఆశించిన సామాజిక తెలంగాణ వచ్చిందని భావించాం. అందుకే కొంతకాలం మా కార్యక్రమాలు తగ్గించుకున్నామని అన్నారు.కానీ మార్పు లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ లకు రాజ్యాధికారం కోసం మళ్ళీ యాత్ర మొదలు పెట్టాం. ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలి. రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని ఇవ్వలేదు. రాజగోపాల్ రెడ్డి చాలా నిజాయితీపరుడు. ఆయనకు నేను ఎన్నికల ఏజెంట్ గా పనిచేశాను. మూడు నెలల లోపు రాజగోపాల్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూలుస్తాడని అన్నారు, నాకు తెలిసిన వారే 30, 40 మంది ఎమ్మెల్యేలు రాజగోపాల్ రెడ్డి తో టచ్ లో ఉన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి నల్గొండ జిల్లా నుండే సంక్షోభం పొంచి ఉంది. స్థానిక సంస్థల విషయంలో ప్రజలను మోసం చేసింది కాంగ్రెస్. రిజర్వేషన్ జీవో చెల్లదని నేను ముందే చెప్పానని అన్నారు.

## బస్ షెల్టర్ నిర్మాణం విద్యార్థులకు ఉపయోగం



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** ఆందోల్ నియోజకవర్గంలోని పుల్కల్ మండల పరిధిలో గల, ముద్దాయిపేట, చౌరస్తాలో, నూతనంగా ప్రభుత్వం ఓ బస్ షెల్టర్ నిర్మించింది,పాఠశాల కళాశాల విద్యార్థులతోపాటు, ఉపాధ్యాయులు ప్రయాణికులు ఇక్కడి నుంచి, సంగారెడ్డికి వెళ్తుంటారు, రోజు సుమారు 400కు పైగా రాకపోకలు సాగిస్తుంటారు, విద్యార్థుల అవస్థలను గుర్తించిన, మంత్రి దామోదర్ రాజనర్సింహ, బస్ షెల్టర్ నిర్మాణానికి మంజూరు చేయించి రూ, 13, లక్షల (డి ఎం ఎఫ్ టి ) నిధులు కేటాయించారు, ఇటీవల బస్ షెల్టర్ నిర్మాణం పూర్తయింది,త్వరలో షెల్టర్ ను,ప్రారంభించి, విద్యార్థులకు అందుబాటులోకి తీసుకురానున్నట్లు, (టి ఎస్ ఇ డబ్ల్యు ఐడిసి ) ఏఈ మల్లప్ప తెలిపారు......

## రాజన్న ఆలయ అభివృద్ధి, విస్తరణ పనులను పరిశీలించిన జిల్లా ఇన్చార్జి కలెక్టర్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** వీటి ఏడిఏ ఆధ్వర్యంలో వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి, ఆలయ విస్తరణ పనులను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ గరీమ అగ్రవాల్ క్షేత్రస్థాయిలో సోమవారం పరిశీలించారు.

ఆలయ విస్తరణలో భాగంగా ప్రణాళిక ప్రకారం ఇప్పటివరకు చేపట్టిన, కూల్చివేత పనులను ఆలయ, ఆర్ అండ్ బి అధికారులు ఇంచార్జ్ కలెక్టర్ కు క్లుప్తంగా వివరించారు.

ఈ సందర్భనలో రాజన్న ఆలయ ఈవో రమాదేవి, ఆర్డీవో రాధాబాయి, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నికిత, ఆర్ అండ్ బి ఈ ఈ నరసింహ చారి, వీ టి ఏ డి ఏ సిపిఓ అన్సారి, నీటిపారుదల శాఖ ఈఈ కిషోర్, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, వేములవాడ అర్బన్ తాసిల్దార్ విజయప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.



గుడి చెరువు బండ్ సందర్శన.

వీటి ఏడిఏ ఆధ్వర్యంలో అభివృద్ధి చేస్తున్న వేములవాడ గుడి చెరువు బండ్ ను జిల్లా ఇన్చార్జి కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. బండ్ నిర్మాణ పనులు ఎప్పుడు ప్రారంభించారని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు జరిగిన పనులను పరిశీలించి, మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భనలో పర్యాటక సంస్థ ఎస్ ఈ సరిత, వీటి ఏడిఏ సిపిఓ అన్సారి, మున్సిపల్ కమిషనర్ అన్వేష్, తాసిల్దార్ విజయప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ రాజ్యంలో పక్క అర్హులకు ఇల్లు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్



**వికారాబాద్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్27( ప్రజాబలం ) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, పంచలింగాల్ గ్రామంలో అర్హులైన ప్రతి ఒక్కరికి విడుదలవారీగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు వస్తుందని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్ తెలిపారు ఎన్నో రోజులుగా ఎదురు చూస్తున్న పేదోళ్ల కల నెరవేర్చేది కాంగ్రెస్ ప్రభుత్వానికి సాధ్యమని తెలిపారు ఇంతకుముందు కాంగ్రెస్ పాలనలో అనేక అభివృద్ధి కార్యక్రమాలు సంక్షేమ పథకాలు తెల్ల రేషన్ కార్డు ఉండి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వం దేనని తెలిపారు ఇప్పుడు కూడా దశలవారీగా అన్ని అభివృద్ధి సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు

## పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సైకిల్ ర్యాలీ

### పోలీసు అమరులు చేసిన త్యాగాలను ప్రతి ఒక్కరు స్మరించుకోవాలి - అదనపు ఎస్పీ చంద్రయ్య.



**రాజన్న సిరిసిల్ల జిల్లా , అక్టోబర్ 27 (ప్రజాబలం ప్రతినిధి)**రాజన్న సిరిసిల్ల జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం పట్టణ పరిధిలోని అంబేద్కర్ చౌరస్తా నుండి బతుకమ్మ ఘాట్ వరకు సైకిల్ ర్యాలీ నిర్వహించబడింది.ఈ సందర్భంగా అదనపు ఎస్పీ చంద్రయ్య మాట్లాడుతూ.విధి నిర్వహణలో ప్రాణాలను అర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని, సమాజంలో శాంతి భద్రతల స్థాపనకు పోలీసులు చేస్తున్న కృషి గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు.అలాగే పోలీస్ శాఖ, ప్రజల మధ్య సత్సంబంధాలను బలోపేతం చేయడంలో ఇలాంటి అవగాహన కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తాయన్నారు.సైకిల్ ర్యాలీలో పోలీస్ అధికారులు, సిబ్బంది, యువత, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్లు కృష్ణ, మొగిలి, శ్రీనివాస్, వీరప్రసాద్, వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, మధుకర్,ఆర్.ఐలు మధుకర్, రమేష్ ,యాదగిరి,ఎస్.ఐలు, ఆర్.ఎస్.ఐలు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు, యువత తదితరులు పాల్గొన్నారు.

## అప్రమత్తంగా వుండాలి

### బీసీ హాస్టళ్ల వార్డెన్లు, గురుకులాల ప్రిన్సిపాల్స్కు మంత్రి సవిత ఆదేశం.

అమరావతిమొంథా తుఫాన్ దృష్ట్యా అప్రమత్తంగా ఉండాలి. వార్డెన్లు, ఏబీసీడబ్ల్యూ వో 24 గంటలు హాస్టళ్లలో ఉండాల్సిందే నని మంత్రి సవిత ఆదేశించారు. విద్యార్థులకు కాచి చల్లార్చిన నీరు, తాజా ఆహారం మాత్రమే ఇవ్వాలి.. హాస్టళ్ల విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలి. విద్యార్థుల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే తక్షణమే వైద్యం అందించాలని అమె అన్నారు.

## నవజాత శిశు మరణాలను తగ్గించేందుకు చర్యలు చేపట్టాలి: జిల్లా కలెక్టర్ రాజర్షి షా



**అక్టోబర్ 27, 2025 ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జిల్లాలో నవజాత శిశువుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్య శాఖ అధికారులను ఆదేశించారు.

సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన నూతన శిశు సంరక్షణ శిక్షణ కార్యక్రమాన్ని కలెక్టర్ జ్యోతి వెలిగించి ప్రారంభించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, నవజాత శిశు మరణాల రేటును సింగిల్ డిజిట్ స్థాయికి తగ్గించేందుకు వైద్యులు, నర్సింగ్ సిబ్బంది మరింత అంకితభావంతో, నిబద్ధతతో పనిచేయాలని



సూచించారు. జిల్లాలో గిరిజన ప్రాంతం అధికంగా ఉండటం, పలు భౌగోళిక, సామాజిక సవాళ్లు ఉన్నా వైద్య బృందం అహర్నిశలు కృషి చేస్తోందని తెలిపారు. ఇప్పటికే వైద్య శాఖ చేపడుతున్న చర్యల వలన మాత, శిశు, బాల మరణాలు గణనీయంగా తగ్గాయన్నారు. ప్రతి ప్రసవ కేంద్రంలో, ప్రతి జనన సమయంలో నాణ్యమైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తున్నామని వివరించారు. నవజాత శిశు మరణాలను తగ్గించడమే ప్రధాన లక్ష్యంగా ఐసీఎంఆర్ కార్యక్రమం లో భాగంగా రిమ్స్ ఆదిలాబాద్, నిలోఫర్, ఏఐఐఎంఎస్ ఆసుపత్రులు, హైదరాబాద్ సహకారంతో ఈ శిక్షణ నిర్వహిస్తున్నారని, ఈ శిక్షణ ద్వారా వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ప్రతి శిశువుకూ సమయానికి సురక్షిత సేవలు అందించే నైపుణ్యం పెంపొందించుకోవాలని అన్నారు. క్షేత్ర స్థాయిలో ప్రతి వైద్యుడు, నర్సు ఈ శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఆచరణలోకి తీసుకురావాలని, ప్రతి శిశువుకు సమయానికి అవసరమైన ప్రాణరక్షక సేవలు అందేలా కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. అనంతరం శిక్షణలో నవజాత శిశు పునరుద్ధరణ, తల్లిపాలు అందించే ఉత్తమ పద్ధతులు, కంగారూ మదర్ కేర్, సంక్రామణ నియంత్రణ విధానాలు వంటి అంశాలపై నిపుణులు ప్రాక్టికల్ సెషన్లు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. నరేందర్ రాథోడ్, రిమ్స్ డైరెక్టర్ డా. జైసింగ్ రాథోడ్, డా. ధన్నిగై నాథన్, వైద్యులు, నర్సింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మద్యం దుకాణాల కేటాయింపుకు లక్కీ డ్రా నిర్వహణ పారదర్శకంగా కొనసాగిన ప్రక్రియ: జిల్లా కలెక్టర్ రాజార్షి షా



**అక్టోబర్ 27, 2025 ఆదిలాబాద్ ప్రజాబలం ప్రతినిధి:** జిల్లాలో మద్యం దుకాణాల కేటాయింపునకు సంబంధించిన లాటరీ ప్రక్రియను సోమవారం స్థానిక రత్న గార్డెన్‌లో జిల్లా కలెక్టర్ రాజార్షి షా పారదర్శకంగా నిర్వహించారు. ఈ లక్కీ డ్రా కార్యక్రమంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కే. రఘు రామ్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ హిమశ్రీ, మద్యం దుకాణాల దరఖాస్తుదారులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ పాలసీ (2025%-%2027) ప్రకారం మొత్తం 40 మద్యం షాపుల కేటాయింపులో, 34 షాపులు లక్కీ డ్రా ద్వారా కేటాయించబడ్డాయి. 10 కంటే తక్కువ దరఖాస్తులు వచ్చిన షాపులకు డ్రా నిర్వహించకుండ, వాటి కోసం మళ్లీ రీ-టెండర్ నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి షాపుకు సంబంధించిన దరఖాస్తుల ఆధారంగా టోకెన్ నంబర్లు కేటాయించి, దరఖాస్తుదారుల సమక్షంలో కలెక్టర్ స్వయంగా లక్కీ డ్రా నిర్వహించారు. డ్రా ప్రారంభం నుంచి ముగింపు వరకు మొత్తం ప్రక్రియను ఫోటో, వీడియో రికార్డింగ్ చేయడం ద్వారా పూర్తి పారదర్శకతతో నిర్వహించారు.

ఈ కార్యక్రమం ప్రశాంత వాతావరణంలో ఎటువంటి అవాంతరాలు లేకుండా సాగేందుకు అధికారులు పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. భద్రతా పరమైన దృష్ట్యా భారీ పోలీసు బందోబస్తు కూడా ఏర్పాటు చేశారు. లక్కీ డ్రాలో ఎంపికైన వారికి లైసెన్స్ ఫీజు చెల్లింపునకు అవసరమైన సదుపాయాలను వేదికపైనే కల్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎక్సైజ్ అధికారులు, సిబ్బంది, దరఖాస్తుదారులు, తదితరులు పాల్గొన్నారు.

## చెట్టు విరిగి కారు పై పడింది



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 27:** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా నాచారం భవాని నగర్ స్ట్రీట్ నంబర్ 3 లో రాత్రి సమయంలో ఒక పెద్ద చెట్టు వేర్లతో సహా విరిగి కాలనీలో పార్క్ చేసిన కారుపై పడింది. చెట్టు పెద్ద శబ్దంతో కారు మీద పడడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. అదృష్టవశాత్తు ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వెంటనే కాలనీ వాసులు మరియు మున్సిపల్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని చెట్టును తొలగించే పనులు ప్రారంభించారు.చెట్టును తొలగించే ప్రక్రియ కొనసాగుతోంది. స్థానికులు చెట్టు తొలగింపు పనులకు సహాయపడ్డారు. కాలనీలో



ఇంకా ఉన్నటువంటి పెద్ద చెట్లను ఎటువంటి ప్రమాదాలు జరుగకముందే తొలగించాలని కాలని వాసులు తెలిపారు.

## వేములవాడ భీమేశ్వర ఆలయంలో కార్తీక్ శోభ. సోమవారం రోజున భక్తుల రద్దీ.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** దక్షిణ కాశీగా ప్రసిద్ధి పొందిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం పరిధిలోని శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో కార్తీక సోమవారం ను పురస్కరించుకొని వేలాది మంది భక్తులు స్వామి వారి దర్శనార్థం సుదూర ప్రాంతాల నుండి విచ్చేయడం జరిగింది.

కార్తీక మాసం మొదటి సోమవారం రోజు అయినందున భీమేశ్వరాలయ సమీపంలో భక్తుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన స్వామి వారికి ప్రీతికరమైన కోడె మొక్కులు, అభిషేకాలు, గండాదీపం, నిత్య కళ్యాణం, చండీ హెూమం, సత్యనారాయణ స్వామి



వ్రతాలు, లింగార్చనలు వంటి పూజా కార్యక్రమాలు భక్తులు ఘనంగా నిర్వహించడం జరిగింది. భక్తులు ఉసిరి చెట్టు కింద కార్తిక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో దీపారాధనలు చేశారు. ప్రతి కార్తీక సోమవారం శ్రీ స్వామివారికి మరియు అనుబంధ పరివార దేవతలకు ప్రత్యేక అర్చనలు, అభిషేకాలు, లింగార్చనలు ఆలయ అర్చకులు మరియు వేద పండితులచే వైదికంగా నిర్వహించబడునని ఆలయ అధికారులు తెలిపారు. భక్తుల రద్దీతో రాజరాజేశ్వర స్వామి ఆలయం మరియు భీమేశ్వర స్వామి ఆలయాలు పరిసర ప్రాంతాలలో సందడి నెలకొంది. రాజరాజేశ్వర స్వామి ఆలయంలో అభివృద్ధి పనులు జరుగుతున్న నేపథ్యంలో భక్తుల రద్దీ దృష్ట్యా ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఆలయ అధికారులు, ఎస్పీఎఫ్ సిబ్బంది పర్యవేక్షించారు. రాజన్న ఆలయంలో క్యూలైన్లు, ఆలయం పై కప్పులను, స్వామివారి నివేదన భవనాన్ని కూల్చి వేయడం జరిగింది. రాజన్న ఆలయంలో కూల్చివేతలు, అభివృద్ధి పనులు నిర్విఘ్నంగా కొనసాగుతుండడం పట్ల భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.

## పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తుల అరెస్ట్. నగదు స్వాధీనం, వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులు రామ్ రెడ్డి, రవీందర్, శ్రీనివాస్ మరియు దేవయ్య లను అదుపులోకి తీసుకున్నట్లు వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు.

హనుమాజీపేట గ్రామ శివారులో పేకాట ఆడుతున్న సమాచారం మేరకు నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 40,210/బరూపాయలు మరియు ప్లే కార్డ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని తెలిపారు.

## దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు.

### ప్రభుత్వ విప్ ఆదేశాల మేరకు మారుపాకలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం. చివరి గింజ వరకు ధాన్యం కొంటాం. వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొడ్డి రాజు,



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** సోమవారం రోజున వేములవాడ అర్బన్ మండలం మారుపాక గ్రామంలో ఐకెపి సంబంధించిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొడ్డి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాకేష్ డైరెక్టర్లు ప్రారంభించారు.

ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఆయన అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకంగా కొనుగోలు జరపాలని రైతులను ఎవరైనా ఇబ్బంది పెడితే వెంటనే సమాచారం ఇవ్వాలని, ఎవరైనా అవినీతికి పాల్పడితే సహించలేదు అని ఆయన అన్నారు. దళారులను నమ్మి రైతులు మోసపోవద్దని ఆయన సూచించారు. వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఆదేశాలతో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించినట్లు ఆయన వెల్లడించారు. చివరి గింజ వరకు ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తుందని ఎవరు కూడా ఆందోళన చెందవలసిన అవసరం లేదని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏకకాలంలో రైతులకు రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకి దక్కుతుందని అన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీకి అండగా ఉండి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను స్థానిక సంస్థల ఎన్నికలలో గెలిపించవలసిందిగా ప్రతి ఒక్కరిని అభ్యర్థించడం జరిగింది.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కనికరపు రాకేష్, వేములవాడ అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య, వేములవాడ వేసా మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కత్తి కనకయ్య, దైత కుమార్, విద్యాసాగర్, మాజీ సర్పంచ్ ముడిగే చంద్రశేఖర్ యాదవ్, గ్రామ శాఖ అధ్యక్షులు ముడిగే నరేష్, నాయకులు ఎర్రం రాజు, గుగ్గిళ్ళ సత్తయ్య, పండుగ ప్రదీప్, రాములు చంద్రయ్య, మధు, దేవరాజ్, ముదాం శ్రీనివాస్, బోనాల రమేష్, దుబ్బల మల్లేశం, తాడం శ్రీను, బొమ్మ తిరుపతి, మరియు మహిళా సంఘం నాయకులు, రైతులు, గ్రామ ప్రజలు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## స్తంభంపల్లి బ్రిడ్జి నిర్మాణంలో పూర్తిగా విఫలమైన అధికార పార్టీ. వెంటనే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయాలి సిపిఎం డిమాండ్.



**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం మరియు బోయినపల్లి మండలం స్తంభంపల్లి వద్ద బ్రిడ్జి నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం మీనా వేషాలు లెక్కిస్తూ గత రెండు సంవత్సరాల నుంచి కాలయాపన చేస్తూ ఈ ప్రాంత ప్రజానీకాన్ని, ప్రయాణికుల్ని తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తుంది. ప్రభుత్వంలో ఉన్న వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, మరియు చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అధికార పార్టీ ఎమ్మెల్యేలు ఇద్దరు ఉన్నప్పటికీ నేటి వరకు కూడా బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడం వల్ల ప్రజలు మరియు ప్రయాణికులు తీవ్ర అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం మేలుకొని బ్రిడ్జి నిర్మాణాన్ని పూర్తి చేయాలని, వేములవాడ మరియు బోయినపల్లి ప్రజానీకం పక్షాన, ప్రయాణికుల పక్షాన ప్రభుత్వాన్ని పత్రిక ముఖంగా మండల సిపిఎం పార్టీ పక్షాన గురజాల శ్రీధర్ డిమాండ్ చేయడం జరిగింది. త్వరలో బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయలేని ఎడల రెండు మండలాల పరిధిలో తీవ్ర ఆందోళనలు నిర్వహిస్తామని ఆయన ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు రామంచా అశోక్, పులి బాబాయ్ తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



**సనత్ నగర్ ( ప్రజాబలం ప్రతినిధి నరేష్)** అక్టోబర్ 27 ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కోరారు. సనత్ నగర్ లోని అల్లా ఉద్దిన్ కోటి లో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ సూచన మేరకు ఆమ్ స్టర్ ప్రైమ్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య పరీక్ష శిబిరాన్ని సోమవారం ఏర్పాటు చేయగా, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హాజరై ప్రారంభించారు. ఈ శిబిరంలో ఆయన కంటి పరీక్షలు చేయించుకున్నారు.



పేద ప్రజలు అధికంగా నివసించే ప్రాంతాలలో నిర్వహించే వైద్య శిభిరాలతో పేదలకు ఎంతో మేలు జరుగుతుందని చెప్పారు. బస్తీలోని ప్రజలు సద్వినియోగం చేసుకునే విధంగా చొరవ తీసుకోవాలని బస్తీ నాయకులకు ఆయన సూచించారు. శిబిరానికి వచ్చిన వైద్యులు, సిబ్బందికి కొలన్ బాల్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో సనత్ నగర్ డివిజన్ బిఆర్ఎస్ అధ్యక్షుడు కొలన్ బాల్ రెడ్డి, నాయకులు ఖలీల్, శేఖర్, పురుషోత్తం, బస్తీ నాయకులు కరీం లాలా, ఫాజిల్, వైద్యులు శిరీష, లలిత్, సమీరా తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలి



**సనత్ నగర్ (ప్రజాబలం ప్రతినిధి )అక్టోబర్ 27** ఎన్నికల సమయంలో ఆటో డ్రైవర్లకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. సోమవారం బన్సీలాల్ పేట డివిజన్ లోని జబ్బార్ కాంప్లెక్స్ వద్ద ఆయన ఆటో నడిపి ఆటో డ్రైవర్ల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ చేతగాని హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని అధికారంలోకి వచ్చిన తర్వాత ఆటో డ్రైవర్ల ను మోసం చేసిందని ధ్వజమెత్తారు. రాష్ట్రంలో లక్షలాది మంది ఆటోలు నడుపుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారని పేర్కొన్నారు.



కాంగ్రెస్ ప్రభుత్వం ఆటో డ్రైవర్లకు సంవత్సరానికి 12 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చి రెండేళ్లు అవుతున్నా నేటి వరకు ఇవ్వలేదని అన్నారు. రెండు సంవత్సరాలకు సంబంధించి 24 వేల రూపాయలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వేధింపుల వలన 161 మంది ఆటో డ్రైవర్లు మరణించారని ఆవేదన వ్యక్తం చేశారు. రోజు వారి ఆదాయం తగ్గి కుటుంబాలను పోషించే పరిస్థితి లేక ఇబ్బందుల్లో ఉండగా, ఇష్టానుసారంగా జరిమానాలను విధిస్తూ ఆటో డ్రైవర్లను ప్రభుత్వం వేధిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వంలో, కేసిఆర్ నాయకత్వంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నారని గుర్తు చేశారు. ఎలాగైనా అధికారంలోకి రావాలనే దురాలోచనతో కాంగ్రెస్ పార్టీ మహిళలకు 2500 ఆర్థిక సహాయం, పెన్షన్ ను 4 వేల రూపాయలకు పెంచుతామని అనేక హామీలు మేనిఫెస్టో లో పెట్టి అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ధ్వజమెత్తారు. ఇచ్చిన హామీలను అమలు చేయని కాంగ్రెస్ పార్టీకి ఆటో డ్రైవర్ల కుటుంబాల ఉసురు తగులుతుంది అని హెచ్చరించారు. ఆటో డ్రైవర్ల సమస్యలపై లక్ష ఆటోలతో ప్రదర్శన చేయనున్నట్లు తెలిపారు. బి ఆర్ ఎస్ పార్టీ ఆటో డ్రైవర్ల కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కుర్మ హేమలత, పద్మారావు నగర్ బిఆర్ఎస్ ఇంచార్జీ గుర్రం పవన్ కుమార్ గౌడ్, బన్సీలాల్ పేట డివిజన్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు ప్రేమ్, లక్ష్మీపతి, సురేష్, కుమార్ యాదవ్, అబ్బాస్, ఆటో యూనియన్ అధ్యక్షుడు విజయ్, సాయి తదితరులు ఉన్నారు.

# ఓ.వై.సి జూబ్లిహిల్స్ లో మీ ఎత్తుగడలు చెల్లవు







**రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజాబలం ప్రతినిధి 27 అక్టోబరు 2025**ఓ.వై.సి జూబ్లిహిల్స్ లో మీ ఎత్తుగడలు, మోసాలు ఇక చెల్లవంటే చెల్లవు అని అంటున్న షేక్‌పేట స్థానిక ముస్లీం యువత. ఏ ఎండకు ఆ గొడుగు పడుతున్న ఏ.ఐ.ఎం.ఐ.ఎం పార్టీని వీడి బీ.ఆర్.ఎస్ పార్టీని అక్కున చేర్చుకుంటున్న స్థానిక మైనారిటీ మహిళలు, యువ నాయకులు. బస్తీ ప్రజలు గోపీనాథ్ ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు చేసిన అభివృద్ధిని నెమరు వేసుకుంటూ "ఆపద వస్తే నేనున్న" అని చెప్పిన గోపీనాథ్ కుటుంబం ఇప్పుడు కష్టాల్లో ఉన్నందున ఆయన కుటుంబానికి ప్రస్తుతం మేము అండగా ఉంటామని స్థానిక ప్రజలు ముక్తకంఠంతో నమ్మ పలుకుతున్నారు. సోమవారం రోజున మణికొండ బి.ఆర్.ఎస్ పార్టీ అధ్యక్షుడు సీతారాం ధూళిపాళ ఆధ్వర్యంలో ప్రచార కార్యక్రమం చేపట్టిన స్థానికులతో పాటు మణికొండ, ముషీరాబాద్ నాయకులు పాల్గొన్నారు. అందులో భాగంగా బూత్ 24 లో స్థానికులు జీషాన్, సన్నీ, రమేష్, సంపత్, రూపా, బిందు, అనుషా, అంజలి, శ్రీకాంత్, టోనీ, కామర్, ఆనంద్, బూత్ 25 లో స్థానిక నాయకులు రవికుమార్, అశోక్, ఎండి ఫయాజ్, డాన్ శీను, దస్తగిరి, ముషీరాబాద్ నాయకులు ఎస్టీ ప్రేమ్, బి.కిరణ్ కుమార్.

మణికొండ జనరల్ సెక్రటరీ గుట్టమీద నరేందర్, సీనియర్ నాయకులు షేక్ అరీఫ్, యాలాల కిరణ్, ఎం.బాబురావు, ఎం.సుమన్. బూత్ 26 లో స్థానికులు వాసవి, స్వప్న, పుష్ప, అంకమ్మ, రాధిక,సీనియర్ నాయకులు ప్రభు, ఆరీఫ్ మహమ్మద్, సుమనలిని, మహేందర్, చెరుకూరి బాలాజీ, రేఖ, బూత్ 29 లో స్థానికులు వెంకటేష్, రాములు, కృష్ణ, యాదగిరి, ప్రభాకర్. సీనియర్ నాయకులు వెంకటేష్, శకీలా రెడ్డి, కుంబగళ్ళ ధనరాజ్, అందె లక్ష్మణ్ రావు, గోరుకంటి విఠల్, బూత్ 30 లో స్థానికులు అశోక్ కుమార్, మల్లేష్, బి.రాజు, యాదవ్ రావు, ఎం.వెంకటయ్య, సీనియర్ నాయకులు శ్రీకాంత్ ఏర్పుల, నవీన్ ఆలశ్యం, ఎస్. మూర్తి, ఎస్.యాదగిరి తది తరులు పాల్గొన్నారు.

# రైతులకు సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు పంపిణీకి దరఖాస్తుల స్వీకరణ ఏడిఏ రమాదేవి



**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా:** ఆందోల్ అసెంబ్లీ నియోజకవర్గం కేంద్రమైన, జోగిపేటలోని వ్యవసాయ కార్యాలయంలో, రైతులకు స్థానిక సహాయ వ్యవసాయ సంచారకులు జి,రమాదేవి, సబ్సిడీపై వ్యవసాయ పరికరాలు, పంపిణీకి ఆందోల్, పుల్కల్, చౌటకూర్, హత్నూర, మండలాల రైతులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు, ఈ పరికరాలు అవసరమైన రైతులు, వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని, ఎస్సీ, ఎస్టీ, మహిళా రైతులకు, 50% సబ్సిడీ, ఇతర రైతులకు 40% సబ్సిడీ పై పరికరాలు అందిస్తామన్నారు, బ్యాటరీ స్ప్రేయర్ లు, పవర్ స్ప్రేయర్లు, రోటవేటర్లు, సీడ్ కం ఫర్టిలైజర్ డ్రిల్లు, కేజీవిల్, పవర్ విడర్లు, బ్రష్ కట్లు, పవర్ టిల్లర్లు, పరికరాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు, అవసరమైన రైతులు దరఖాస్తు ఫారం, ఆధార్ కార్డు, పట్టాదార్ పాస్ పుస్తకం, ట్రాక్టర్ పరికరాలకు, ఆర్సి జిరాక్స్, రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, సాయిల్ హెల్త్ కార్డు తప్పనిసరిగా జతపరిచి, ఆందోల్,పుల్కల్, చౌటకూర్, హత్నూర, మండలాలకు సంబంధించిన, క్లస్టర్ ఏఈఓ లకు, దరఖాస్తులు చేసుకోవాలని, ఏడిఏ రమాదేవి,తెలిపారు...

# ఆందోల్ నియోజకవర్గం లో పడకేసిన పారిశుధ్యం మేము ఏమీ చేయలేమని చేతులెత్తేసిన పంచాయతీ కార్యదర్శులు




**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజాబలం )సంగారెడ్డి జిల్లా:** నియోజకవర్గంలోని పలు మండల గ్రామాలలో పారిశుద్ధ్యం కరువై, దోమల స్వైర విహారంతో విష జ్వరాల పాలవుతున్న గ్రామీణ ప్రజలు, నియోజకవర్గంలోని పుల్కల్ మండల పరిధిలో గల పోచారం,గ్రామంలో ఏరులై పారుతున్న మురుగునీరు, మోరీలు తీయక, కంపు కొడుతున్న, పట్టించుకోని సంబంధిత అధికారులు, గ్రామంలో చెత్త బండి రాక, ఎక్కడ వేసిన చెత్త అక్కడే ఉండిపోవడంతో, వాటి నుంచి వచ్చే దుర్వాసనతో, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, ఇక గ్రామాల్లోని మురికి కాలువలు నిండి, దోమలు స్వైర విహారం చేస్తున్నాయి, వీటి వలన ప్రజలు విష జ్వరాల పాలవుతున్నారు, గ్రామాలలో ఇంత జరుగుతున్నా, అధికారుల్లో మాత్రం ఏమాత్రం చలనం లేకపోవడం, ఎంతవరకు సమంజసం అని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు, ఈ పారిశుద్ధం పట్ల గ్రామ పంచాయితీ కార్యదర్శిలకు, పలుమార్లు విన్నవించిన, మా వద్ద డబ్బులు లేవంటూ మేము ఏమీ చేయలేమని,చేతులెత్తేస్తున్నారు , కొంతమంది కార్యదర్శులు అయితే, మీరు ఎవరికైనా చెప్పుకోండి, చాలా అప్పులు చేసి గ్రామాలలో కొంత మేరకు పనులు చేశాం కానీ ఇప్పటివరకు, బిల్లులు నేటికి రాకపోవడంతో, తామే అప్పుల పాలయ్యామని, ఆయా గ్రామాల కార్యదర్శులు అంటున్నారు, ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి, గ్రామాలలో నెలకొన్న పారిశుధ్యం పనులను, వేగవంతం చేసి సామాన్యుల ప్రాణాలను కాపాడాలని, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు..

# ఎల్ఈడి టీవి ని అందజేసిన నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యడవల్లి సైదులు



**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజాబలం)** ఖమ్మం నేర నియంత్రానికి సీసీ కెమెరాలు ఎంత తోడ్పాటున అందిస్తాయని రూరల్ ఏసిపి తిరుపతిరెడ్డి అన్నారు పైనంపల్లి గ్రామానికి చెందిన నేలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు యడవల్లి సైదులు 15వేల రూపాయలు విలువచేసే ఎల్ఈడి టీవీ ను అందజేశారు నేర నియంత్రణకు సీసీ కెమెరాలు ఎంత తోడ్పాటున అందిస్తాయని సీసీ కెమెరాలు గ్రామ ప్రజలు సహకరించాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో కూసుమంచి సిఐ సంజీవ్ ముదిగొండ సీఐ మురళి ఎస్ఐ సంతోష్ ఏఎస్ఐ నేలకొండపల్లి మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు యడవల్లి నాగరాజు మారగాని అంజయ్య, యడవల్లి సైదులు మారగాని గోవర్ధన్ మారగాని సైదులు మారగాని ధనమూర్తి కలకుంట్ల వీరన్న మారగాని మహేష్ తదితరులు పాల్గొన్నారు

# వైన్స్ షాప్ టెండర్ల డ్రా




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 27:**మేడ్చల్ ఎక్సైజ్ యూనిట్ పరిధిలోని 118 వైన్స్ షాప్ టెండర్ లకు గాను ఈరోజు మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా కలెక్టర్ శ్రీ మిక్కిలినేని మను చౌదరి ఆధ్వర్యంలో డ్రా తీయడం జరిగింది, మరియు మల్కాజ్ గిరి యూనిట్ పరిధిలోని 88 వైన్స్ షాప్ లకు గాను మేడ్చల్ మల్కాజ్ గిరి అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా ఆధ్వర్యంలో డ్రా తీయడం జరిగింది.ఇట్టి కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ మరియు అసిస్టెంట్ కమీషనర్ మేడ్చల్ ఎక్సైజ్ సూపరింటెండెంట్, మల్కాజ్ గిరి ఎక్సైజ్ సూపరింటెండెంట్ మరియు ఇతర ఎక్సైజ్ అధికారులు సిబ్బంది ఇట్టి కార్యక్రమాన్ని విజయవంతగా పూర్తి చేయడం చేశారు.



# విద్యార్థుల కోసం రామగుండం కమీషనరేట్ పోలీస్ ఓపెన్ హౌస్

## పోలీసు విధులపై ప్రత్యక్ష అవగాహన

## విద్యార్థుల ను ఆకట్టుకున్న డాగ్ స్క్వాడ్ ప్రదర్శన

## సైబర్ నేరాల బారిన పడకుండా జాగ్రత్త ఉండాలి








**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి అక్టోబర్ 27 :** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం(ఫ్లాగ్ డే) కార్యక్రమాల్లో భాగంగా ఈరోజు రామగుండం పోలీస్ కమీషనరేట్ హెడ్ క్వార్టర్స్ లో పోలీస్ కమిషనర్ శ్రీ అంబర్ కిషోర్ ఝా ఐపిఎస్.ముఖ్య అతిథిగా పాల్గొని ఓపెన్ హౌస్ కార్యక్రమం ప్రారంభించారు.విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంచేందుకు గోదావరిఖని పట్టణంలో ని వివిధ కళాశాల, పాఠశాలల విద్యార్థినీ విద్యార్థులు దాదాపు 1000 మంది ఓపెన్ హౌస్ కార్యక్రమంలో పాల్గొన్నారు.విద్యార్థినీ విద్యార్థులకు ప్రజా రక్షణ,భద్రత సంబందించిన పోలీసు చట్టాల గురించి, పోలీసు విధులపై,షీ టీమ్స్,భరోసా సెంటర్స్ గురించి,కమ్యూనికేషన్ సిస్టం గురించి ఫింగర్ ప్రింట్ డివైస్ ల వల్ల కలిగే ఉపయోగాల గురించి,బీడీ టీమ్ ఎక్విప్మెంట్,డాగ్ స్క్వాడ్,ట్రాఫిక్ ఎక్విప్మెంట్,రోడ్డు ప్రమాదాలు స్పీడ్ లేజర్ గన్,ట్రాఫిక్ రూల్స్, ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు నిబంధనల గురించి మరియు సైబర్ నేరాల గురించి పోలీసులు ఉపయోగిస్తున్న సాంకేతికత గురించి, షీటీమ్,భరోసా, గంజాయి ఇతర మత్తు పదార్థాలకు సంబంధించిన కిట్, తదితర స్టాల్స్ ఏర్పాటు చేసి సంబంధిత అధికారులు సిబ్బంది విద్యార్థులకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... పోలీస్ అమరవీరుల త్యాగాల సంస్మరణ వారోత్సవాల లో భాగంగా రామగుండం పోలీస్ కమిషనర్లు పలు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని దానిలో భాగంగా ఈరోజు కమిషనరేట్ హెడ్ క్వార్టర్ లో ఓపెన్ హౌస్ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని,పోలీసులు కేవలం నేరస్థులను పట్టుకోవడానికే కాదు, సమాజంలో శాంతి భద్రతలు,చట్టపరమైన అవగాహన పెంపు కోసం నిరంతరం కృషి చేస్తున్నారు.దానిలో భాగంగా ప్రతి విద్యార్థి పోలీస్ వ్యవస్థ ఎలా పనిచేస్తుందో,సమాజంలో భద్రత ఎలా సాధ్యమవుతుందో తెలుసుకోవాలని సూచించారు.దీనిలో విద్యార్థిని విద్యార్థులకు ప్రజల రక్షణ,భద్రత, మహిళ భద్రత, నేరాల నియంత్రణ నేరస్థుల పట్టుకోవడం కోసం పోలీసులు చేస్తున్న విధుల గురించి అవగాహనా కల్పించడం జరిగింది. అదేవిదంగా ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలు ట్రాఫిక్ నిబంధనలు పాటించి రోడ్డు ప్రమాదాలను అరికట్టాలని సైబర్ నేరాల వలలో పడకుండా తీసుకోవలసిన జాగ్రత్త చర్యల గురించి విద్యార్థినీ విద్యార్థులకు వివరించారు. సైబర్ నేరాలు సైబర్ మోసాలు ఎలా జరుగుతున్నాయో,

సైబర్ నేరం జరగగానే 1930 టోల్ ఫ్రీ నెంబర్ ల గురించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది అన్నారు. పోలీసు చట్టాలు పోలీసులు ప్రజలకు అందిస్తున్న సేవలు గురించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది.ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా రాంగ్ రూట్లో వస్తే ఎలా ప్రమాదాలు జరుగుతున్నాయి హెల్మెట్ పెట్టుకోకపోతే ఎలా ప్రమాదాలు జరుగుతున్నాయి. తదితర అంశాల గురించి విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కల్పించడం జరిగింది. మరియు బాలికలు మహిళల రక్షణకు ఏర్పాటుచేసిన భరోసా కేంద్రం యొక్క సేవల గురించి షీ టీమ్స్ పని తీరు, ఉండే వివిధ యాప్ ల గురించి అవగాహన కల్పించడం జరిగింది.గంజాయి డ్రగ్స్ ఇతర మత్తు పదార్థాల గురించి, డయల్ 100,గురించి కూడా అవగాహన కల్పించడం జరిగింది అన్నారు.స్నిఫర్ డాగ్స్ తమ ప్రతిభతో ఆకట్టుకోగా, విద్యార్థులు ఆసక్తిగా వీక్షించారు. విద్యార్థుల్లో చట్టపరమైన అవగాహన పెంపు, పోలీస్ వ్యవస్థపై సానుకూల దృక్పథం కలిగించే లక్ష్యంతో కమీషనరేట్ పోలీస్ చేపట్టిన ఈ ఓపెన్ హౌస్ విద్యార్థులను ఉత్సాహపరిచింది.

ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ శ్రీనివాస్,ట్రాఫిక్ ఎసిపి శ్రీనివాస్,ఆర్ ఏ సి పి ప్రతాప్,సైబర్ క్రైమ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,గోదావరిఖని 1 టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్ర సేనా రెడ్డి, రామగుండము సి ఐ ప్రవీణ్ కుమార్ , కమ్యూనికేషన్ ఇన్స్పెక్టర్ రాం ప్రసాద్, ఐటి కోర్ ఇన్స్పెక్టర్ చంద్ర శేఖర్ గౌడ్ , ఫింగర్ ప్రింట్ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్,ఆర్ ఐ లు దామోదర్ శ్రీనివాస్, వామన మూర్తి, శేఖర్, మల్లేశం,సంపత్,షీ టీమ్స్ ఎస్సై లు , రామగుండం పోలీస్ కమీషనరేట్ పోలీస్ అధికారుల సంఘం అధ్యక్షులు పోచలింగం, ఆర్ ఎస్ ఐ లు మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# అకుంఠిత దీక్షకు ప్రతిఫలం: గ్రూప్-1 పరీక్షల్లో డీఎస్పీగా పటేరి కిషన్ విజయం



**(27 అక్టోబర్ వరంగల్ ప్రజాబలం ప్రతినిధి)** వరంగల్ నగరానికి చెందిన యువకుడు పటేరి కిషన్ వంజరి ఇటీవల విడుదలైన గ్రూప్ 1 పరీక్షా ఫలితాలలో అత్యున్నతమైన 'డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్' (డీఎస్పి) పదవిని కైవసం చేసుకుని సంచలనం సృష్టించారు. తన అకుంఠిత దీక్ష, అంకితభావంతో కిషన్ సాధించిన ఈ అద్భుత విజయం, వంజరి సమాజానికి, ప్రత్యేకించి వరంగల్ ప్రాంతానికి గర్వకారణంగా నిలిచింది. వరంగల్ నగరంలో ప్రముఖులుగా గుర్తింపు పొందిన పటేల్ రాములు వంజరి గారి పెద్ద కుమారుడు పటేరి రాజు గారి పుత్రుడే కిషన్. కిషన్ విజయాన్ని ఆయన తల్లిదండ్రులు పటేరి రాజు, సునీత వంజరి గార్లు ఆనందంతో ఉప్పొంగిపోయి, తమ కుమారుడిని




మనస్ఫూర్తిగా అభినందించారు.పటేరి కిషన్ వంజరి సాధించిన ఈ అరుదైన విజయం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, పలువురు ప్రముఖులు డీఎస్పీ పటేరి కిషన్ వంజరి గారిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. పోలీస్ శాఖకు చెందిన కాలేరు రవి, ఎనుమాముల మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ కాలేరు కరంచంద్, మల్లకపెల్లి మాజీ సర్పంచ్ రమేష్, రవీందర్, రాజు, ప్రసాద్ తదితరులు కిషన్ గారిని శాలువాతో సత్కరించి గౌరవించారు.

పటేరి కిషన్ వంజరి ఆలేరు గ్రామ మాజీ సర్పంచ్ కీ.శే. శ్రీనివాస్ గారి మేనల్లుడు కావడం విశేషం. కిషన్ కృషి, పట్టుదల గురించి ఈ సందర్భంగా పలువురు కొనియాడారు. ఈ విజయం వంజరి యువతకు స్ఫూర్తిదాయకమని, ఉన్నత లక్ష్యాలను చేరుకోవడంలో మరింత మంది యువకులు ఈ గొప్ప విజయం ద్వారా ప్రేరణ పొందుతారని ప్రముఖులు ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ వంజరి సేవ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి వాలేరు రామక్రిష్ణ వంజరి కూడా కిషన్ గారికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. పటేరి కిషన్ వంజరి డీఎస్పీగా రాణించి, మరింత మంది యువతకు ఆదర్శంగా నిలవాలని వరంగల్ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.

# రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ రఘురాం రెడ్డి



**ఖమ్మం అక్టోబర్ 27 (ప్రజాబలం బ్యూరో)** ఖమ్మం నగరంలోని సువర్ణ యంత్ర సహిత శ్రీ పార్వతి సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వచనాలు పొందారు. కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల నరేంద్ర, నూతన శివాలయ నిర్మాణ కమిటీ బాధ్యులతో కలిసి ప్రాంగణంలో కలియ తిరిగి నిర్మాణ వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా నాయకులు కొప్పుల చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులో బాధితులకు న్యాయం చేయాలి

## ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 27:**ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులను పూర్తి నిబద్ధతతో బాధితులకు న్యాయం జరిగేలా సంబంధిత అధికారులు కృషి చేయాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అన్నారు.

సోమవారం మధ్యాహ్నం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ల్యాండ్ సర్వీస్ ప్రత్యేక నిధి మరియు అట్రాసిటీస్ పైన జరిగిన సమీక్ష సమావేశానికి డిసిపి కోటిరెడ్డి, అడిషనల్ కలెక్టర్ విజయేందర్ రెడ్డి, డిఆర్ఓ హరిప్రియ లతో కలిసి తెలంగాణ రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య హాజరైనారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ ఏసీపీ ల వద్ద ఇప్పటివరకు ఉన్న కేసుల వివరాలు వాటి పురోగతిని అడిగి, పెండింగ్ లో ఉన్న కేసులను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. జిల్లాలోని కొన్ని ముఖ్యమైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల వివరాలను అడిగి తెలుసుకుని, సంబంధిత శాఖల సమన్వయంతో తక్షణమే పరిష్కరించి బాధితులకు న్యాయం చేసే విధంగా అధికారులు చొరవ తీసుకోవాలని, అలాగే విచారణ దశ లో ఉన్న బాధితులకు నిబంధనల మేరకు నష్టపరిహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు.



బాధితులకు అందజేసే రెండు పడక గదుల ఇండ్ల కేటాయింపుల విషయంలో రాష్ట్రంలోనే మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అగ్రస్థానంలో నిలిచినందుకు హర్షం వ్యక్తం చేస్తూ, ఈ విషయంలో అధికారులు, పోలీసుల కృషి ప్రశంసనీయమని చైర్మన్ అన్నారు. అలాగే, తర్వాతి లబ్ధిదారుల వివరాలను త్వరగా రూపొందించాలని సూచించారు. "మానవసేవే మాధవసేవ", "సమాజమే దేవాలయం", "పేదవాడే దేవుడు" అని – "నేను" అని కాకుండా "మనం" అనే నినాదంతోనే వ్యవస్థలో ముందుకు పోగలమని, ఇందుకు అందరి కృషి, సహకారం అవసరమని తెలుపుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను పూర్తి నిబద్ధతతో తమ విధులు నిర్వర్తించాలని సంబంధిత అధికారులకు సూచించారు.

# సమాజ సేవకు ముందుకు వచ్చిన విశ్రాంత ఉపాధ్యాయులు



**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్27 (ప్రజాబలం)** గిరిజన సంక్షేమ శాఖలో సుదీర్ఘకాలం సేవలందించి పదవీ విరమణ చేసిన విశ్రాంత ఉపాధ్యాయులు సమాజ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించాలని నిర్ణయించారు. తరతరాల విద్యార్థుల జీవితాలను మలచి, విద్యారంగానికి తమ జీవితాన్ని అంకితం చేసిన ఈ ఉపాధ్యాయులు మరోసారి అందరి హృదయాలను తాకారు. బోధనతో పాటు విలువలు, క్రమశిక్షణ నేర్పిన గురువులు సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు పేర్కొన్నారు. సోమవారం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్లో ఆత్మీయ వాతావరణంలో జరిగిన ఈ సమావేశంలో విశ్రాంత ఉపాధ్యాయులు తమ బోధనా జీవితంలోని అనుభవాలను పంచుకుంటూ ఉపాధ్యాయ వృత్తి తమకు గౌరవం తృప్తి ఆనందాన్ని అందించిందని పేర్కొన్నారు విద్యారంగంలో మాత్రమే కాదు, గ్రామాభివృద్ధి, విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం సామాజిక సేవలలో కూడా తమ పాత్రను కొనసాగిస్తామని విశ్రాంత ఉపాధ్యాయులు హామీ ఇచ్చారు. సమాజంలో మార్పు విద్య ద్వారానే సాధ్యమని యువతలో విలువలపై అవగాహన పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని సంకల్పించారు ఈ కార్యక్రమానికి శ్రీరామ్ సింగ్ అధ్యక్షత వహించగా భీమ్ నాయక్ ముత్తయ్య వజ్జా శ్రీనివాసరావు పూర్ణచందర్ రావు, అంజయ్య తదితరులు నిర్వాహకులుగా వ్యవహరించారు చివరగా విశ్రాంత ఉపాధ్యాయులను ఘనంగా సన్మానిస్తూ స్మృతిచిహ్నాలు శుభాకాంక్షలు అందజేశారు. ఆత్మీయ వాతావరణంలో సాగిన ఈ కార్యక్రమం అందరికీ మరపురాని అనుభూతిని మిగిల్చింది. ఈ సందర్భంగా టీఎన్జీవో అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు తో పాటు పలువురు ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు

# ఆటోలో హరీష్ రావు ప్రయాణం

హైదరాబాద్ గోకుల్ థియేటర్ నుంచి తెలంగాణ భవన్ వరకు మాజీ మంత్రి హరీష్ రావు ఆటోలో ప్రయాణించారు. హరీష్ రావు వెంట కూకట్ పల్లి ఎమ్మెల్యే కృష్ణా రావు ఉన్నారు. ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ ఆటో డ్రైవర్లకు ఇచ్చిన ఒక హామీ కూడా అమలు చేయకుండా మోసం చేసింది అని ఆటో డ్రైవర్ల ఆవేదన. ఇంటి కిరాయి లు కట్టలేక, పిల్లల స్కూల్ ఫీజులు కట్టలేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నామని ఒక

# కమిషన్ల కోసం పనిచేసే మంత్రులను భర్తరఫ్ చేయాలి

**కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని గెలిచివస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారు**

**3 నెలల్లో ప్రభుత్వం కూలిపోవడం ఖాయం**

**ఆర్.ఎల్.డి పార్టీ ఆధ్వర్యంలో యువతకు ఉద్యోగ అవకాశాలు**

**యువత రాజకీయాల్లోకి రావాలి తెలంగాణను ఏలుకోవాలి**

**తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్**

**కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర ఖమ్మం చేరుకుంది**




**ఖమ్మం ప్రతినిధి అక్టోబర్ 27 (ప్రజాబలం)** తెలంగాణ రాష్ట్రంలో కమిషన్ల కోసమే పనిచేసే మంత్రులను బర్తరఫ్ చేయాలని తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్ కుమార్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని కోరుతూ తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన రథయాత్ర సోమవారం ఖమ్మం చేరుకుంది. ఈ సందర్భంగా ఖమ్మం ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ అధ్యక్షులు కపిలవాయి దిలీప్ కుమార్ మాట్లాడుతూ... తెలంగాణ రాష్ట్రం కోసం పనిచేయని వారు నేడు మంత్రులుగా కమీషన్ల కోసమే పని చేస్తున్నారని వారిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించాలన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారానికై 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగ ఖాళీలను తక్షణమే భర్తీ చేయాలన్నారు. ప్రైవేటు పరిశ్రమల్లో స్థానికులకు 95శాతం ఉద్యోగాలు కల్పించేలా చట్టం చేయాలన్నారు. విద్యాహక్కు చట్టం ప్రకారం ప్రైవేటు విద్యాసంస్థల్లో 25శాతం పేద విద్యార్థులకు ఉచిత విద్యను అందించాలన్నారు. రాజీవ్ యువవికాసం పేరిట 5 లక్షల మంది నిరుద్యోగులకు వ్యక్తిగత రుణాలు ఇస్తామని చెప్పిన వాగ్దానాన్ని తక్షణమే అమలు చేయాలన్నారు. అంబేద్కర్ అభయహస్తం పేరిట దళితులకు 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలకు తులం బంగారం, గృహలక్ష్మీ పథకం క్రింద రూ. 2500లు చెల్లించాలన్నారు. అదేవిధంగా విద్యార్థులకు స్కూటీలు, ఫీజు రియంబర్స్మెంట్, స్కాలర్షిప్ బకాయిలు, ఆరోగ్యశ్రీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి కాంగ్రెస్ లో గెలిచి వస్తే మంత్రి పదవి ఇస్తానని మోసం చేశారని, మూడు నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోబోతుందని జోష్యం చెప్పారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన రథయాత్ర ఖమ్మం చేరుకుందని, మిగతా జిల్లాల్లో కూడా ఈ యాత్ర కొనసాగుతుందని తెలియజేశారు. పార్టీ ఆధ్వర్యంలో నిరుద్యోగులకు జాబ్ మేళ నిర్వహిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నామని తెలియజేశారు. ఈ విలేకరుల సమావేశంలో తెలంగాణ రాష్ట్రీయ లోక్ దళ్ పార్టీ అధికార ప్రతినిధి గౌర బీరప్ప, రాష్ట్ర ఉపాధ్యక్షులు మోత్కూరి వెంకటాచారి, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ గంట్యాల నరసింహారావు, కార్యదర్శి నూనె భాస్కరరావు, ఖమ్మం జిల్లా అధ్యక్షులు ఎస్.కె జానీ మొహమ్మద్ తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి అర్జీలను త్వరగా పరిష్కరించాలి

## మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి



**మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ప్రతినిధి ప్రజాబలం అక్టోబర్ 27:**ప్రజావాణిలో స్వీకరించిన ధరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేస్తూ జాప్యం లేకుండా సత్వరమే అర్జీలను పరిశీలించి పరిష్కరించాలని మేడ్చల్ మల్కాజిగిరి అదనపు జిల్లా కలెక్టరు విజయేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి డిఆర్ఓ హరిప్రియలతో కలిసి అదనపు కలెక్టర్లు, (138) దరఖాస్తులు స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టరు మాట్లాడుతూ ఎంతో వ్యయ, ప్రయాసలకోర్చుకొని వారి సమస్యలను పరిష్కరిస్తామనే నమ్మకంతో ప్రజలు మన వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత మనందరి పైన ఉన్నదని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని దరఖాస్తుల పరిశీలనలో ఏలాంటి జాప్యం లేకుండా చూడాలని అదనపు కలెక్టరు అన్నారు. అదేవిధంగా



తిరస్కరించే దరఖాస్తుల గురించి తిరస్కరణకు గల కారణాలను తప్పనిసరిగా వివరంగా అర్జీదారులకు తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్ లైన్ లో వెంట వెంట నమోదు చేయాలని సంబంధిత అధికారులకు అదనపు కలెక్టరు సూచించారు. ఈ కార్యక్రమంలో లా ఆఫీసర్ చంద్రావతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కష్టాల్లో ఉన్న రైతన్నను ప్రభుత్వం ఆదుకోవాలి నాయబ్, గౌడ్



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 27( ప్రజాబలం) వికారాబాద్ జిల్లా:** మర్పల్లి, భూమి సేద్యం చేసి విత్తనాలు నాటి కల కలలాడుతూ పెరిగే పంటలు భారీ వర్షాల కారణంగా తెల్ల బంగారం పొలంలో కనబడలేక రైతు కన్నీరు మున్నీరు పెట్టి ఆవేదనలో ఉన్నారని మర్పల్లి మండలమాజీరైతు సమన్వయ అధ్యక్షులు నాయబ్ గౌడ్ ఆవేదన వ్యక్తపరిచారు, భారీ వర్షాలు కురవడం వల్ల కంది మక్కా పత్తి జొన్న మినుములు పంటలు నష్టపోయార ని రైతు గోషా చెప్పరేనంత బాధలో ఉన్నార ని రైతు బాధను ఆవేదనను ప్రభుత్వం మరియు అధికారులు స్పందించి రైతన్నకు న్యాయం జరిగేలా పంటకు పరిహారంగా ప్రభుత్వం ప్రజలకు సహాయం చేయాలని ఆవేదన వ్యక్తపరిచారు కొద్ది గొప్ప పండిన పంటలకు గిట్టుబాటు ధర లేక ధాన్యం సరిగా పండక రైతు బాధలో ఉన్నారని పండిన పంటకు గిట్టుబాటు ధర ప్రభుత్వం కల్పించాలని మర్పల్లి మండల మాజీ రైతు సమన్వయ అధ్యక్షులు నాయబ్, గౌడ్ ఆవేదన వ్యక్తపరిచారు

# మృతుని కుటుంబానికి మాజీ సర్పంచ్ నూరుద్దీన్ ఆర్థిక సాయం



**వికారాబాద్ నియోజకవర్గ ప్రతినిధి అక్టోబర్ 27( ప్రజాబలం ):** వికారాబాద్ జిల్లా:మర్పల్లి మండల పరిధిలోని జంషీద్ పూర్,గ్రామంలో మ్యాతరి అంతయ్య (90) సోమవారం ఉదయం ఆకస్మిక మృతి చెందన బాధిత కుటుంబంలో జరిగినఇట్టి విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ మహమ్మద్ నూరుద్దీన్ వారి కుటుంబాన్ని ఓదార్చి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు వారి అంత్యక్రియలకు లి5వేల రూపాయలు నగదు ఆర్థిక సాయం అందించారు వారి అంతక్రియల్లో మండల కాంగ్రెస్ పార్టీ మైనారిటీ సెల్ మండల అధ్యక్షులు మహమ్మద్ నసీరోద్దీన్ జంషీద్ పూర్ గ్రామ స్థానిక నాయకులు మాజీ ఉప సర్పంచ్ గొల్ల చంద్రయ్య గొల్ల ప్రభుపాస్టర్ ప్రవీణ కుమార్ రాజేష్, మనోహర్, గొల్ల సుభాష్,మ్యాతరి పద్మ రావు, మ్యాతరి నర్సింలు, బోయిని మల్లేశం, బోయిని నారాయణ, గొల్ల దత్తు, గొల్ల ప్రవీన్, గొల్ల కిష్టయ్య , గొల్ల నరేష్, మరియు వివిధ గ్రామాల నాయకులు గ్రామ ప్రజలు పాల్గొన్నారు...

## వేములవాడ రూరల్ పోలీస్ ల ఆధ్వర్యంలో హనుమాజీపేటలో సైకిల్ ర్యాలీ.

**పోలీస్ అమరవీరుల త్యాగాలను అందరూ స్మరించుకోవాలి, వేములవాడ రూరల్ ఎస్సై వెంకట్రాజం.**

**అమరుల త్యాగాలు వెలకట్టలేనివి, వేములవాడ రూరల్ సిఐ .శ్రీనివాస్.**





**వేములవాడ టౌన్, (ప్రజాబలం),** పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవం (ఫ్లాగ్ డే) కార్యక్రమంలో భాగంగా వేములవాడ రూరల్ పోలీస్ ల ఆధ్వర్యంలో వేములవాడ రూరల్ మండలం హనుమాజీపేట గ్రామంలో సైకిల్ ర్యాలీ నిర్వహించడం జరిగిందని రూరల్ ఎస్సై వెంకట్రాజం తెలిపారు. హనుమాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుండి ప్రారంభమై గ్రామం అంతా సైకిళ్ల పై ర్యాలీగా తిరుగుతూ మనకోసం అమరులైన పోలీసులకు నివాళిగా నినాదాలు చేయడం జరిగింది.

ఈ సందర్భంగా వేములవాడ రూరల్ సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు, ప్రజా రక్షణ కోసం విధి నిర్వహణలో అసువులు బాసిన పోలీసులను స్మరించుకోవడం మన బాధ్యత అని వారి త్యాగాలు వెలకట్టలేనివి అని సమాజం ఎప్పటికీ వారి త్యాగాలు మరువబోదు అని అన్నారు.

ఈ కార్యక్రమంలో హనుమాజీపేట గ్రామ ప్రజలు, విద్యార్థులు, మరియు వేములవాడ రూరల్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# పల్లె పల్లెకు ప్రణవ్ కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమస్యల పరిష్కారాణికి కృషి

**- గ్రామాల సమస్యలే ప్రధాన ఎజెండాగా సాగిన సమావేశాలు.**

**- సీనియారిటితో పాటు సిన్సియారిటీ కూడా ముఖ్యమే..**

**- కార్యకర్తలకు ప్రజల సమస్యలపై దిశా-నిర్దేశం చేసిన పీపుల్ లీడర్..**

**- కోవర్ట్ రాజకీయాలపై,గ్రూప్ రాజకీయలపై పూర్తి నివేదిక ఉంది.**

**- కార్యకర్తలకు అండగా ఉంటా..**

**- గెలుపే లక్ష్యంగా ప్రతీ కార్యకర్త పనిచేయాలి.**



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి** అక్టోబర్ 27గ్రామాల్లో సమస్యలపై ఎక్కడా రాజీపడవద్దని,సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్త శుద్ధిగా ఉందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ అన్నారు.సోమవారం రోజున పల్లె పల్లెకు ప్రణవ్ కార్యక్రమం ద్వారా ఇల్లందకుంట మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో సుడిగాలి పర్యటన చేశారు.పర్యటనలో భాగంగా మండల వ్యాప్తంగా 6,28,000/- విలువ చేసే 19 సీఎంఆర్ఎఫ్ చెక్కులను గ్రామాల్లోని లబ్ధిదారులకు అందజేశారు.చెక్కులు తీసుకున్న లబ్ధిదారులు త్వరితగతిన బ్యాంక్ లో డిపాజిట్ చేసుకోవాలి కోరారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కార్యకర్తలకు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై దిశా నిర్దేశం చేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు పూర్తి కావస్తుందని ఈ రెండేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందని,పదేళ్లనుండి ఎదురుచూసిన ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత సన్న బియ్యం, రుణమాఫీ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, ఆరోగ్య శ్రీ పథకం పెంపులాంటి పథకాలు ప్రజల్లో మంచి ఆదరణ వచ్చాయని,అలాగే నూతన రేషన్ కార్డులు,నంబర్ ఆడిషన్స్, మహిళలకు ఉచిత బస్ రవాణా సౌకర్యం లాంటివి కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని,ప్రతి ఇంటికి కాంగ్రెస్ ప్రభుత్వ సంక్షేమ పథకం అందిందని ఇది జనాల్లోకి బలంగా తీసుకువెళ్లాలని కోరారు. కోవర్ట్, గ్రూప్ రాజకీయాలకు తావు లేకుండా కష్టపడి పనిచేస్తే ఎంపీ, ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఏ విధంగా జిల్లాలో మొదటి స్థానంలో వచ్చామో రాబోయే స్థానిక పోరులో హుజురాబాద్ గడ్డపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల కృషితో కాంగ్రెస్ జెండా ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట కాంగ్రెస్ పార్టీ నాయకులు,గ్రామాల కాంగ్రెస్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

**రోడ్డు,ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించిన ప్రణవ్..**

ఇల్లందకుంట మండల పర్యటనలో భాగంగా హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పలు అభివృద్ధి పనులను పరిశీలించారు.పనులు ఎలా జరుగుతున్నాయి,ప్రభుత్వం నుండి పూర్తి సహకారం అందిస్తామని ఎలాంటి ఆలస్యం చేయకుండా సకాలంలో పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లను కోరారు.పలువురు వృద్ధులు ప్రణవ్ ను చూసి ఆయన్ను కలవడానికి ఉత్సాహం చూపెట్టారు.వారి తాత వొడితల రాజేశ్వర్ రావు తో ఉన్న అనుభవాలను ప్రణవ్ తో పంచుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇల్లందకుంట మండల నాయకులు పాల్గొన్నారు.

## యూసుఫ్ గూడా డివిజన్ లో భారీ మెజారిటీ వచ్చేలా చూడాలి

హైదరాబాద్ మినిస్టర్ క్వార్టర్స్ లో మంత్రి పొన్నం ప్రభాకర్ నేతృత్వంలో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ కి సంబంధించి కాంగ్రెస్ పార్టీ నేతల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఈర్లపల్లి శంకయ్య, కసిరెడ్డి నారాయణ రెడ్డి , బత్తుల లక్ష్మా రెడ్డి, జయవీర్ రెడ్డి , బెల్లయ్య నాయక్ ,శివసేన రెడ్డి , గిరిధర్ రెడ్డి,గుత్తా అమిత్ రెడ్డి,ఎగ్గే మల్లేశం ,లక్ష్మణ్ యాదవ్, ఝాన్సీ రెడ్డి , కుస్రు పాషా ,సంజయ్ గౌడ్ , డివిజన్ ప్రెసిడెంట్ ఫిరోజ్ ఖాన్, ఇతర ముఖ్య నేతలు పాల్గొన్నారు.ఉప ఎన్నికల్లో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ కు మద్దతుగా ప్రచారాన్ని మరింత వేగవంతం,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రోడ్ షో తో మరింత జోష్ నింపేలా కార్యాచరణ రూపోందించారు. మంత్రి మాట్లాడుతూ యూసుఫ్ గూడా డివిజన్ లోని ప్రతి కాలని లో డోర్ టూ డోర్ ప్రచారం చేస్తూ ప్రజా పాలన ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు వివరించాలని ,లోకల్ క్యాడర్ లో జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ గెలుస్తుంది అని మరింత ఉత్సాహం నింపాలి. ప్రతి 100 ఓట్లకు ఒక ఇంచార్జి ను ఏర్పాటు చేసుకొని పోలింగ్ రోజు ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకొని ఓటు వేసేలా చూడాలని అన్నారు.

# ప్రజల గుండెల్లో నిలిచిన నేత



# మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



ప్రజాబలం ప్రత్యేక కథనం

## నేడు రాష్ట్రవ్యాప్తంగా పొంగులేటి జన్మదిన వేడుకలు







**పొంగులేటి**

**శ్రీనివాసరెడ్డి నారాయణపురం గ్రామం**

**కల్లూరు మండలం ఖమ్మం జిల్లా తెలంగాణలో**

**జన్మించారు**

**అతను 2014 నుంచి 2019 దాకా ఖమ్మం ఎంపీగా పని చేశారు**

**2023 లో పాలేరు ఎమ్మెల్యేగా పోటీ చేసి గెలిచారు ప్రస్తుతం మంత్రిగా**

**కొనసాగుతున్నారు**

**తల్లిదండ్రుల పేరు రాఘవరెడ్డి స్వరాజ్యం**

**భార్య పేరు మాధురి**

**కుమారుడు (హర్షారెడ్డి),**

**కుమార్తె (సప్ని).**









రెవెన్యూ గృహనిర్మాణం సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పుట్టిన రోజు వేడుకలను నేడు ఘనంగా నిర్వహించేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఊరువాడా సిద్ధం అయ్యింది. కాంగ్రెస్ నేతలు పొంగులేటి అభిమానులు సేవా కార్యక్రమాలకు పిలుపునిచ్చారు రక్తదాన శిబిరాలు అన్నదాన కార్యక్రమాలు బైక్ ర్యాలీలతో హోరెత్తించేందుకు రెడీ అయ్యారు భారీ కటౌట్లు ఫ్లెక్సీలు పురవీధుల్లో ఇప్పటికే ఏర్పాటు చేశారు ఉమ్మడి జిల్లాలోని పొంగులేటి అభిమానులు పార్టీ శ్రేణులు ఆయా ప్రాంతాల్లో జరిగే వేడుకలు సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు సిద్ధమయ్యారు మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన పొంగులేటి చిన్నతనం ఉండే చురుగ్గా ఉండేవాడు చిన్న చిన్న కాంట్రాక్టులు చేస్తూ ఏ వన్ కాంట్రాక్టర్ గా చేసుకుంటూ నేడు మంత్రి దాకా ఎదిగాడు జనం గుండెల్లో చోటు సాధించుకుంటూ ముందుకు వెళు _తున్నాడు

మరణించిన కుటుంబాలకు పిఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా పదివేల రూపాయలు సాయం అందిస్తున్నాడు అంతేకాదు అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ ముందుకెళ్తున్నాడు కష్టం వచ్చిన కుటుంబం కలిసినప్పుడు వాళ్లకు ఏ విధమైన సాయం అందించాలో ఆ విధంగా సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్నాడు

తన తండ్రి పేరు మీద అనేక సేవ కార్యక్రమాలు చేస్తూ ప్రజల గుండెలో చెరగని నేతగా ముద్ర వేసుకున్నాడు

పాలేరు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా పోటీ చేసి విజయం సాధించారు ప్రజలకు ఎప్పుడు అందుబాటులో ఉంటూ కార్యక్రమాన్ని నిర్వహిస్తూ అంతేకాకుండా గతంలో ఖమ్మం మున్నేరు వరద ప్రభావం వల్ల అనేక గ్రామాలు వరద నీటిలో పట్టుకో పోవడం జరిగింది మళ్లీ వరదలు







రాకుండా మున్నేరు చుట్టూ రిటర్నింగ్ వాల్ తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేస్తుంది దానిలో భాగంగా ఎప్పటికప్పుడు అధికారులకు తగిన సూచనలిస్తూ ముందుకు వెళ్తున్నాడు పాలేరు నియోజకవర్గం లో ఇంజనీరింగ్ కాలేజ్ మరియు నర్సింగ్ కాలేజీ బిల్డింగ్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరివేక్షిస్తూ ఆదికాలకు పలు సూచనలు ఇస్తున్నాడు గ్రామీణ ప్రాంతాలలో సైడ్ రైన్ రోడ్లు నిర్మిస్తున్నారు ప్రజలకు ఏ కష్టం వచ్చినా తన కష్టంగా భావించి ప్రజలకు సేవ చేస్తున్నాడు ఇలాంటి నాయకుడు పాలేరు ప్రజలకు దొరకడం తన భాగ్యమని అనుకుంటున్నారు

మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి రెవిన్యూ గృహ నిర్మాణ సమాచార శాఖ మంత్రి తన శాఖల అధికారులతో ఎప్పటికప్పుడు మీటింగ్ ఏర్పాటు చేసుకుంటూ అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ ముందుకు వెళ్తున్నాడు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణంలో మరియు సెలక్షన్స్ లో గాని అధికారులకు దిశా నిర్దేశం చేస్తున్నాడు అంతేకాకుండా రెవిన్యూ విభాగంలో కూడా భూభారతి తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేయడంలో కూడా మంత్రి క్రియాశీలకంగా వ్యవహరించారు సమాచార శాఖ మంత్రిగా ఉంటూ ఎప్పటికప్పుడు అధికారులకు సూచనలు ఇస్తూ మిడియా అకాడమి ఆఫ్ తెలంగాణ స్టేట్ ఆధ్వర్యంలో మరణించిన జర్నలిస్ట్‌లకు లక్ష రూపాయలు నామినికు ప్రతినెల 3000 పిన్షన్ 5 సంవత్సరాల పాటు ఆ కుటుంబంలో చిన్న పిల్లలు ఎల్‌కేజీ నుంచి పదవ తరగతి వరకు చదువుకునే పిల్లలు ఉంటే ఇద్దరు పిల్లలకు ప్రతినెల వేయ్యి రూపాల చొప్పున 2000 వరకు ఇవ్వడం జరుగుతుంది.విదినిర్వహణలో ఉన్న జర్నలిస్ట్‌లకు యాక్సిడెంట్ జరిగినట్టయితే 50వేలు ఇవ్వడం , జర్నలిస్ట్‌లు తమ పై చదువులకోరకు భారతదేశంలో అయితే లక్ష రూపాలు విదేశాలకు వెళ్ళి చదువుట కొరకు 5లక్షల రూపాయిలు ఇచ్చుచున్నారు.

జర్నలిస్ట్‌లకు శిక్షణ తరగతులు ఏర్పాటుచేయడం మరియు ఇప్పుడు భారతదేశం ఎదుగుతున్న దిశలో ఏఐ యుగం మొదలయ్యింది.

దానికి దగ్గట్టుగా జర్నలిస్ట్‌లకు ఏఐ శిక్షణాతరగతులు నిర్వహించడం జరుగుతున్నది.మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ముందుకు తీసుకు వెళ్తున్నాడు

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com